భారతి

డిసెంబరు 1972

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

వెల ఒకరూపాయి

భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938–1972)

★

డిసెంబరు 1972

సంపుటము : 49 :   సంచిక : 12 :

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

డిసెంబరు 1972

రాళ్ళపల్లివారి బాలక శతకము

శ్రీ కుంటిమద్ది శేషశర్మ

జగ మెరిగినవారు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు. అసదృశమైన పాండిత్యము, పాండిత్యమునకు దగిన కవిత, కవిత కనుగుణమగు విమర్శనా నైపుణి, విమర్శకు వన్నెపెట్టు సరసత, అన్నింటిని మించిన గానకళా వైదగ్ధ్యమును వారి ధనములు. వారి సారస్వత కృషి లోకప్రసిద్ధము. జగన్మానితము. తెనుగునందే కాక సంస్కృతమునందును వారి కవిత వెల్లివిరిసినది. ముద్రితమైన వాని గూర్చి చెప్పబనిలేదు. అముద్రితము ఉపక్రాంత పరిత్యక్తము ఈ బాలక శతకము.

తెనుగున శతక వాఙ్మయము శాఖోపశాఖల బెరిగినను సంస్కృతమున అంగుళీ గణనీయము. అందునను శృంగార నీత్యన్యాపదేశ ప్రధానకములే మెండు. శృంగారమువలె హృదయమును ద్రవింపఁజేయునది వాత్సల్య భావము. తత్తుందిలమైన బాలక శతకమును రచింప సంకల్పించినారు శర్మగారు. కాని యెందువల్లనో దానిని కొనసాగించినారు కారు.

నేను విద్యార్థిగా నున్నతరి రెండు శ్లోకములు పుట్టపర్తి నారాయణాచార్యులు చెప్పగా వింటిని. వానిలో నొక్కటి 'వదనముకుశై—' అన్న పద్యము. 35 ఏండ్లయినను స్మృతిపథమునుండి తొలగినది గాదు. ఒకప్పుడు వారు ధర్మవరమునకు వచ్చిన తరి ప్రస్తావవశమున నా పద్యము చదివి, మరొక పద్యమును చెప్ప గోరితిని. అప్పుడు వారు, దానిని చెప్పి,

'బాలక శతకమును వ్రాయదలచి మొదలిడి ఆరింటిని మాత్రము వ్రాసితిని. అది నాటికి నేటికి అంతకే ఉన్నది.' అని ఆరింటిని చెప్పిరి.

వాని భావ సౌకుమార్యము సర్వజనాకర్షకము. శతకము పూర్తియైయుండిన ఎంత హృద్యముగా నుండెడిదో! ఆ యదృష్టము మనకు ఇంతవరకు సమకూరలేదు. ఇప్పుడైనను వారు సంకల్పించిన అదెంత పని! అందుకు భగవంతుడు వారిని ప్రోత్సహించుగాత— అని ప్రార్థితము.

తద్భావాకృష్ట మనస్కుడనై వానిని తెనిగించితిని. ఎంతైనను అనువాద మనువాదమే. అందునను యతిప్రాస లడ్డు దగిలి అనవసర పదములకు చోటిచ్చుచుండును. సంస్కృతమందలి కుదింపు తెనుగున దుర్లభము. సమర్థుల కీ ప్రతిబంధకములు లెక్కలోనివి గాక పోవచ్చును. చేతనయినంతవరకు నా భావములు తెనుగున తేబ్రయత్నించితిని. అంతకంటెను రమ్యముగా ననువదింపగల దిట్టలుండక పోరు. అందుకై మూలముతోబాటు అనువాదమును ప్రకటించుచున్నాను.

ఎందునను ప్రకటితముగాని ఈ సంస్కృత శ్లోక షట్కమును చవి చూచి రసికు లానందింతురు గాక.

ప్రాత స్త్వంత్యజ మందిరం, శ్రయ
ధనోన్మత్తా, నవజ్ఞా, శతం
మౌనేనాపి సహస్వ, శోషయ తనుం
సేవా సువా, మాశుచః;
ఉద్బాహు ద్వయ ముచ్చకై రుప హసన్
లంబాలకః కేవలం
సాయం త్వా మభి గచ్ఛతు ప్రియ తమా
కక్షా ఽవలంబీ శిశుః॥.

వేకువ నిల్లు వీడి చని, విత్తమదాంధుల
నాశ్రయించి, సే

వా కృశ దేహుఁడై శత మవజ్ఞల నోర్చియుఁ,
    జెందఁబోకు మీ
శోకము; పంజ నీదు ప్రియసుందరి చంకఁ
    జలాల కుందునై
నీ కెదురౌత నీ సుతుడు, నిన్ గని నవ్వుచుఁ
    జేతు లెత్తుచున్.

డోలా మధ్యే శిశు మభినవై
    ర్హాస లే శైర్విలాసా
నభ్యస్యన్తీ మని మిష దృశా
    పశ్యతో స్నాతి గేహే
పిత్రోర్మోదం గ్రసతి సహసా
    భ్యుద్గత ప్రాక్పురా సు
జ్యేష్ఠాఽపత్య స్మృతి జనిత శుక్
    నిష్ప్రతీకార తీవ్రా॥

బాలు నరిష్టమందు మురిపెంబుల
    ముద్దుల ముచ్చటించి, యు
య్యాలఁ గదల్చు బిడ్డఁ గనులార్పక
    చూచెడి తల్లిదండ్రి మో
దాళను, ద్రుంచి వైచును తదాత్మజ
    ప్రాజ్మృత పూర్వజాత పు
త్రీ లలిత స్మృతి ప్రభవ తీవ్ర
    నిరర్గళ దుఃఖ వాహినుల్.

రదన ముకుళైః ద్విత్రైర్న్హాత్నోద్గమా
    త్ప్రియ దంశనైః
సపది శిశునా మాతా దష్టస్తనీ
    కృత శీత్కృతిః,
'కి'? మితి సహసా పత్యాపృష్టా,
    'నకించి' ది తీక్షణే
నమయతి మనా గోష్ఠాపాంత
    స్థల న్మధుర స్మితా.

మొలకలు దేరుచున్న పలుమొగ్గల
    రెంటమమూట, దంశనో
త్కలికను, బాలదష్టకుచ తల్లి
    'ఇసీ'యన, నట్లులంటి వెం
దుల?' కని పృచ్ఛసేయు పతితో
    'మరి యేమియులే' దటంచు, చూ
పులఁ—దెలినవ్వు కెంపెదవి
    మోసలఁజిందులు వార—వాల్చెడిన్.

స్నిహ్య ద్బంధు వియోగ శూన్య మనసో
    ర్బాష్ప స్థల త్కంఠయో
ర్దంపత్యో ర్యత మానయోర్వ్రత
    ము దైవాన్యోన్య మాశ్వాసనే,
హస్తాభ్యా మవలంబ్య జానుయుగత్
    మాస్ఫాలయన్ పుత్రకః
చక్రే సస్మిత కౌతుకైర్జగ దిదం
    నైకాంత దుఃఖాకులం.

శోకవ్యాకుల చిత్తమాప్తమ్మృతి.
    న శుక్లిన్న కంఠంబు న
స్తోకా శ్వాస మిథః కృతాఽఫల
    సముద్యోగమ్మనున్ గల్గ జా
యా కాంతుల్, మదిలోఁ దలంత్రు
    జగతిన్ నైకాంత దుఃఖంబుగా,
వ్యాకో చన్ముఖు నాత్త జానువుల
    నాస్ఫాలించు బాలున్ గనన్.


నిషిద్ధాన్యే వాసా పరిమృశతి
    వస్త్రాని నచతై
రభగ్నై స్సంతుష్య త్యథ హసతి
    తర్జాను బహుళం
కథం నిర్వ్యో ఢవ్యో గృహ విధి
    రనే నేతి వివశాం
శిశౌ, పత్నీం పశ్యన్ వికసిత
    ముఖో నందతి యువా.

'వలదను వానికే పెనగు; వక్కలు
    సేయక వాని, పీనికిన్
గలుగదు తృప్తి; తర్జనల నవ్వును పో;
    యెటు లేగుదాన నీ

యలవికి రాని వాని గొని' యంచు నలంగెడి
	యింతిఁ బుత్రునిన్
గలయగఁ జూచి, గేస్తుడు వికావిక నవ్వెడి
	సంతసించెడిన్.

అంతః పంజర వర్తిన శ్శుక శిశో
	రాలాప నైర్మోహి తో
వేగా త్క్రీడనకాని గేహపురతో
	విక్రేతు కామో వణిక్,
అ క్లిష్టాం గృహరంగవల్లి, మవి పర్య
	స్తంచ వస్తు క్రమం
పశ్యన్నేవ, వహ న్నళింద నిహితాం
	పేటీం, పునః ప్రస్థితః.

పొరబడి పంజరస్థ శుక పోతము
	పల్కులచేత, వచ్చి స
త్వరముగ నాట బొమ్మలను వర్తకు
	డమ్మను, చూచి ముంగిటన్
సరకుల రంగవల్లికల సక్రమ పద్ధతి
	నున్నవానిఁ జె
చ్చెర దన బుట్ట నెత్తికొని, చెప్పకయే
	పయనంబు గట్టెడిన్.



పండితరాయల నిట్టూర్పులు

డా. మహీధర నళినీమోహన్

హంస

ఒక మహాపండితుడు తన విద్వత్తు ప్రదర్శించి భుక్తికోసం ఏ మాన్యమో సంపాదించుకుందామని రాజదర్శనంకోసం రాజధానీ నగరానికి బయలుదేరేడు. ఇంటి దగ్గర అతడి ఇల్లాలు తన భర్తకి జరుగబోయే గౌరవాదరాలను పదే పదే తలుచుకుంటోంది.

'ఈ పాటికి మా వారిని రాజుగారు ఏనుగు ఎక్కించి ఊరేగిస్తూ ఉంటారు. ఏ అగ్రహారం కావాలో కోరుకోమని అంటారు. ఆయనకి బొత్తిగా మొగమోటం. నసిగేస్తారో ఏమో. నా కోసం ఓ కట్లు కాసులపేరు బేరం చేస్తూ ఉండి ఉంటారు, వెళ్లే ముందు మరోసారి జ్ఞాపకం చేశానుకూడానూ......' ఇల్లాలి పగటి కలలు కంటూన్న ఆ తపస్వినికి ఏం తెలుసూ, అవతల తన భర్తకి రాజదర్శనమే కాలేదనీ, చికిలీ తీసిన కత్తుల్లాంటి దివాణపు బంట్రోతులు ఆయన మెడపట్టి వీధిలోకి గెంటేశారనీ, మోకాటి చెప్పులు డొక్కుపోయాయనీ, చిరిగిన బట్టలతో, కటిక ఉపవాసంతో సత్రపు అరుగుమీద కూలబడిపోయాడనీనూ?

ఒక ఆడ హంస దూరాన ఉన్న తన భర్తని తలుచుకుంటోందిట. 'సువిశాలమైన ఏదో మంచి తామరకొలనులో ఈతలాడుతూ, కమ్మని తమ్మి తూడులు కడుపునిండాతిని, తామర పుప్పొళ్లతో పచ్చబడిన రెక్కలతో, పెళ్లికొడుకులా ఉండి ఉంటాడు నా ప్రియుడు' అని. కాని, పాపం దానికేం తెలుసూ అసలు సంగతి? ముక్కుతో బురద కుళ్లగిస్తూ, తినడానికి నాచుపిసరైనా దొరకక, ఎగరడానికి రెక్కలలో సత్తువ చాలక, ఉపవాసాలుచేస్తూ అక్కుపక్షిలా ఉన్నాడని.

శార్దూల విక్రీడితం

హంసీవేత్తి పరాగ పింజర తనుః
కుత్రాపి పద్మాకరే
ప్రేయాన్ మే బిస కందళీ కిసలయం
భుంక్తేహ్యయం నిర్వృతః
నో జానాతి తపస్వినీ యదనిశం
జంబాల మాలోడయన్
శైవాలాంకుర మప్యసౌ న లభతే
హంసో విశీర్ణ చ్ఛదః.

శార్దూల విక్రీడితం

నా నాథుండు పరాగ మంటిన మెయిన్
పద్మాకరమ్మందు నెం
దేనిన్ సుష్టుగ నబ్జముల్ మెసవుచున్
హేలన్ ప్రవర్తించు నం
చా నందించెడు హంసి యే మెరుగు
పంకా లోడన ప్రక్రియన్
దీనుండైన మగండు నాచు పిసరేనిన్
లేక వస్తుండుటల్.

* * *

షాజహాను సార్వభౌముని దర్బారులో తనకు జరిగిన కనకాభిషేకాలలో తలమీదనుంచి జారిపడిన బంగారు కాసులను 'తల కడుగు నీళ్లు తాగుతానా?' అని తృణీకరించి, నలుగురికీ పంచిపెట్టేసిన పండితరాయలు ఔరంగజేబు పాలనలో దేశాలు పట్టిపోయి, స్వయంపాకం దొరికితే చాలు, మేరువు దొరికినటు సంతోషించే దుస్థితి వచ్చింది.

దేవేంద్రుడి పట్టణంలో నాట్య సంరంభంలో రంభ చెవిలో పెట్టుకున్న మందారప్పువ్వు జారిపడగా,

సువాసనలతో గుబాళిస్తున్న వియద్వాహినీ జలాలను పూర్వం అలివోకగా పుక్కిలించిన రాజహంస ఈనాడు దిక్కుమాలినదై పామర స్త్రీలు కాళ్లు కడుక్కునే పడియలలో కప్పలతో, బురదతో కంపు కొడుతున్న నీళ్లను మహాప్రసాదంగా భావించి తాగుతున్నదే-- అయ్యో ఏమి దుర్గతీ!

శార్దూల విక్రీడితం

పీతం యేన పురా పురందర పురే
రంభోరు కేళి స్థల
న్మందారాం కుర కర్ణపూర సురభి
స్వర్గాపగాయాః పయః
సోఽయం మారవవారి పామర వధూ
పాదార్పణ ప్రోచ్ఛల
త్పంకా తంకిత భేక భిన్న మఘృణో
హంసః సమాశంసతే.

శార్దూల విక్రీడితం

ఏ రాయంచ సురేంద్రు పట్టణమునన్
హేలాప్సరః కేళిలో
జారీజారని కర్ణ పద్మ సురభి
స్వర్గాపగా నీరముల్
నోరారన్ మున్రుతాగెనో యతడు
గ్రోలున్నేడు మండూక పం
కా రూఢమ్ములు పామరీ పదరజో
వ్యాప్తాంబువుల్ తృప్తిగన్.

*　　*　　*

సింహం

భట్టోజీ దీక్షితులు, అప్పయ్య దీక్షితులువంటి దిగ్దంతులను ఖండించి, తన పేరుచెప్తే చాలు విపక్ష పండితమండలికి కాళ్లు జవజవలాడి పోయేటట్లు సాహిత్యరణ రంగంలో దుర్నిరీక్షుడై అర్ధశతాబ్దంపాటు విశృంఖలంగా వీరవిహారం చేసిన పండితరాయలు ప్రస్తుతం ముసలివాడై పోయాడు. గట్టిగా మాట్లాడే ఓపిక లేదు. ప్రతికక్షుల నోళ్లు మూయించాలనే ఇచ్ఛకూడా లేదు. ఎవరేమి కూసుకుంటే నాకేమీ అనే నిర్లిప్తత వచ్చింది. తన ప్రస్తుత స్థితిని జవసత్వాలు ఉడిగి చివికిపోతున్న సింహపు అధోగతితో పోల్చి దయనీయంగా వర్ణించాడు అనేక శ్లోకాలలో. మచ్చుకి ఒకటి.

పడుచు దనంలో కొండ కొమ్ముల మీదనుంచి అవలీలగా దూకేసి, మత్తేభ కుంభస్థలాలను అలవోకగా పగులగొట్టి, వందలకొద్దీ కొండలోయల మీదుగా కుప్పించి దూక గలిగిన సింహం ప్రస్తుతం ముసలిదై, మూలుగుతూ ఉంటే గాడిదలు దాని గుహా ద్వారం దగ్గర చెవులు పగిలేటట్లు ఓండ్ర పెడుతున్నాయి.

వసంతతిలక

ఉత్ఫ్లుత్య యః శిఖరిణం మదకుంభి కుంభ
ముద్భిద్య సానుశత మాయత ముల్లలంఘే
పంచాననో నియతయా జరయాభి భూతః
సోఽయం ఖరే విలతి బృంహతి లోహితాక్షః

శార్దూల విక్రీడితం

శైలాగ్రంబుల పేలగా దుమికి, పంజా
దెబ్బ నుద్దండ శుం
డాల శ్రేణుల కుంభముల్ చెవికి,
ఉల్లంఘించెనో సానువుల్
లీలన్—తన్మృగ సార్వభౌముడు జరా
క్లేశంబునన్ మూల్గ నీ
వేళన్ గాడిదలోండ్ర పెట్టెను గుహల్
వేమార్లు మ్రోయగన్.

*　　*　　*

యువరాజు దారాషకో (దారాహ్ శికో అని పారశీకపు ఉచ్చారణ)తో కలిసి, కుమావు కొండలలోకి వేటకి వెళ్లిన పండితరాయలకి అడవులలో ఉండే కొండ జాతి పిల్లలు కొందరు కనిపించారు. వాళ్ల మెలల చుట్టూ నిగనిగా మెరిసే అందమైన మొలతాళ్లు ఉన్నాయి. వాటి సంగతి వాకబు చేయగా అవి సింహం తాలూకు జూలుతో పేనిన మొలతాళ్లు అని తెలియ

వచ్చింది. జగన్నాథుడు నిట్టూరుస్తూ దారా కళ్లల్లోకి చూచాడు.

తాను బ్రతికినంతకాలమూ వన భూములన్నీ మహా గజేంద్రములకు సైతమూ దుర్గమములు అయ్యే టట్లు స్వైరవిహారంచేసిన మృగాధినాథునికి ఎటు వంటి దురవస్థ పట్టింది! వేలేసి ముట్టుకోడానికి సాధ్యంకాని ఆ జూలు ఈనాడు ఈ శబర శిశువుల మొలతాళ్లుగా మారిందా? అయ్యో!

ఆర్యా

యస్మిన్ జీవతి సింహే
వన మిద మాసీత్ దురాసదం ద్విరదైః
ఘట యంతే కటి సూత్రం
తస్య సటాభిః శబర శిశవః

తేటగీతి

బ్రతికి నన్నాళ్లు వారణ ప్రతతి కెల్ల
ప్రక్కలో బల్లెమైన హర్యక్ష విభుని
సటల కెటువంటి దురవస్థ సంక్రమించె
కోయపిల్లల మొలత్రాళ్ల కొరకు నయ్యొ.

*　　*　　*

తుమ్మెద

ఒక గండు తుమ్మెద బంగారు వన్నెలో ఉన్న అర విచ్చిన మొగలిపువ్వును చూచింది. జగద్విఖ్యాతమైన దాని సౌగంధ్యానికి మురిసిపోయింది. పద్మం అని భ్రాంతి పడింది. ఇంక వెనుకముందులు ఆలోచించుకో కుండా పరుగు పరుగున వెళ్లి మొగలిపువ్వులో పడింది. అక్కడ తాగడానికి తేనె పిసరంత కూడా దొరకలేదు సరికదా, దాని పుప్పొడి కళ్లల్లో పడి గుడ్డిదై పోయింది. ఆ బాధ భరించలేక బయటికి పోదామని ప్రయత్నిస్తూ ఉండగా ముళ్లు గుచ్చుకుని దాని చిన్నారి రెక్కలు తూట్లు పడిపోయాయి. ఎగిరి పోవ డానికిగానీ, నిలువబడడానికిగానీ శక్తి లేనిదై, దేవుడా అని కూల బడిపోయింది.

దీనుడైన యాచకు డొకడు జమీందారుగారి దేవిడీ, గుర్రపుబగ్గీ వగైరా అట్టహాసమంతా చూచి, ఏమైనా దొరుకుతుందేమోనని ఆశపడి దివాణంలోకి వెళ్లేడు. అక్కడ ఏమీ రాలలేదు సరికదా కావలి కుక్కలు అతడి మీదపడి బట్టలు చింపి, ఒళ్లంతా పీకి పీకి వదిలిపెట్టేయి.

మందాక్రాంతా

గంధా ఢ్యాసౌ జగతి విదితా
కేతకీ స్వర్ణవర్ణా
పద్మ భ్రాంత్యా రసిక మధుపః
పుష్పమధ్యే పపాత
అంధీ భూతః కుసుమ రజసా
కంటకై ర్భిన్న పక్షః
స్థాతుం గంతుం క్షణ మపి సఖే
నైవ శక్తో ద్విరేఫః

చంపకమాల

పసిడి మెరుంగుతో దెసల వాసనలన్
విరజిమ్ము కేతకీ
ప్రసవము గాంచి పద్మమను భ్రాంతి
ద్విరేఫము లోన దూరి, త
త్కుసుమ మధూళి కాంధమయి,
దుర్భర కంటక భిన్న పక్షమై
ఉసు రుసు రంచు మూల్గి కొనయూపిరితో
నెటు బోవలేనిదై.

*　　*　　*

ఆకలిగా ఉన్న గండుతుమ్మెద ఒకటి మేత ఏమైనా దొరుకుతుందేమోనని తెగ తిరిగింది. శోష వచ్చి కళ్లు తిరుగుతున్నాయి. అంతలో ఓ ఎత్తైన చెట్టుమీద ఎర్రని అరవిచ్చిన పువ్వు ఏదో కనిపించింది. అది మోదుగు పువ్వు అనుకుని, చటుక్కున ఎగిరి అందులో వెళ్లిపడింది. తీరాచూస్తే అది మోదుగు పువ్వుకాదు. తెరచి ఉన్న చిలక ముక్కు! చిలక ఊరు కుంటుందా? కటుక్కున నొక్కింది. తుమ్మెద గిల గిల లాడి పోయింది. తేనె దొరకక పోతే పీడా పోయింది గానీ, కాళ్లు విరగకుండా బతికి బయట పడితే చాలు నని గిజాయించు కుంటోంది.

వసంతతిలక

భృంగః క్షుధాకులరసి కింశుక విభ్రమేణ
వ్యా జృంభమాణ శుక చంచుపుటం ప్రవిష్టః
ఆశాం విహాయ మధునోఽ వయమైః సమగ్రై
ర్నిర్గంతు మిచ్ఛతి పరం పరితప్యమానః

మత్తేభ విక్రీడితం

భ్రమరం బొక్కటి ఆకటన్ దిరుగుచున్
రక్తచ్ఛటన్ కింశుక
భ్రమచే విచ్చిన చిల్క ముక్కునను
దూరంబోయె నొక్కుమ్మడిన్
సుమనః ప్రీతియు తేనె మీది మనసున్
పోనాడి వెన్వెంటనే
యమబాధన్ బయలన్ బడన్ వలయు
నంచా శించె ప్రాణాలతో.

* * *

పండితరాయలకి ఎక్కడికి వెళ్ళినా ఇబ్బందులు (?) తప్పడం లేదట. ఏమిటా ఇబ్బందులు? దర్బారుకి వెడితే 'మరొక్క శ్లోకం—మరొక్కటంటే ఒక్కటి—వినిపించండి' అని షాజహాను చక్రవర్తి విసిగిస్తాడు.

యువరాజా వారి భవనానికి వెడితే 'అల్లోపనిషత్తు ఎంతవరకూ వ్రాశార'ని వేపుకు తింటాడు దారా షకో.

సాయంకాలం వాహ్యాళికి వెళ్లబోతే శిష్య ప్రశిష్యులూ, యువన విలాసినులు పాదం నేలమీద మోప నివ్వరు.

లవంగిని చూసి పోదామని ముచ్చటపడి వెడితే ఆమె బాహుబంధంలో రాత్రి అంతా చెరసాలే.

తుమ్మెదకి కూడా ఇటువంటి కష్టాలే ఉన్నట్లున్నాయి. తేనె తాగుదామని తామరపువ్వులలో వాలితే రాత్రి అంతా ముకుళించిన పద్మములలో బందీ అయిపోతుంది.

ఏనుగుల దగ్గరకు వెళ్లి వాటిమీద కారే మద జలాన్ని తాగుదామని ముచ్చట పడితే వాటి పుట్టి అంతా మునిగినట్లు చెవి చేటలు ఊపుతున్నాయి మత్తేభములు. అవి తగిలితే ఇంకేమైనా ఉందా?

పోనీ సంపెంగ పువ్వుల దగ్గరకు వెడదామా అంటే వాటి చిక్కని పరిమళాల మత్తుకి ప్రాణాలే పోతాయో ఏమో.

పాపం తుమ్మెదకి ఎక్కడికి వెళ్లినా దుఃఖమే రాసిపెట్టి ఉందికదా!

ఉపజాతి

ప్రబంధనం పద్మవనే నిశాయాం
మాతంగ దానే మదకర్ణతాళః
స్వప్రాణ భంగః ఖలు చంప కేస్మిన్
సర్వత్ర దుఃఖం భ్రమరస్య లోకే.

ఉపేంద్ర వజ్ర

సరోజ పంక్తిన్ చెరసాల రేలన్
కరిశ్రవ స్తాడన దాన మందున్
తొరంగు ప్రాణంబులు చంపకాళిన్
ద్విరేఫ మొందేగిన దుఃఖ మయ్యోన్

* * *

రామచిలుక

దారాషకో ఎంతటి పండితుడు! ఉపనిషత్తులను పారశీక భాషలోకి ఎంత అందంగా అనువదించాడు! అతడిది ఏమి సౌందర్యం! ఏమి సౌశీల్యం! ఏమి ఔదార్యం! ఏమి సౌమనస్యం! అపురూపమైన ఈ మహాలక్షణాలలో ఏ ఒక్కటీ కూడా ఔరంగ జేబు కత్తినుండి అతడిని కాపాడలేక పోయిందికదా! అయ్యయ్యో!

ముద్దుముద్దుగా పెంచుకుంటున్న రామచిలుకను గండుపిల్లి పొట్టను పెట్టుకుంది. అది ఎంత అందమైన పిట్ట! ఎంత ముద్దుగా మాట్లాడుతుంది! ఏమి సోయగాలు పోతుంది! ఏమి సౌశీల్యం దానిది!

ఇన్నిమంచి లక్షణాలూ ఆ పాడు పిల్లి ముందు గుడ్డి గవ్వకి కొరగాక పోయాయి కదా!

అనుష్టుప్

సుభాషిత్వం సురూపత్వం
వాచాలత్వం సుశీలతా
ఏత త్కీర కిశోరస్య
వ్యర్థమాఖు భుజః పురః

ఆటవెలది

చక్కనైన రూపు, సౌశీల్య గరిమంబు
మాటకారితనము, మంచివాక్కు
ఎన్నియున్ననేమి యీ రామచిలుకకు
గండుపిల్లిముందు దండుగయ్యె.

*　　　　*　　　　*

ఒక బిచ్చగాడికి దూరాన పెళ్లిపందిరి కనిపించింది. తింటూ తింటూఉన్న జోలె లోని మధూకరపు పొడితడి అన్నపుకరుళ్లమీద అసహ్యంపుట్టి, వాటిని మురుగు కాలువలో విసిరికొట్టి, పరుగు పరుగున ఆ పందిట్లోకి వెళ్లేడు. అక్కడ పందిరి వేసినది ఇల్లాంటి బిచ్చగాళ్ల కడుపులు నింపడానికి కాదు. బయటికి గెంటే తోపిడిలో కిందపడ్డాడు. చెయ్యి బెణికింది. మురుగు కాలవలో తేలుతున్న అన్నపు కరుళ్లు అతడిని వెక్కిరించాయి.

చిలుక ఒకటిదూరాన ఎత్తైన కొబ్బరిచెట్టును చూచింది. గాలికి ఊగిసలాడుతున్న దాని మొవ్వులో పెద్దపెద్ద గెలలు కన్నులపండువుగా ఉన్నాయి. అంతలేసి కాయలని చూచిన కళ్ల తాను తింటూన్న ధాన్యపుగింజలను చూడగా రోతపుట్టి, ఎన్నులు జారవిడిచి, రివ్వున ఆ కొబ్బరిచెట్టుమీదికి ఎగిరివెళ్ళి, కాయలను ముక్కుతో పొడవ సాగింది. ఒక్కకాయ పగులలేదు సరికదా, దాని ముక్కు పచ్చడైపోయింది!

శార్దూల విక్రీడితం

ఉచ్చైరేష తరుః ఫలంచ విపులం
దృష్ట్వైవ హృష్టః శుకః
శాలే రాస్య గతం విరస్య కణిశం
తన్నారికేళం గతః
తత్రా రుహ్య బుభుక్షి తేన మనసా
యత్నే కృతే భేదనే
ప్యాశాతస్య న కేవలం విఫలితా
చంచూర్గతా చూర్ణతామ్

చంపకమాల

తరువది యున్నతం బనుచు తత్ఫలముల్
విపులంబు లంచు సం
బరమున నెన్నులం దినుట మాని శుకం
బొక నారికేళమున్
దరిసి, ఫలంబు విచ్చ బహుధా
శ్రమియించెను ముక్కు పోటులన్
హరిహరి! తచ్ఛ్రమంబు వృథయై
శుక తుండము చూర్ణమై చనెన్.

*　　　　*　　　　*

తంజాపురాధీశుని ఆడంబరాదికం చూచి, అతడి ఈవి కూడా దానికి తగ్గట్టుగానే ఉంటుంది కాబోలు నని ఆశపడి ఒక పండితుడు ఆ సంస్థానంలో ప్రవేశం కోసం చాలాకాలం పడిగాపులు పడ్డాడు. ప్రవేశం అయితే దొరికింది కానీ, ఫలితం మాత్రం శూన్యం. పైగా తనవెంట తెచ్చుకున్న నాలుగు మాడలనూ దివాణపు నౌకర్లూ చాకరూ ఒడుక్కుపోయారు.

బూరుగుచెట్టు ఒకటి సువిశాలంగా పెరిగి ఉంది. ఎర్రని దాని పువ్వులు కళ్ళు చెదరగొట్టేస్తున్నాయి. అది కాయబోయే పళ్లు కూడా వాటికి తగ్గట్టే బహుమధురంగా ఉంటాయి కాబోలునని ఒక రామచిలుక చాలాకాలం ఎదురుచూచింది. ఆఖరికి కాయలు కాచాయి, పండనూ పండేయి. ఆత్రంగా కాయలు పగులగొట్టి చూచింది. దాని నోటిలోకి నిస్సారమైన పత్తి తప్ప మరేదీ రాలేదు. అంతలో పెద్దగాలి వీచి ఆ దూది కూడా దక్కకుండా దూరంగా కొట్టుకు పోయింది.

శిఖరిణి

విశాలం శాల్మల్యా నయన
సుభగం వీక్ష్య కుసుమం
శుక స్యాసీ ద్బుద్ధిః ఫలమపి
భవే దస్య సదృశమ్
ఇతిధ్యాయన్నాస్తే ఫలమపిచ
దైవా త్పరిణతం
విపాకే తూలోంత స్సపది మరుతా
సోఽప్యప హృతః

ఉత్పలమాల

బూరుగు చెట్టు పెద్దదని, పూవులు
కన్నుల పండువయ్యె, ఈ
తీరుననే ఫలంబులును దీనికి
కల్గునటంచు నాసతో
కీరము వేచి చూడ దొడగెన్—
పసిపిందెలు పండి తూల సం
పూరితమయ్యె—కొట్టుకొని పోయెను
దూదియు గాలి వీవగన్.

*　　　*　　　*

లేడి

చంద్రునిలో కనబడేమచ్చ లేడి పోలికలో ఉంటుంది కనుక అతడికి మృగాంకుడనే పేరు రావడం అందరకూ తెలిసినదే. కాని భూలోకంలో నివసించే లేడివెళ్లి చంద్రునిలో ఎందుకు మకాం పెట్టవలసివచ్చిందో చాలామందికి తెలియదు. ఆ కారణాన్ని పండితరాయలు వివరిస్తున్నాడు.

భూలోకంలో అయితే బోయవాళ్లు బాణాలు వేసి చంపుతారు. చంద్రునిలో బాణాల భయం లేదు. అక్కడ దావానలం లేదు. భయంకరమైన ధ్వనులు లేవు. ఉచ్చులూ, వలలూ లేవు. కనుక భూలోకం కన్న చంద్రలోకమే నిరపాయకరమైనదని ఊహించి, జింక చంద్రునిలో కాపరం పెట్టిందట. కాని అక్కడ దానికి బ్రహ్మగారు రాహువు వాడి కోరల గాట్లు విధించాడని ఎరగదు గదా! గ్రహణ సమయంలో రాహువు చంద్రుణ్ణి మింగడానికి ప్రయత్నిస్తాడన్నది ప్రసిద్ధమైన విషయం.

శార్దూల విక్రీడితం

నాత్ర వ్యాధ శరాః పతంతి పరితో
నైవాత్ర దావానలో
నైవోచ్చా వచ భీతి రత్ర చపలా
నైవాస్త్రతా వాగురా
ఇత్యా లోచ్య కురంగ కేణ విహితో
నక్షత్ర నాథాశ్రయః
కోజానాతి విధిర్వి ధాస్యతి పునః
స్వర్భాను దంత వ్రణమ్.

మత్తేభ విక్రీడితం

ఇచటన్ లేవు కిరాత బాణములు,
లే దిచ్చోట దావానలం
బిచటన్ లేవు భయంకర ధ్వనులు,
లేవిచ్చోట నుచ్చుల్ వలల్
ఉచిత స్థానమిదే యటంచు హరిణం
బూహించి చేరెన్ శశిన్
అచటన్ బ్రహ్మ విధించె నంచెరుగదా హా
రాహు దంత క్షతుల్

*　　　*　　　*

ఒక లేడియొక్క దురవస్థని వర్ణిస్తున్నాడు.

బోయవాడు పన్నిన ఉచ్చు తగిలి కాలి గిట్టలు విరిగేయి. బాణాలు తగిలి ఒళ్లంతా రక్తధారలతో తడిసిపోయింది. ఒకమూల దావాగ్ని సెగకి పిచ్చి ఎక్కిపోతోంది. అటువంటి లేడి చచ్చి చెడి ఒక ముని ఆశ్రమాన్ని చేరుకుంది. ఇంక భయం లేదనీ, ఋషీశ్వరుడు తనకి అభయం ఇస్తాడనీ ఆశ పడింది. కాని, 'భయ పడకు' అని బుజ్జగించడానికి కూడా లేకుండా ఆ రోజున ఆయనకి మౌనవ్రతం అడ్డువచ్చింది!

శార్దూల విక్రీడితం

పాశ క్షుణ్ణ ఖురస్య బాణ పతన
ప్రవ్యక్త రక్త చ్ఛటా

ఛ్ఛన్నాంగస్య దవాగ్ని దాహ వికల
స్యా సేదుషోఽప్యా శ్రమమ్
ధిగ్ద్వావం విషమా మృగస్య దివసాః
సర్వాను కంపా మయో
మాభై షీరితి భాషణేఽపి యద భూ
ద్వా చం యమోఽయం మునిః.

మత్తేభ విక్రీడితం

వలచే గిట్టలు సొట్టలై, శరహత
ప్రవ్యక్త రక్తావగన్
నిలువెల్లన్ తడి ముద్దయ్యె దవ
మహాగ్నిన్ పిచ్చిదై ఆశ్రమ
స్థలి కేతెంచిన జింక కింకను నవస్థల్
తప్ప వయ్యెన్—దయా
మయు డయ్యున్ బుషి బుజ్జగింప డకటా!
మౌనవ్రతం బూనుటన్.

*   *   *

ఒక లేళ్లజంట అడవిలో ఆనందంగా ఆడు కుంటోంది. బోయ వాడు గురిచూచి వదిలిన బాణం తగిలి, ఆడ లేడి నేలకి ఒరిగి పోయింది. కిరాతుని భయంకరమైన కోరచూపులు మగలేడి హృదయంలోంచి దూసుకు పోయాయి. బాణం దెబ్బతగిలిన లేడి ప్రాణాలు వదిలేసి, నొప్పిలేనిది అయింది. అది అదృష్ట వంతురాలే. కాని, విషపుచూపులు గుండెలో గుచ్చు కున్న దుప్పి మాత్రం ఆ జన్మాంతమూ మనోవ్యాధితో కృశిస్తూనే ఉంది!

ఉపజాతి

విద్ధామృగీ శాత శిలీ ముఖేన
మృగస్తు తత్కాతర వీక్షితేన
విహాయ దేహం విగత వ్యథైకా
పరస్య జీవా వధి రాధి రాసీత్.

పంచచామరం

కురంగి బోయ వాని వాడికోల
దెబ్బచే బడెన్
కిరాత కాత రేక్షణోగ్ర కీల
సోకె దుప్పికిన్
తొరంగి దేహమున్ కురంగి
నొప్పి లేని దయ్యె, దు
స్తరాధి బాధ తప్పదయ్యె
జన్మమెల్ల దుప్పికిన్.

*   *   *

చంద్రుడు

త్రిలోకాధీశ్వరుడైన శంకరుని శిరస్సుమీద చంద్రుడు మహబాగా బైఠాయించాడు, అదృష్టం అంటే అతనిదీ, అని లోకులు అనుకుంటూ ఉంటారు. కాని, శివుని మూడోకంటి చిచ్చుకింద నుండి సెగపెడుతూ ఉంటే ఆ శీతకరుడు పడే బాధ ఇతరులకి ఏం తెలుస్తుంది?

'హమేషా పాదుషా వారి సన్నిధిని ఉంటూ ఉంటాడు, అతడికేమీ, అదృష్టవంతుడు' అని ప్రజలు అనుకుంటే అనుకో వచ్చు గానీ, 'అత్యాసన్నాశ్చ రాజానః' అనే ఈతి బాధ పడే వాళ్లకి తప్ప తెలియదంటు న్నాడు పండితరాయలు.

వసంతతిలక

ఆస్తే విధుః పరమ నిర్వృత ఏవ మౌళౌ
శంభో రితి త్రిజగతీ జనచిత్త వృత్తిః
అంతర్నిగూఢ నయనానల దాహదుఃఖం
జానాతి కః పరమృతే బత శీత రశ్మేః

ఉత్పలమాల

శంకరుమస్తకాగ్రమున చాల
సుఖమ్ముగ తిష్ఠవేసె నీ
పంకజవైరి యంచు జనవాక్యము
కద్దు ప్రపంచమందు—మీ
నాంక విరోధి ఫాల నయనా నల
దాహ భయంక రార్తి నే
డాంకు డొకండు తక్క పరు లారయ
నేర్తురె? బాప నేర్తురే?

*   *   *

దైవోపహతుడు ఎక్కడికి వెడితే అక్కడికి ఆపదలు తరుముకు వస్తాయని భర్తృహరి చెప్పిన 'ఖల్వాటో దివసేశ్వరస్య కిరణైః' అన్న శ్లోకాన్ని తలదన్నే కల్పన చేశాడు పండితరాయలు.

బడబాగ్నికి భయపడి తన జన్మభూమి అయిన సముద్రాన్ని విడిచిపెట్టి చంద్రుడు మహేశ్వరుని శిరోగ్ర భాగాన్ని స్వీకరించాడు. అక్కడ శివునికి అలంకారములుగా ఉంటూన్న పాముల బుసబుసలలో వెలువడే విషాగ్ని జ్వాలలకు భయపడి, ఆ చోటు వదిలి పెట్టి ఆకాశాన్ని చేరుకున్నాడు. అక్కడమాత్రం ఏం ఒరిగిందీ? రాహువు నోట్లోపడ్డాడు. భాగ్యహీనులను ఎప్పుడూ ఆపదలు వెన్నాడుతూనే ఉంటాయి కదా!


శార్దూల విక్రీడితం

భీతో బాడవ వాసతో జలనిధౌ
శంభోఃశిరః స్వీకృతం
తత్రత్ర్యంబక మౌళి వాసుకి విష
జ్వాలా వళీ త్రాసితః
తస్మాల్లోక మగాదిమం నిపతిత
స్తత్రైవ రాహోర్ముఖే
ప్రాయో గచ్ఛతి యత్ర భాగ్య రహిత
స్తత్రైవ యాంత్యా పదః

మత్తేభ విక్రీడితం

జలధిన్ బాడబ భీతిచే విడచి,
తచ్ఛంభూత్తమాంగోపరి
స్థలి జేరన్—అట భీషణోరగ విష
జ్వాలావళీ త్రస్తుడై
నెలరాజంబర వీధి జేర నతనిన్
వేధింపగా సాగె పే
రలుకన్ రాహువు—భాగ్యహీనులను
వెన్నాడుం గదా యాపదల్.

(సశేషం)



క్రాస్ రోడ్సు

శ్రీ జి. వి. సుబ్బారావు

జీవితరథం, జవసత్త్వ, ఊహాసత్త్వ
పవనాశ్వాలతోవచ్చి ఆగింది
క్షణకాలం—
రహదారుల కూడలిలో
క్రాస్ రోడ్డులో!!–

ఉన్న నాలుగు మార్గాంతరాలు
ఊహా పథాని కందని విహంగాలు,
కను చూపు మేరలో ఆశా లతాంతాలు
కల్పించి, ఊరించే ఒయా సిస్సులు!—

తొలి చూపులో తెలి రేకలు,
ఎదిగే కొలది ఎఱ్ఱని మంటలు,
క్షణ క్షణాన విసిరే వేడి నిట్టూర్పులు,
ఇది తూరుపు పొద్దు విరిసిన వడగాడ్పులు!

మలి చూపులో అరుణారుణ రేఖలు,
ఒదిగే కొలది కాళ రాత్రి నీలిమలు,
క్షణ క్షణాన ముసిరే శీతల వాయు వాహినులు,
అది–మలిసంజ వెలసిన గాఢ తమాల చ్ఛాయలు!
హిమగిరిశృంగాలు నిమ్నభావ శిఖరాలై,
భాగీరథీ పయస్సులు భగ్న జీవన సుధలై,
వింధ్యాద్రి కుహరాలు క్రుద్ధాగస్త్య విహారాలై,
ఉత్తరాపథం ఉద్రిక్త భావ మథనం!

కన్యాకుమారీ నయనాంచలాలు కవోష్ణ జల బాష్పాలై,
కావేరీ వినీల తరంగాలు కల్లోల భావ తరంగాలై,

క్రాస్ డ్సు

నీలాద్రి సిత శిఖరాలు నిరంతర విప్లవ శృంగాలై
దక్షిణాపథం రక్తాశ్రు గాథా నిధానం!

సమభావం, నవశక్తి, శ్రమజీవుల పథాలను,
చైతన్య లహరులై, మానవతా వికాసులై,
విహరింపగా పొగడాను నేను!

గతంలో మంచినీ, సంప్రదాయంలో సత్పథాన్నీ
గతులు దప్పగా ముంచే, విచిత్ర భావోద్వేగ వాహినుల—
ఉప్పెనల కూడలిని కుప్పగా కూలాను నేను!
పాతపాఠాలు నెమరేసే కాపిటలిస్టులు
సంక్షేమ రాజ్యాలు స్వప్నాలుగనే పోషలిస్టులు,
కర్కశంగా సంఘాన్ని కుదిపే మార్క్సిస్టులు,
నెక్‌లు చెక్కడంలో సక్సెస్ గడించే నక్సలైట్లు

భిన్న నినాదాల హోరన్న హోరులో,
చతుష్పథంలో చతుష్పాదాలలా,
సంఘం ప్రగతికి ఆటోమేటిక్ బ్రేకులా,
అంతా వదుస్తున్నారు వడిగా ఈ కూడలిలో!

గొంతెత్తి కూస్తున్నారు జాతికి గుణపాఠాలు,
వంతలు పాడుతున్నారు వందిమాగధులు, ఉపనాయకులు,
వేదిక లెక్కి మాలలతో వర్షిస్తున్నారు వాగ్దానాలు,
పరిభ్రమిస్తున్నారు నాయకమ్మన్యులీ క్రాస్‌రోడ్సులో!

అయినా —
కుళ్ళు కుళ్ళుగానే మిగిలింది
సంఘం డస్ట్‌బిన్‌లో,
అవినీతి మఱ్ఱి ఊడలా
లోతుగా పాతుకుంది లోకంలో —!
కుట్రలూ, ఖూనీలూ,
రాజకీయాలూ, దోపిడలూ,

అవిచ్ఛిన్నంగా, దినకృత్యంగా,
జరుగుతున్నాయి ఈదేశంలో—!

పేదవాడు మరీ బీదవాడుగా,
ఇజాలే నిజాలుగా,
బ్రతుకు బరువుగా,
మృత్యుముఖంగా,
నడుస్తూంది, సామాన్యుడికి,
ఏమీ లేనివాడికి!

ఈ చతుష్పథంలో—
చతురాస్యుని సృష్టికి మిన్నగా,
విశ్వామిత్రి సృష్టికి విభిన్నంగా,
విభేదాలు, ద్వేషాలు, విలయాలు
విశృంఖలంగా సృష్టింప బడుతున్నాయి—
అందుకే అంధునిలా, జాత్యంధునిలా,
నిరాశతో, నిస్పృహతో
దిగాలుపడి, దిక్కు తెలియక,
కుప్పగా, కూలబడ్డా, నీ
క్రాస్ రోడ్సులో!

సంగీత సాహిత్య మేళనంతో,
భక్తిపారవశ్యంతో,
త్రివేణీ సంగమంలా పొంగిన
త్యాగయ్య దొక దారి!

ఆత్మాశ్రియంగా
సంగీతామృతం కురిపించిన
మీరా భజన లహ
లొక తెరువు!
బహువిధ వాద్య సమ్మేళనం
వినూత్న భావ సంభరితం
పాశ్చాత్య గీతా
సంప్రదాయ మొక రీతి!

క్రాస్ రోడ్సు

పరం పరాగతమై
జన బాహుళ్యమై
ఆపాత మధురమౌ
యక్షగాన మింకొక రీతి!
కానీ, ఈ చతుష్పథంలో—
బ్యాండుమేళంలా
హిప్పీ సంగీతంలా
రాక్ అండ్ రోల్ మ్యూజిక్కులా,

వినిపిస్తుందో
అపశ్రుతి,
హార్మోనియం శ్రుతి,
అదే నా మనసులో
ఏదీ వినలేని
బధిరు దుర్గతి!—

*   *   *

కవిబ్రహ్మ తిక్కన్న కావ్యాద్వైత వాహినిలో,
బమ్మెర పోతన్న భక్తిభావ లహరిలో,
అల్లసాని కవనాల అల్లిక జిగిబిగిలో,
కవిసార్వభౌము గంభీర కవితా తరంగాలలో—
పయనించాను, ప్రాగ్దిశాభిముఖంగా కొన్నాళ్ళు!—

శ్లేషార్ధ నిధి, రామరాజ భూషణ కంకణ నిక్వాణంలో,
ప్రౌఢార్ధ మరీచి, రామలింగ కవితాంగణంలో,
ద్రావిడాన్వయమణి, రాయల సాహితీ సమరాంగణంలో,
తంజాపురీధుని, నాయకరాజ శృంగార రస ప్రాంగణంలో—
విహరించాను, పశ్చిమాభిముఖంగా కొన్నాళ్ళు—
కవనాన్ని, అవధానాన్ని కమ్మగా మలచిన కవికుల గురువులతో,
ప్రాక్తన నూత్నల మేలు కలయిక గురజాడ నూత్న కలకంఠ మధురిమతో,
స్వాతంత్ర్య సమరాన సరిక్రొత్త గొంతులౌ జాతీయ వైతాళికులతో,
ఆంధ్రాభిమానమే ఆకాశమంటగా వినుతించు చారిత్రకులతో—
ఉరకలే వేసాను ఉత్తరాభిముఖంగా కొన్నాళ్ళ—


ప్రాచీన ప్రతిభా సమ్రాట్టు, విశ్వనాథ కవిసమ్రాట్ విశ్వవిపంచిలో,
భావ విప్లవశ్రీ, కవితా ఉషశ్రీ, శ్రీ శ్రీ మహోఝరీ గర్జనలలో,
కృష్ణపక్షపురాత్రి నర్తించు భావకవితామూర్తి, శాస్త్రి క్రీనీడలో,
జానపదగేయాలు, భావకవి గీతాలు, దిగంబర కవితా క్రోశాలతో—
పరుగులెత్తాను దక్షిణాభిముఖంగా కొన్నాళ్ళు!—

నలుదిక్కులా నడచి
వెనుదిరిగి వచ్చాను,
రస రమ్య భావనా
లోకాల వదలి !

సెంటరులో కలలితో
ఒంటరిగ నిలిచాను,
తీరు తెన్నులు లేని
తెలుగు వాగుల మెదలి!!

జీవనరథం, జవసత్త్వ, ఊహాసత్త్వ
పవనాశ్వాలతో వచ్చి ఆగింది
క్షణకాలం—
రహదారుల కూడలిలో,
క్రాస్ రోడ్డులో!!!—

———



సాతవాహన వెండి రూపాకృతి నాణెములు - తెలుగు లేఖనం*

శ్రీ పురాణం రాధాకృష్ణప్రసాదు

1

భారతదేశాన్ని పరిపాలించిన స్వదేశీ రాజులలో ప్రప్రథమంగా వెండిలో నాణెములను ముద్రించిన ఘనత ఆంధ్ర సాతవాహనులకు చెందుతుంది. గౌతమీ పుత్ర సాతకర్ణి తన పదునెనిమిదవ రాజ్య సంవత్సరంలో ఈ పని ప్రారంభించినట్లు కనపడుతుంది. ఇతడు తన ప్రత్యర్థి క్షహరాత క్షాత్రప నహపానను జయించి అతని వెండి నాణెములను తన రాజచిహ్నములతో మరల ముద్రింపించి మొదట చలామణిలోనికి ప్రవేశ పెట్టాడు. ఇటువంటి పునర్ముద్రణ నాణెములు అధిక సంఖ్యలో నాసిక్ జిల్లాలోని జోగల్‌తంబి గ్రామం వద్ద, మరికొన్ని ఇతర ప్రాంతాల లోను బయటపడ్డవి. వీనిలో ఒక నాణెం నహపాన రాజ చిహ్నలు లేకుండా కేవలం సాతకర్ణి ముద్రలతో మాత్రమే కాన వస్తున్నది. దీనినిబట్టి గౌతమీపుత్ర సాతకర్ణి ఈ పునర్ముద్రణ నాణెములతో బాటు తన ముద్రలతో క్రొత్త నాణాలను గూడా చలామణిలోనికి ప్రవేశపెట్టి నట్లు విదితం అవుతుంది.[1]


రూపాకృతి నాణెములు

ఇవిగాక సుమారు పన్నెండుకు పైగా వీరివే వెండి నాణాలు ఒకవైపు రాజ రూపాకృతి (Portrait) ఉన్నవి కూడా లభించినవి. గౌతమీపుత్ర సాతకరి వెండి నాణాలను ముద్రించటం ప్రారంభించగా అతని తర్వాత వాడైన వాసిష్ఠీపుత్ర పుళుమావి తన నాణెముల మీద రాజచిత్రాన్ని గూడా ముద్రించే ఆచారాన్ని ప్రవేశపెట్టినట్లు,దీన్ని అతని తర్వాత వారైన వాసిష్ఠీపుత్ర సాతకర్ణి, గౌతమీ పుత్ర యజ్ఞశ్రీ సాతకర్ణి కొనసాగించినట్లు ఇప్పటిదాకా పండితులు నమ్ముతున్నారు. వారి వారి చిత్రాలు, పేర్ల మార్పుతో ఈ నాణేలన్నీ ఒకే తరగతికి చెందుతవి. స్థూలంగా వాటి పోలికలు ఇట్లా ఉంటవి.

ముందువైపు : కుడిప్రక్కకు తిరిగిన ముఖముతో రాజు తల. నుదుటిమీద శిరోమణి, దీర్ఘనాసిక, ఘనమైన కుండలములతో అలంకృతమైన కర్ణము, ముఖ్యలక్షణాలు.బొమ్మచుట్టూ అంచు వెంట బ్రాహ్మీలిపిలో ప్రాకృత భాషలో రాజుబిరుదు, మాతృపూర్వక నామము. (metronymic)

వెనుక వైపు : చంద్రవంకతో కూడి ఆరు ఆర్చీలతో నున్న కొండ గుర్తు ఎడమప్రక్కగాను, చంద్రవంకతో కూడిన 'ఉజ్జయిని' చిహ్నము కుడిప్రక్కగాను, రెండు చంద్రవంకల నడుమ సూర్య చిహ్నము, కొండ క్రింద అడ్డంగా మెలికల గీత. (చిత్రము:6). చుట్టూ అంచు వెంబడి దక్షిణాదిన వాడుకలోనున్న బ్రాహ్మీ అక్షరములతో ద్రావిడభాషలో రాజు బిరుదు, మాతృపూర్వక నామము.

ఈ నాణేలను ముద్రించటంలో సాతవాహనులు తమ సమకాలీనులైన క్షహరాటులు, కర్దమక క్షాత్రపుల మార్గాన్ని అనుసరించారు. తదనుగుణం గానే రాజ చిత్రాన్ని ప్రవేశపెట్టారు. ఇది ఒక విధంగా విదేశీ ప్రభావంవల్లనే అయినప్పటికి కొంతవరకు భావానుకరణం మాత్రమే అయి తన స్వలక్షణాలతో ప్రత్యేకతను నిలుపుకునాది.



సాతవాహన రాజుల రూపాకృతులు—నాణెములు. 1, 2—గౌతమీ పుత్ర సాతకర్ణి, 3, 3a వాసిషి పుత్ర పుళుమావి, 4—7 వాసిష్ఠ పుత్ర సాతకర్ణి, 8—10 గౌతమీ పుత్ర శ్రీ యజ్ఞ సాతకర్ణి.

సాతవాహనులు క్షాత్రపులవలెనే (1) ఒకే మాదిరి నాణేలు (2) ఒకే లోహం వెండిలో (3) రాజ రూపాకృతితో (4) రెండు భాషలతో ముద్రించే ఆచారాన్ని పాటించారు. బరువు, పరిమాణం, ముద్రలు మొదలగువాని విషయంలో గూడ స్థూలంగా ఇవి ఎక్కువ భాగం క్షాత్రపుల నాణేలతో పోలి ఉంటవి. ఈ పోలికలతోబాటు కొన్ని ప్రత్యేకతలుగూడ కనపడతవి. రాజ చిత్రాలు పూర్తిగా భారతీయ సంప్రదాయ పద్ధతిలో ఉండటం, క్షాత్రపుల వలె భుజంవరకు కాకుండా రోమను నాణెములమీది చక్రవర్తుల చిత్రాలలో వలె మెడవరకే రాజ చిత్రాన్ని పొందుపరచటం, క్షాత్రపులవలె పితృపూర్వక (Patronymic) నామములుకాక తమ ఆచార పద్ధతిలో మాతృపూర్వక (Metronymic) నామములు వ్రాయించటం గమనించదగ్గ విషయాలు. శక క్షాత్రపులు తమ మూలస్థానాన్ని, రాజరిక ప్రదేశాన్ని సూచిస్తూ తమ నామాదులు ఖరోష్ఠి, ప్రాకృతభాషల్లో ఖరోష్ఠి, బ్రాహ్మి లిపులలో వ్రాయించినట్లుగా సాతవాహనులు కూడా తమ రాజరిక ప్రదేశాన్ని, మూలస్థానాన్ని సూచిస్తూ వరుసగా రాజభాష ప్రాకృతంలోనూ మాతృభాష తెలుగులోనూ తదనుగుణమైన బ్రాహ్మి లిపులలో తమ నామాదులు వానిమీద వ్రాయించటం ప్రత్యేకంగా గమనార్హం.

ఇక పోతే, రాజ చిత్రాలు ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకున్నవి. ఆ రాజుల ఆకార లక్షణాదులకు సంబంధించి ఇవే ఇప్పటివరకు మనకు తెలిసిన నమ్మకమైన ప్రతి చిత్రాలు. వారు చాలా బలంగాను, దృఢంగాను ఉండి ఒక విధంగా సునిశితమైన నిశ్చిత బుద్ధితో కూడిన దృష్టితో కనిపిస్తారు. విశేషంగా పుళుమావి తన వంపు తిరిగిన దీర్ఘనాసికతో తీక్షణ దృష్టితో అచంచలుడుగా, గంభీరుడుగా కన్పిస్తాడు. (చిత్రం : 3) వారు విశాలకర్ణములతోనూ, కర్ణ రంధ్రములలో పొడుగుపాటివి, బరువైనవి అయి భుజాలను తాకుతూ వ్రేలాడుతూ ఉండే కర్ణ కుండలాలతో కొట్టవచ్చినట్లుగా కన్పిస్తారు. ముఖ్యంగా యజ్ఞ సాతకర్ణి కుండలాలు దీర్ఘంగా భుజాలను తాకుతూ తెలుగుదేశంలో సంప్రదాయకంగా ఇప్పుడు కూడా మనం చూచే సోమయాజుల కుండలాలవలె ఉండటం విశేషమైన విషయం. సాధారణంగా వారు శిరోవేష్టనాలు లేకుండా విరియబోసిన కేశములతో ఉంటారు. తన మూడు నాణెములమీద యజ్ఞ సాతకర్ణి మున్నని తలతో కణతలపైనుంచి చెవులదాకా ఒక విశేషమైన ఆభరణంతో కన్పిస్తాడు. ఇంకో విశేషం ఏమిటంటే తన అన్ని చిత్రాలలోనూ వెనుకప్రక్క శిఖతో ప్రముఖ బ్రాహ్మణుని వలె, వైదిక క్రతుకర్త (సోమయాజి)వలె కన్పిస్తాడు. (చిత్రం : 8, 9.)పూవు వలె గుండ్రంగా ఉండి మధ్యలో ప్రధాన రత్నంతో చుట్టూ ఎనిమిది చిన్నరత్నాలతో కూర్చబడిన శిరోరత్నం బహుశా రాజ లాంఛనం లేక కిరీటం వంటిది అందరు రాజులకు ఫాలభాగంలో కన్పిస్తుంది.

డా॥ పరమేశ్వరీ లాల్ గుప్తాగారు సాతవాహన నాణేలలో లెక్కించదగిన నాణేన్ని ఒకటి ప్రకటించారు.[2] ఇది కొంతవరకు అరిగిపోయి ఉంది. దీనికి వెనుక వైపు చంద్రవంకతో కూడిన ఆరు అర్చీల కొండ గుర్తు, 'ఉజ్జయినీ' చిహ్నము ఉన్నవి. వాటి అర్చీలలోను, భుజములలోను చిన్న బిందువులుకూడ కనపడుతవి. ముందువైపు కుడిప్రక్కకు తిరిగిన ముఖముతో రాజు తల వెనుకకు విరియబోసిన కేశములతో ఉంటుంది. దీర్ఘనాసిక, రంధ్రముతో ఉన్న కర్ణము స్ఫుటంగా ఉన్నవి. కర్ణ రంధ్రం దగ్గర అస్ఫుటంగా ఉన్న ఆభరణం బహుశ కర్ణకుండలం వంటిది ఉన్నది. రాజుకు మీసకట్టు స్ఫుటంగా కన్పిస్తుంది. (చిత్రం : 1—2) అసంపూర్ణంగా, అస్పష్టంగా పైవైపు '...తసమ...'; వెనుకవైపు '...రహణష...'అనే అక్షరాలు కన్పిస్తవి. ఇవి దీని లక్షణాలు. వీటినిబట్టి ఇది గూడ సాతవాహనులకు చెందిన నాణెం గానే తోస్తుంది. దీని మీది చిహ్నాల క్రమాభివృద్ధిని ఆధారంగా దీనిని ఎవరు ముద్రించింది తెలుసుకో ప్రయత్నిద్దాం.

పుళుమావి నాణేల నుంచి యజ్ఞశ్రీ నాణేల వరకు రాజ రూపాలను ముద్రించటంలో నాణ్యత

వైపుకు క్రమాభివృద్ధిని చూస్తాం. పనితనం స్పష్టమైన, ముచ్చటైన పద్ధతిలో రాజ రూపంలోని అన్నిభాగాలను, రూపావరణను (Outline) చక్కగా ప్రకటిస్తుంది. వెనుకప్రక్క గూడా చిహ్నాలు, అక్షరాలు, బిందువులతో చుట్టూ ఉండే అంచు పనితనంతో అందంగా చేయ బడ్డవి. ఈ లక్షణాలు ఏవీ మన ప్రస్తుత నాణెం మీద చూడం. రాజరూపం అవాస్తవిక పద్ధతిలో ఉంది. కేశాలంకరణ సరిగా చేయబడలేదు. ముఖలక్షణాలు, కన్ను, గడ్డం కూడా సరిగా చేయబడ్డ రూపాలలో ఉండవు. వెనుకప్రక్క గూడా చిహ్నాలలో స్పష్టత, సునిశిత నైపుణ్యం పనితనంలో లోపించినవి. చిత్రకారుడు రాజ రూపాన్ని మిగతా రాజ రూపాలవలె స్ఫుటంగా ప్రకటించ లేక పోయినాడు. ఇవన్నీ గూడా సాతవాహన నాణేల వరుసలో ఈ నాణెం యొక్క మొదటి స్థానాన్ని సూచిస్తవి.

వీనికి తోడు, రాజు ముఖంమీది మీసకట్టు సాతవాహన రాజుల విషయంలో క్రొత్తది. పుళుమావి గాని, వాసిష్ఠీ పుత్ర సాతకర్ణిగాని, యజ్ఞసాతకర్ణిగాని వారి వారి నాణేలమీద మీసకట్టుతో చూపించ బడలేదు. ఇది క్షాత్రపుల నాణెముల ద్వారా మనకు లభించిన విదేశీ ఆచారంగా తోస్తుంది. ఎందుకంటె వారి నాణెములన్నింటి మీద తప్పని సరిగా రాజు లందరూ మీసకట్టుతోనే చూపించబడ్డారు. ఇది మనకు ఎట్లా సంక్రమించి ఉంటుందంటే, మన టంకపాల అధికారులు మొదటిసారిగా రూపాకృతితో నాణేల మూసలు తయారు చేసేటప్పుడు క్షాత్రపుల రూపాకృతి నాణేన్ని ఒకటి నమూనాగా ఊహించి దాని ననుసరించి రాజుగారి దీర్ఘనాసిక, కర్ణములు, కర్ణ కుండలములు, విరియబోసిన కేశపాశము, మొదలయిన లక్షణాలను పొందుపరుస్తూ వానితోపాటు రాజుగారి మీసకట్టుకూడా చిత్రంలో ఇమిడ్చి ఉంటారు. కాని ఈలక్షణం భారతీయ కళలో అసామాన్య విషయం. భారత కళాకారుడు ఆకాలం లోనూ, అంతకుపూర్వము, తర్వాత గూడా ఈ మీస కటు చూపించటం అనేది సంప్రదాయ విరుద్ధం గానో అశుభకరమైనది గానో తలచి దాన్ని రాజులకూ మీసకట్టు ఉండి ఉంటుందను కోటానికి అవకాశం ఉన్న యోధులకు గూడా చూపించటం మానివేశాడు. ఏమైనప్పటికి, ఈ పద్ధతికి తరువాత వారైన పుళుమావి, సాతకర్ణి, యజ్ఞశ్రీ స్వస్తిచెప్పి మీసకట్టు చూపించటం మానివేశారు.

నాణేనికి వెనుకప్రక్క చిహ్నాలలోని ఆర్చీలలో భుజాలలో చిన్న చిన్న బిందువులు కానవస్తవి. ఈ లక్షణం గౌతమీపుత్ర సాతకర్ణి ముద్రించిన జోగల్ తంచి సమూహంలోని కొన్ని నాణేలమీదనే కనపడుతుంది. దీన్నిగూడా అతని తరువాత రాజులు వెండి నాణేల మీదినుంచి ఉపసంహరించి వేశారు.

కాబట్టి ఈ యదార్థాలన్నీ గమనించినట్లయితే ఈ నాణెం సాతవాహన వెండినాణేల వరుసలో ముందు స్థానాన్ని ఆక్రమించి బహుళ వెండినాణేలను చలామణి లోనికి ప్రవేశపెట్టిన గౌతమీపుత్ర సాతకర్ణికే చెంది ఉంటుంది. అట్టి సందర్భంలో గౌతమీపుత్ర సాతకర్ణి తన ప్రత్యర్థి నాణేలను పునర్ముద్రించి, అదేవిధంగా తన క్రొత్త నాణేలను గూడా ప్రకటించి, ఇవి ఏవీ గూడా తను క్రొత్తగా ఆక్రమించిన ప్రత్యర్థి రాజ్యప్రజలు వాడకానికి అలవాటుపడ్డ రూపాకృతి నాణేలతో సరితూగక పోవటం గమనించి తన రూపాకృతి నాణేలను గూడా ప్రవేశపెట్టినట్లు తోస్తుంది.

ఈ విధంగా సాతవాహన చరిత్రలో, స్వతంత్రంగా మొట్టమొదటిసారిగా వెండిలో నాణేలను, రూపాకృతి నాణేలను గూడా ముద్రించిన ఘనత ప్రతిభాశాలి, పరాక్రమవంతుడైన గౌతమీపుత్ర సాతకర్ణికే చెందుతుంది.

2

తెలుగు లేఖనం

పశ్చిమ క్షాత్రపుల నాణెముల మీది వలెనే సాతవాహన నాణేలమీద గూడా రెండు భాషల్లో లేఖనం (Legend) ఉంటుంది. ప్రతి నాణేనికి రెండువైపులా ఉంటుంది ఈలేఖనం. కాని ముఖ్యంగా వెనుకవైపుది

అస్పష్టంగానూ, అసంపూర్ణంగాను కన్పించటంచేత భండార్కరు, అల్తేకరు మొదలయిన పండితులు దీన్ని వివరించటానికి చేసిన ప్రయత్నాలన్నీ సంతృప్తి కరంగా ఫూర్తిఫలితాన్ని సాధించలేక పోయినవి. కాని డాక్టరు దినేశచంద్ర సర్కారు గారు వాసిష్ఠిపుత్ర సాతకర్ణికి చెందిన స్పష్టమైన ఒక నాణేన్ని ఆధారంగా తీసికొని తృప్తికరంగా చదివి దాన్ని వివంచటమే కాకుండా యజ్ఞశ్రీ సాతకర్ణి తాలూకూ, రాప్సన్ ప్రకటించిన నాణేలమీద లోపించిన భాగాలను గూడా పూరించారు[3].

ముందువైపు, అలాగే వెనుకవైపు ఉన్న లేఖనాలు అందరు రాజుల నాణేలమీద, వారి మాతృ పూర్వక నామములు మినహాయించినచో ఒకే మాదిరిగా ఉంటవి. ఇంకా రాప్సన్ చెప్పినట్లు ప్రతిఒక్క రాజు నాణేలమీది రెండు వైపుల లేఖనాలలో లిపి, ఉచ్చారణ భేదాలే కాని భావం మాత్రం రెండింటిలోనూ ఒక్కటే. ముందువైపు లేఖనం బ్రాహ్మీ లిపిలో సంస్కృత ప్రభావంతో ఉన్న ప్రాకృతంలో ఉంది. ఇది వెనక వైపున ఒక ద్రావిడ భాషలోకి అనువదించబడి దక్షిణదేశంలో వాడ బడే అక్షరాలతో ఉండే బ్రాహ్మీ లిపిలో వ్రాయబడిఉంది. ఈ లిపిని గూర్చి రాప్సన్ ఇలా అంటారు.[4] 'వెనుక వైపు లేఖనం ఒక రకమైన బ్రాహ్మీ అక్షరములలో వ్రాయబడ్డది. ఈ రకమైన అక్షరాలు మనకు ఎక్కడా లభ్యం కాక పోయినప్పటికి భట్టిప్రోలు లేఖనంలోని అక్షరాలకు చాలా దగ్గరి పోలికతో కన్పిస్తున్నవి. బహుశ ఇవి అక్షరాల క్రమ పరిణామంలో ఒక తరువాత దశను సూచిస్తున్నవి. దీన్ని బుల్హార్ పండితుడు ద్రావిడ రూపాంతరమైన బ్రాహ్మీ అన్నారు.'

వాసిష్ఠిపుత్ర సాతకర్ణి నాణేలమీద ముందు వైపున ఉన్న లేఖనం ప్రాకృతంలో ఇట్లా ఉంటుంది. 'రాఞోవాసిఠీ పుతస సిరి సాత కణిస' (సంస్కృతంలో: రాజ్ఞః వాసిష్ఠీ పుత్రస్య శ్రీ సాత కర్ణేః). తెలుగులో రాజునకు వాసి ష్ఠి పుత్రునకు శ్రీ సాత కర్ణికి' (చెందిన నాణెము) అని అర్థం వస్తుంది. డాక్టరు సర్కారుగారి అభిప్రాయంలో ఇది ద్రావిడ ప్రాకృతంలోకి, దాక్షిణాత్య రూపాంతరాలైన బ్రాహ్మీ అక్షరాలతో, వెనుక వైపున ఇట్లా అనువదించ బడ్డది.'అరహణష వాహిట్ఠి మాకనష తిరు హాత కణిష' దీనిలో షష్ఠి విభక్తి ప్రత్యయాన్ని సూచిస్తూ 'స' కు మారుగా 'ష' వాడబడ్డది. 'అరహణ, మాకన' వరుసగా రాజు, కుమారుడు అనే అర్థం కలిగిన ద్రావిడ పదాలనుంచి వచ్చిఉంటవి. ఇంకా సాతకర్ణి హాతకర్ణిగాను, సంస్కృతంలోని వాసిష్ఠి ప్రాకృతంలో 'వాహిట్టి'గాను మార్పు చెందినట్లు, అరహణలోని 'హ' కూడా మార్పుచెందిన 'స' లేక 'శ' ను సూచిస్తుంది. ప్రస్తుతం తమిళంలో వాడబడుతున్నట్లుగా 'తిరు' పదం సంస్కృతంలో 'శ్రీ', ప్రాకృతంలో 'సిరి' పదాలకు రూపాంతరమై ఉంటుంది—అంటారు డా॥ సర్కారు గారు. యజ్ఞ సాతకర్ణి నాణేలమీద హిరు (సిరి=శ్రీ) అనే పదాన్నిగూర్చి చెప్తూ సాత వాహన సాహిత్యంలోనూ, శాసనాలలోనూ కూడా శక్తి, సాత అనే పదాలకు వరుసగా హకు, హాల అనే రూపాలు వాడబడి ఉండటం గుర్తుకు తెస్తారు రాప్సన్‌గారు.

ఈ వివరణం మన్నించ దగింది గానూ, తృప్తికరం గానూ ఉన్నదనటంలో సందేహంలేదు. అయినప్పటికీ, నా ఉద్దేశ్యంలో, 'ష' గా చదివిన అక్షరం 'కు' అయి ఉంటుంది. ఈ—కు-రూపం సమకాలీన సాతవాహన శాసనాలలోనూ, తరువాతవి అయిన ఇక్ష్వాకుల, బృహత్ఫలాయనుల శాసనాలలోనూ కూడా కన్పిస్తుంది.[5] తెలుగులో 'కు' షష్ఠి విభక్తి ప్రత్యయం. నా ఉద్దేశ్యంలో ప్రస్తుత లేఖనం ఆ రోజుల్లో ఆంధ్ర దేశంలో వాడుకలో ఉన్న బ్రాహ్మీ లిపిలో వ్రాసిన తెలుగు లేఖనం అయి ఉంటుంది.

ఇంకా డా॥ సర్కారుగారు గమనించిన అరసన్ వాకన్ పదాలు అకారాంతంగా (అరసన, మాకన అని) వ్రాయబడ్డవి అనేది తెలుగుభాషకు ముఖ్య లక్షణం. ఎందువల్లనంటే తెలుగు అజంతభాష కావటంవల్ల అన్ని మాటలు, వాక్యాలు కూడా తెలుగులో అచ్చు శబ్దంతో ముగుస్తవి. కు—విభక్తి ప్రత్యయం పదానికి

పరమైనప్పుడు సుగాగమం జరుగుతుంది. అందువల్ల ఈ రెండు పదాలకు అరసనకు, మాకనకు అనే రూపాలు ఏర్పడ్డవి.

తెలుగుమీద కలిగిన సంస్కృత ప్రభావం మూలాన చాలా ద్రావిడ పదాలు వాడకంలో నుంచి జారి పోయినప్పటికి అదృష్టవశాత్తూ ఈ రెండు పదాలు సాహిత్యంలో మధ్య శతాబ్దాల వరకు ఇంకా ప్రస్తుతం కూడా వాడుకలో దొరుకుతవి. కన్నడ, తులు భాషల్లో వలె తెలుగులో కూడా తమిళంలో కన్పిస్తున్న అరసన్ పదానికి సమపదం అరసు, అరసుడు లేక అరుసు అనేది. దీనికి అర్థం రాజు. దీని వాడుక పదునాల్గవ శతాబ్దందాకా తెలుగులో కన్పిస్తుంది.6 అలాగే మగన్ పదానికి సమమైనది మగణ్డు లేక మగఁడు.7 డు - అనేది ప్రథమ పురుష ఏకవచన ప్రథమా విభక్తి ప్రత్యయం. ప్రాచీన శతాబ్దాలలో ఈ పదం 'కొడుకు' అనే అర్థంలో వాడుకలో ఉన్నట్లు కన్పిస్తున్నా తరువాత తరువాత ఆ అర్థాన్ని పోగొట్టుకొని ధైర్యవంతుడు, నాయకుడు, మగటిమి కలవాడు అనే అర్థాలతో ప్రయోగింప బడుతూ భర్త, పెనిమిటి అనే అర్థంతో గూడా వాడుకలోని వచ్చింది. దీనికి కారణం—తెలుగుమీద సంస్కృత ప్రభావం అధికం అవుతూ వచ్చినకొద్దీ సుతుడు, పుత్రుడు, తనయుడు కుమారుడు, నందనుడు మొదలయినఅనేక సంస్కృత పదాలు కొడుకు–అర్థంలో వాడుక లోకి రావటమే. డా॥ సర్కారు గారు తలచినట్లు మాకన్ పదంలో 'ఆ—'కారం బహుశ ఆ పదానికి ఉన్న సహజ ఉచ్చారణే కావచ్చు. మాకన్ అనేది తెలుగు లోని మగడు పదానికి మూలద్రావిడ రూపమై ఉండవచ్చు.

తిరు అనేపదంగూడ తెలుగులో అధికంగా వాడుకలోఉన్న పదమేకాని ఇప్పటివలె వ్యక్తులపేర్లకు ముందు గౌరవ వాచకం శ్రీ వలె కాదు. దైవ సంబంధమైన విశేషణంగా ఉంది.

ఉదా: తిరునాళ్లు: దేవుని ఉత్సవపు రోజులు.
తిరుపతి: శ్రీపతి.
తిరునీరు: నొసట ధరించే విభూతి. మొద॥ ప్రాచీనకాలంలో దీని వాడుకను గూర్చిన ఉదాహరణలు గూడ సాహిత్యంలో అనేకం లభ్యమవుతవి.

కాబట్టి పైమూడు పదాలు సంబంధ షష్ఠీ విభక్తి—కు— ప్రత్యయంతో పూర్తివాక్యాన్ని ఇస్తవి. 'అరహణకు వాహిట్ఠి మాకనకు తిరు హాత కణకు' ఇది ఇప్పటి తెలుగులో రాజునకు వాసిష్ఠి పుత్రునకు శ్రీ సాత కర్ణికి (సంబంధించిన నాణెము) అనే అర్థాన్ని సూచిస్తుంది. ఇక్కడ ఇంకో విషయం కూడ ఉంది. షష్ఠీ ప్రత్యయం అరహణ, మాకన, హాత కణే అనే మూడు పదాలకు చేర్చటం జరిగింది. (విశేషణ విశేష్యాలకు అన్నింటికి) ఇది ప్రస్తుతం తెలుగులో ఆచారం కాదు. అయినప్పటికి ఇదిగూడా సంస్కృత సంప్రదాయ ప్రభావమే.ఒకప్పుడు వాడుకలో ఉండి క్రమేణా అంతరించినా, ఇప్పటికి కావ్యాలలో 'షష్ఠ్యంతములు' అనే పద్యాలలో ఇంకా మిగిలి ఉంది.

ఈ విధంగా ఈ లేఖనం పూర్తిగా తెలుగులో ఉంది. అంతే కాదు.ఇది క్రీస్తు శకారంభంలో తెలుగులో ప్రచారలోంఉన్న ఒకానొక దేశిచందస్సులో కూర్చబడ్డట్లుగా కూడా కన్పిస్తుంది. ప్రాచీన శిలా లేఖనాలు చూచినట్లయితే వానిలో చాలాభాగం 'ద్విపద గతిరగడ, మహాక్కర, తరువోజ, సీసం, ఆటవెలది మొదలయిన దేశీ చందస్సుల లోనూ, చంపకమాల, ఉత్పలమాల, మత్తేభం, మొదలయిన సంస్కృత వృత్తాలలోనూ కూర్చబడినట్లు చూస్తాం.8 తెలుగు రాజులు తమ శాసనాలు ఛందో బద్ధంగా రకరకాలైన పద్యాలలో వ్రాయించటానికి ఉత్సాహం కనపరచినట్లు తెలుస్తుంది. వాసిష్ఠిపుత్ర సాతకర్ణి నాణెంమీది లేఖనం ఇరువదిమూడు మాత్రలతో రెండు, పదునైదవ అక్షరాలలోని హల్లులమీద ప్రాస యతితో కూర్చబడిఉంది. యజ్ఞ సాతకర్ణి నాణెంమీది వెనుకవైపు లేఖనంలో 'మాకనకు తిరు' అనే పదాలు 'పుతకు హిరు' అనే పదాలుగా అర్థంలో మార్పులేకుండా మార్చి వ్రాయటం జరిగింది. బహుశ ఈ మార్పు ఎందుకు జరిపి ఉంటారంటే రాజు పేరులో 'య ఞ' అనే రెండు మాత్రలు

ఎక్కువగా ఉండటం చేత ఈ రెండు మాత్రలు ఇముడ్చుకోవటాని కోసం—మాకనకు—అనే అయిదు మాత్రల పదానికి మారుగా—పుతకు—అనే మూడు మాత్రల పదాన్ని వాడుకొని చందస్సులు సరిపుచ్చు కోవటానికై ఉంటుంది. ఇలా చేసి ఇక్కడ కూడా ఇరువదిమూడు మాత్రలతోనే ఛందస్సు వ్రాశారు. ఇక్కడ యతిని మొదటి, పదునాలుగు అక్కరాల మీద చూపించారు. రెండు సందర్భాలలోనూ గూడా యతిని పదునైదవ మాత్ర మీదనే చూపించారు. ఒకేవిధమయిన ఛందస్సును వాడారు. ఇది మాత్రా ఛందస్సు మీద ఆధారపడి ఉండే రగడలలో ఒకదానికి సంబంధించిన దేశి ఛందస్సు అయిఉంటుంది.

5 5 5 5 3

అర హణకు | వాహిట్టి | మాకనకు |తిరు హాత |కణకు||

అ రహణకు| గోతమీ| పుత కుహిరు| యఞ హాత|కణకు||

ఈ లేఖనాలను గూర్చి సర్వశ్రీ ఆర్. నాగస్వామి, యస్. రామయ్యగారల వాదం[9] అంత సమంజసంగా కన్పించదు. ఈ లేఖనం తమిళం అయి ఉంటుందని వారిద్దరూ అభిప్రాయ పడ్డారు. నాగస్వామి గారు ఈ లేఖనంలోని 'హ' దాక్షిణాత్య 'దామిలి' శిలా లేఖనాలలోని 'చ'ను పోలిఉందని తలచి అందువలన మాటలను అరచన, వాచిట్టి, చాతకణె అని చదవాలని ఇది పూర్తిగా తమిళ లేఖనమని అభిప్రాయపడ్డారు. కాని వారి 'చ' సూత్రాన్ని యజ్ఞసాతకర్ణి నాణెం మీది ఇటువంటి లేఖనానికే అమలు పరచినట్లయితే అందులోని హిరు యఞ హాతకణ అనేపదాలను చిరు యఞ చాతకణగా చదువ వలసి ఉంటుంది. ఇది అంత సబబు అయిన అర్థాన్ని ఇవ్వదని నా తలంపు. ఈలేఖనాలలో వాడిన 'హ' క్రింది వంపు కుడివైపుకు తిరిగి ఉండేట్లు వ్రాసిన ఒకవిధమైన బ్రాహ్మీ అక్షరమే అయి ఉంటుంది.ఇంకా ఈ లేఖనంలో కు—అనే అక్షరాన్ని ష—గా చదివి ఇది సంస్కృతంలో స్య—కు, తమిళంలో అ—కు మధ్యస్థంగా ధ్వనిస్తుందని షష్ఠీప్రత్యయం కావచ్చునని అన్నారు. కాని శ్రీ రామయ్య గారు ఈ ష— అనే అక్షరం తమిళానికి క్రొత్తది అన్నారు.

గౌతమీ పుత్ర సాతకర్ణి, పుళుమావి నాణేల మీద గూడా రెండువైపుల లేఖనాలు ఉన్నవి. వానిలో వెనుకవైపు వానిని డా॥ గుప్త, డా॥ అల్తేకరు గారలు వరుసగా '...రహణష...' అని, 'రఞో (వాసి)ష్ఠి (పుత్రష (హి) రు పుళు (మావిష)' అని చదివారు. నాగార్జునకొండ త్రవ్వకాలలో పుళుమావి వెండినాణేల వెనుక ప్రక్కభాగం ముద్రణకు ఉపయోగపడే మట్టిమూస ఒకటి దొరికింది. దాని మీది అక్షరాలు ఇలా చదువగలం:'అర...కు తిరు పుళుమావికు' చుక్కలుపెట్టిన భాగం మూస అంచు దాటి బయటకు పోవటం చేత కనపడదు—(చిత్రం: 3 A) ఈమూడు లేఖనాలు గూడ తెలుగు అనే సంగతి విదితం అవుతుంది. అంటే ఇలా తమ నాణేల మీద తెలుగు లేఖనాలు ముద్రించే ఆచారం గౌతమీపుత్ర సాతకర్ణి కాలంనుంచే ప్రారంభమయిందన్న విషయం తెలుస్తున్నది.

సాతవాహన నాణేలమీది ఈ తెలుగు లేఖనాలు రెండు కారణాలచేత ప్రాముఖ్యం పొందినవి. మొదటిది: తెలుగు సాహిత్య చరిత్రలో ఈవాక్యమే మనకు ఇప్పటివరకు తెలిసిన మొదటి ప్రాచీన లేఖనం. లోగడ స్వర్గీయ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దానికి చెందిన అక్షరాలలో 'నాగబు' అనే ఒక పదాన్ని అమరావతి శిల్పాల మీద కనుగొన్నారు. మిగతా లేఖనాలు ఇప్పటి దాకా మనకు లభ్యమయిన వన్నీ క్రీ. శ. అయిదవ శతాబ్దం, తర్వాత కాలానికి చెందినవే. అందువల్ల ఇప్పటివాక్యం క్రీస్తు శకారంభంలోని సాతవాహనుల కాలం నాటి తెలుగు స్వరూపాన్ని గూర్చి పరిశీలించటానికి చక్కని అవకాశాన్ని ఇస్తుంది.

రెండవది: సాతవాహన రాజులు దీన్ని తమ నాణేలమీద వాడవలసిన అవుసరం. పురాణాల్లో సాతవాహనులు ఆంధ్రులని పేర్కొన బడింది. అందువల్ల వారి మాతృభాష తెలుగు అనేది స్పష్టం. గౌతమీ పుత్ర సాతకర్ణి పశ్చిమాన క్షాత్రపులతో విరోధించి వారి భూ భాగాన్ని ఆక్రమించు కొన్నప్పుడు అక్కడ క్షాత్రపుల వెండి నాణేలు చలామణిలో ఉండటం మూలాన తాను గూడా వెండి నాణేలను ముద్రించ వలసిన అవుసరాన్ని గమనించాడు. మొదట వెండిలో సాధారణ నమూనాలో తన నాణేలను ముద్రించి నప్పటికి స్థానిక ప్రజలు క్షాత్రపుల రూపాకృతి నాణేల వాడుకకు అలవాటుపడి ఉండటం చేత తాను గూడా వాని ఉరవడినే అనుసరించి ఈ

రూపాకృతి నాణేలను ద్విభాషా లేఖనాలతో ముద్రింపించాడు. అలా చేసేటప్పుడు, క్షాత్రపులు తమ స్వభాష ఖరోష్ఠిలోగూడా లేఖనాలు వ్రాయించినట్లే, ఇతడున్నూ తమ మాతృభాష తెలుగులో కూడా, అప్పుడు దక్షిణాదిన తెలుగు దేశంలో వాడుకలో ఉన్న బ్రాహ్మీ లిపిలో, లేఖనాలు వ్రాయించాడు. నాణేల ముందువైపు లేఖనాలు రాజభాష ప్రాకృతంలో వేయించటం జరిగింది—గనుక అవి రాజ్యపు ఉత్తర ప్రాంత ప్రజల వాడకాని కైనప్పటికి ఇబ్బంది కలుగటానికి అవకాశంలేదు. ఈనాణేలు దొరకిన ప్రదేశాలను బట్టి చూచినట్లయితే సామ్రాజ్యపు ఉత్తర రాష్ట్రాలలోనే అవి వాడుకలో ఉన్నట్లు కన్పిస్తుంది. అయినప్పటికి వానిని, ఈ తెలుగు లేఖనాలతో, ముద్రింపించటం మాత్రం విజయపురి (నాగార్జునకొండ) వంటి తెలుగుదేశపు టంకసాలలో జరిగి ఉంటుంది.

ఈవిధంగా సాతవాహన రాజులు తమ తెలుగుతనాన్ని సూచిస్తూ తెలుగులోనూ, బహు భాష ప్రాంతాలమీద అధికారాన్ని ప్రకటిస్తూ రాజభాష ప్రాకృతంలోనూ పొందుపరచిన లేఖనాలతో తమ రూపాకృతి నాణేలను ప్రకటించారు. రెండు భాషలకు లిపి బ్రాహ్మీ ఒకటే అయినప్పటికి అప్పుడు తెలుగు దేశంలో వాడుకలోఉన్న బ్రాహ్మీ అక్షరాలలోనే తెలుగు లేఖనాన్ని వ్రాయించారు. మధ్య భారతంలో సాతవాహన రాజ్యారంభ కాలంనుంచి ఇప్పటి ఆంధ్ర ప్రాంతం వారి అధీనంలో ఉన్నదీ లేనిది సందిగ్ధం అయినప్పటికీ, పులుమావి, తదనంతరపు రాజులు ఈ ప్రాంతంమీద అధికారం నెరపినారనటంలో ఎట్టి అనుమానం లేదు. బహుశ బలవంతుడైన గౌతమీపుత్ర సాతకర్ణియే ఈ ప్రాంతాన్ని తన అధికారం క్రిందకు తెచ్చుకొని ఉండవచ్చు.

వీరే ప్రప్రథమంగా తమ లేఖనాలను దేశి ఛందస్సులో ముద్రించి తరువాత వచ్చిన గుప్త చక్రవర్తులు తమ బంగారు నాణేలమీద సంస్కృత వృత్తాలలో మనోహరంగా లేఖనాలు వ్రాయించటానికి పురోగాము లైనారు.

* * *

* ఏని ఆంగ్ల మాతృక : Silver portrait coins of the Satavahanas భారతీయ ముద్రాపరిషత్ (N. S. I) వారి 59 వ వార్షిక సమావేశ సందర్భంలో నాగపూరు విశ్వవిద్యాలయంలో సాతవాహన నాణెములపై జరిగిన సదస్సులో చదువబడి విశ్వవిద్యాలయం వారిచే ప్రకటింపబడినది. (Vide: Coinage of the Satavahanas & coins from Excavations (Ed. A M Shastri. Nagpur University—1971)-1:6-pp. 68–74 Fig 1)

Notes·

1 Chinmulgund, P. J., J N S I IX, pp 93-96 pl VII-2 Shastri, A. M, 'Silver Coinage of the Satavahanas' Early Indian Indigenons Coins (Calcutta, 197I) pp. 113-19.

2. Gupta, P. L., J N S I-XXI pp 107 109 Pl VI-1 & 1 a.

3. Sircar, D. C., Studies in Indian Coins. pp 107–115.

4. Rapson, F. J., Catalogue of the Andhra Coins etc., in British Museum (B M C) pp. x c – x c i.

5. Sivaramamurti, C., Indian Epigraphy and South Indian Incriptions. pp. 73-74, pp 163, 165 & 167. and Pushpabhadra Swamy Pillar incription from Nagarjunakonda.

6. అప్పకవీయము : ఆశ్వా. 3 పద్య. 230.

7. వేటూరి ప్రభాకరశాస్త్రి: తెలుగు మెఱుగులు. (III Edn) p. 159 H.

ఆరుద్ర : సమగ్రాంధ్ర సాహిత్యం. Vol I. p. 68.

South Indian Inscriptions Vol. X. No. 622, 632 etc.,

8. ఆరుద్ర : సమగ్రాంధ్ర సాహిత్యం. Vol. I. p. 73, 92 & 95.

9. Nagaswamy, R., Sunday Standard–Madras. D. 26-3-67.

Ramayya, S., Sunday Standard, Madras, D. 10-12-67.

ఇదీ హత్యే!

శ్రీ కె. శివారెడ్డి

ఇదీ
ఒక రకంగా హత్యే
శక్తిని మూట గట్టి
వ్యసనం బురద గుంటలో తొక్కటం;
జనం
కొలను మధ్య
వికసించ వలసిన జీనియస్
తాబేటి తలకాయలా
అలవాటు డిప్పలోకి ముడుచుకోవటం;

దేశం
నరనాముల్లో
ప్రవహించవలసిన యోచనా రక్తం
పిల్ల కాల్వల్లో
చేపలు పట్టటానికే వినియోగపడటం;
మట్టిని
నవ్వించాల్సిన స్పందనని
ఇరుకు జీవితం గోడ మూలల్లోకి విసరడం

ఇదీ హత్యే!
నిశ్చలనం
చావులో
నిర్వీర్యత
మృగతలో
ఆనందాన్ని ఆర్జించే
శవాలు
బ్రతుకును
దేశాన్ని హత్య చేస్తాయి!

మణిప్రవాళ భాష

డా. తిమ్మావజ్ఝల కోదండరామయ్య

దక్షిణ దేశ భాషలలో మలయాళమునందు మణిప్రవాళ భాష ఒక కావ్యశైలిగా రూపొంది అందు ఉద్గ్రంథములు అనేకములు రచింపబడినవి. మలయాళ సాహిత్య చరిత్రమునందు మణిప్రవాళయుగము ఒక స్వర్ణయుగముగా భావింపబడుచున్నది. మణిప్రవాళము మలయాళమునకు విలక్షణమయిన ఒక కావ్యభాషా భేదము. అట్టి భాష యొకటి రూపొంది మలయాళమున నిలువద్రొక్కుకొనుటకు కొన్ని చారిత్రక సాంఘిక పరిస్థితులు కారణము.

1.1 కేరళ దేశమున ప్రాచీన కాలమునందు చేర రాజులు 'శెన్ దమిళ్' అనబడు అచ్చమయిన తమిళమును ప్రోత్సహించు చుండిరి. ఉత్తర హిందూదేశము నుండి కేరళమునకు వలసవచ్చిన నంబూద్రి బ్రాహ్మణులు సంస్కృతమును అభిమానించిరి. తత్ఫలితముగా అందలి పామరజనులయొక్కయు, సామాన్య ప్రజానీకము యొక్కయు వ్యవహారములో నుండిన మలయాళమునకు చాలకాలము వఱకు ఆదర ప్రోత్సాహములు లేకపోయెను. దానికి నాటి సంఘము నందలి ఉన్నత వర్గములవారి చిన్నచూపే కారణము. కాని తగిన యవకాశము, ఆదరము లభించినచో కావ్యభాషగా రూపొందుటకు తగినంతగా మలయాళము స్వయముగనే శక్తివంతమై యుండెను. స్థానికులయిన మలయాళీలకు నంబూద్రి బ్రాహ్మణులతో వివాహముల మూలమున సంబంధ బాంధవ్యము లేర్పడినప్పుడు అట్టి యవకాశ మొకటి మలయాళమునకు లభించెను. నంబూద్రి బ్రాహ్మణులు ఆర్యజాతికి చెందినవా రయినను వారు క్రమముగా తమ జాత్యహంకారమును విడనాడి స్థానికులతో కలసిపోయి కేరళ దేశీయులుగనే తమ్ము తాము భావింప దొడగిరి. స్థానికులయిన నాగజాతివారును ఆర్యసంస్కృతిని, సంప్రదాయమును చాలవఱకు అనుసరించుటకు క్రమముగా సిద్ధపడిరి. అందుచే ఉభయులకును వ్యవహారభాష అయిన మలయాళము క్రమముగా కొన్ని మార్పులకు లోనగుట తప్పని సరి యయ్యెను. దైనందిన జీవితమునకు సంబంధించిన వ్యవహారాదులలో సహజముగా ఏర్పడు ఆదాన ప్రదానాదుల మూలమున ఉభయ భాషల పదజాలమును సమ్మిశ్రణము పొంది తత్ఫలితముగా కొన్ని మార్పులు ఆ యా భాషలలో ఏర్పడుటకు ప్రారంభ మయ్యెను. ఇట్టి వ్యవహారమువలన మిశ్రభాష యొకటి ఒక క్రమ పద్ధతిలో వికాసము పొంది, అది మత విషయకములయిన, వైదిక కర్మకలాపములకు సంబంధించిన, శాస్త్ర సంబంధములయిన విషయములను వివరించుటకు ఉపయోగింపబడ దొడగెను. క్రమముగా నది విద్యావంతుల వ్యవహార భాషగా కూడ పరిణామము పొందెను.

1.2 పెరుమాళ్ వంశీయులయిన రాజుల యనంతరము కేరళమున తమిళముయొక్క ప్రాభవము నశింప నారంభించెను. కూత్తు, కూడియాట్టం అను నాటక కళాభేదములు కేరళములోని అన్ని తరగతులవారికిని ప్రీతి పాత్రములయిన వినోద సాధనములుగా వ్యాప్తిలోనికి వచ్చినప్పుడు అందుపయోగింప బడుచుండిన ఈ మిశ్రభాష (Hybrid Language) జనాదర పాత్రముకా దొడగెను. పురాణ ప్రవచనములయందు, వేదాంత ప్రసంగములయందు, వ్యాఖ్యానములయందు, విద్వద్గోష్ఠులలో, పండితుల వాగ్వివాదముల యందు, కవి పండిత సమ్మేళనముల యందు విశేషముగా నుపయుక్త

మగుచుండిన యీ మిశ్రభాష సహజముగనే కవిత్వమునకును ఉపయుక్తము కాదగునను ఆశయమే అది కావ్యభాషగా స్వీకరింపబడుటకు కారణమని చెప్ప దగును. ఇట్లు కొన్ని శతాబ్దముల పాటు క్రమ పరిపాకము చెందుచు వచ్చిన యీ భాషను కాలక్రమమున కొన్ని రకములయిన రచనములకు కూడ ఉపయోగింప దొడగిరి. ఈ నూతన భాష తొలుత సంస్కృత గ్రంథముల వ్యాఖ్యానములందు ప్రయోగ దశలోనుండి తరువాతి కాలమున క్రమముగా మౌలికము లయిన కావ్యాదుల రచనమునకును ఉపయోగింప బడెను. ఈ ఘట్టమే మలయాళమున మణిప్రవాళ యుగమునకు ప్రారంభకాలము ఉభయభాషలయందును నిష్ణాతు లయిన విద్వాంసులు సంస్కృత మలయాళములు రెంటినుండియు యథేచ్ఛముగా పదజాలమును స్వీకరించి వాని మధుర సమ్మేళనముతో తమ కావ్యాదులను రచింప దొడగిరి. తాము తమ కావ్యాదులలో నూతనముగా నిబంధించిన యీ భాషా రూపమునకు వారే 'మణిప్రవాళము' అని దాని స్వభావమునకు సూచకముగా నామకరణము కావించిరి. సంస్కృత మలయాళ శబ్దముల సమ్మేళనమును వారు మణిప్రవాళ సంజ్ఞచే సూచించిరి. వారు దానికి ప్రసాదించిన యీ నూతన సంజ్ఞ యాదృచ్ఛిక మయినది కాక విశేషముగా అర్థవంతమనుట సత్యము. మణిప్రవాళము అనగా మణులు, ప్రవాళములు కూర్చిన హారమని అర్థము. ఇందు మణులు మలయాళ శబ్దములు. ప్రవాళములు సంస్కృత శబ్దములు. మణులును, ప్రవాళములును భిన్న ద్రవ్యము లయ్యును కాంతియం దవి చాలవఱకు పోలికను కలిగి యుండునటు — మలయాళ సంస్కృత శబ్దములు భిన్న భాషలకు చెందిన వయినను వానిని కూర్చుటలోని నేర్పునుబట్టి ఒకవిధమయిన సారూప్యము, సమానత్వము స్ఫురించునట్లుగా రచితమయిన యిట్టి భాషకు మణిప్రవాళ మనుసంజ్ఞ సార్థకమగుచున్నది.

1.3 మణిప్రవాళ సారస్వతశాఖలో విశేషకృషి యొనర్చిన పి. శంకరన్ నంబియార్ అను విద్వాంసుడు మణిప్రవాళముయొక్క ఆవిర్భావ వికాసములమగూర్చి యిట్లు తెలిపెను. 'సంస్కృత కావ్యములను పండితులు కానివారు కూడ చవి చూడవలెనని నంబూద్రి బ్రాహ్మణులు కొంద ఱభిలషించి యుందురు. అట్టి వారికి సంస్కృత శబ్దజాలమును, వ్యాకరణమును చిన్నచిన్న మోతాదులతో, చతురతతో అందించినచో వారు అనాయాసముగా వానిని స్వీకరింప గలుగుదురు. తత్ఫలితముగా తమకు తెలియకుండగనే వారు కావ్య రసాస్వాదన మొనర్చుచు సంస్కృత వ్యాకరణ రహస్యములను కూడ గ్రహింపగలుగుదురు.'—

1.4 మణిప్రవాళ రచనా విధానము ఎప్పుడు ప్రారంభమయ్యెనో ఖచ్చితముగా చెప్ప జాలము. కాని కులశేఖర పెరుమాళ్ అను ప్రభువుయొక్క యాస్థాన కవీశ్వరుడగు తోలన్ అను కవి రచించిన హాస్య రస స్ఫోరకమగు రచనతో ఇట్టి రచనా విధానము ప్రారంభమై యుండవచ్చునని కొందఱు నుడువుదురు. అతడు క్రీ. శ. తొమ్మిదవ శతాబ్దమున వర్ధిల్లి యుండె ననియు తెలియు చున్నది.

2.1 భారతీయ భాష లన్నియు సంస్కృతము నుండి యెన్నో శబ్దములను స్వీకరించినవి. కాని అట్లు స్వీకరించుటలో ఆయాభాషలవారు వానిలో కొన్నిటిని తత్సమములుగా రూపొందించుకొనియు, కొన్నిటిని తద్భవములుగా మార్చుకొనియు వానిని గ్రహించిరి. కాని మలయాళమున మాత్రము అట్లు జరుగలేదు. సంస్కృత మలయాళ శబ్దములు రెండును అందు క్షీర నీర న్యాయమున కలిసిపోయినవి. తత్ఫలితముగా మణిప్రవాళ మను నొక క్రొత్తశైలి మలయాళమునం దేర్పడెను. మణిప్రవాళ మనగా సంస్కృత దేశ భాషా శబ సమ్మేళన మని, అది యొుక మిశ్రభాష యని యితర ద్రావిడ భాషల వారు భావింప వచ్చును. కాని అది అంతమాత్రమే కాదు. దానికి మలయాళము నందు ఒక విశిష్టమయిన అర్థము కలదు. మధురములగు మలయాళ సంస్కృత శబ్దముల సమ్మేళనముచే సురభిళ మగునది మణిప్రవాళము— మధుర మధుర భాషా సంస్కృతా న్యోన్య సమ్మేళన సురభిళా—

అని లీలా తిలకము అను మలయాళ లక్షణ గ్రంథము నందు అది నిర్వచింప బడినది.

2.2 మణిప్రవాళమున రచితము లయిన కావ్య పరంపర వెలసిన పిదప తద్రచనా విధానమునకు సంబంధించిన నియమములు కొన్నిటిని రూపొందింప వలసిన యావశ్యక మేర్పడెను. అట్టి నియమములు లేకపోయినచో అది రచయిత యిచ్చసుబట్టి వెఱ్ఱితలలు వేయు ప్రమాదము కూడ నుండెను. దానికి సంబంధించిన నియమములను తెలుపుటకు ఏర్పడిన లక్షణ గ్రంథమే లీలా తిలకము అది క్రీస్తుశకము పదునాలుగవ శతాబ్దమునందు రచింపబడిన దని అంతస్సాక్ష్యమును బట్టి నిర్ణయింపబడినది. అది సంస్కృతభాష యందు రచింపబడిన మలయాళ లక్షణ గ్రంథము. అం దుదాహరింపబడిన మణిప్రవాళ రచనోదాహరణములను బట్టి అది రచింపబడుటకు నాలుగైదు శతబ్దులకు పూర్వము నుండియే మణిప్రవాళము పెక్కురు కవులను ఆకర్షించినదనియు, వారు అందు పెక్కు తెఱగులయిన రచనములు—దేవతాస్తుతులు, రాజప్రశంసా కృతులు, స్థల మాహాత్మ్యములు, ప్రకృతి చిత్రణములు, సందేశ కావ్యములు, పర్వదినముల అభివర్ణనము, శృంగార వర్ణనము—కావించి రనియు తెలియుచున్నది. లీలా తిలకము నందు మణిప్రవాళము ఉత్తమ, మధ్యమ, అధమ— యిత్యాదిగా తొమ్మిది విధముల విభజింపబడినది. అందు ఉపయోగింపదగిన సంస్కృత మలయాళ శబ్దముల నిష్పత్తి పరిమాణమునుబట్టి యీ భేదములు రూపొందింపబడినవి. లీలా తిలకమునందు ఆయా భేదముల లక్షణమును, వాని కొసగబడిన లక్ష్యము లను చూడుడు :

1. తదుత్తమం భాషా రస ప్రాధాన్యే

పుల్లి కొండాళ్ ఉరక్క పునరపి మణివా
మల్గినాళ్ మెల్ల మెల్ల
కామ క్కాత్తిన్ నణిశాళ్ మదన పరవశా
కాంత కైమై మరన్నాళ్
పీర్త్తాళ్ బట్టే వియర్త్తాళ్ వివశ మురుదడా
యన్నె పీయ స్సిరన్న
శెన్ మార్విన్ పొన్ను వీణ్ణ వ్వంగుళల గమే
మాళ్గినాళ్ ఉణ్ణి నజ్గా.
(ప్రథమ శిల్ప—12.

2, భాషా ప్రాధాన్యే రస సామాన్యే ఉత్తమ కల్పం.

రస ప్రాధాన్యే భాషా సామ్యే చ.

భాషా ప్రాధాన్యం రస సామాన్యం—

అమ్బల్ ప్రియాభరణ ముజ్కిన కాలకూటం
కూమ్బుం కురాల్ మొట్రి తుళంబిన కెజ్గ వెళ్లం
చామ్పొళు మెన్మనసి చామ్బ లణిఞ కోలం
కామ్పొదు కూడ మదు వీడుగ మన్మథారేః.
(1—14)

రస ప్రాధాన్యం భాషా సామ్యం—

అత్యా త్రామై మలన్ విదురర
క్కామ్బల్ మేలన్ని నేరం
మందం మందం మురువిన నిలా
వెన్టు తోన్రుం ప్రకారం
కాంతం దంతచ్ఛద రుచికల
ర్నోమల్ మందస్మితార్ద్రం
నాళ క్కాణాం తవ నయనమే
నజ్గ వక్త్రార విందం. (1—15)

3. సామ్యే మధ్యం.

పొన్నోలెయుం వళయు మారము మెన్నిణ్ణి వెళ్లా
మల్లాగ యిల్ల కలభాషిణి భూష దాని
ఎల్లోర్కుమే రసకరం సతతం నిబద్ధం
సౌజన్య మెణిదు విభూషణ మంగనానాం.
(1—16)

4. భాషా సామ్యే రస న్యూనత్వే మధ్యమ కల్పం.

రస సామ్యే భాషా న్యూనత్వే చ
భాషా ప్రాధాన్యే రస న్యూనత్వే చ
రస ప్రాధాన్యే భాషా న్యూనత్వే చ.

భాషా సామ్యం రస న్యూనత్వం—

నట్టుచ్చ నేరత్తు దివాకరోదయ
మత్యంత మాహంత కరోతి లాపం

మధ్యస్థరాయ్ నిర్కిలు మున్నతానాం
మట్టొత్రణు కాలం విణయాద కోలం'
(1—17)

రస సామ్యం—భాషా న్యూనత్వం—

అంగం తుంగస్తన భరయుతం
పుల్కవాన్ ననావిల్
పోరా పుణ్య ప్రసర మొరునా
శెన్నుడయ వల్లభాయ
నిన్నె క్కొణ్ణు న్నభిమత మెనె
కెయ్ దెలాం ఎర్రోణి ఱిన్నే
నిద్రే భద్రే త్వ మపి విధినా
దుర్లభా వల్లభేవ. (1—18)

భాషా ప్రాధాన్యం రస న్యూనత్వం.

మురణేన్ కఴల్ కాంతియుం ముగత్తిన్
పరిజుం పాటవముం పరన్న వాదుం
మరు వినదు మంద మంద మల్లే
చరణం చారు చకోర లోచనాయ. (1—19)

రస ప్రాధాన్యం భాషా న్యూనత్వం.

ఆ తామ్రై ర్రసపూర్ణై రయుగశరనుడే
బాణపూతై రపాంగై
రవ్యాజ ప్రేమ గర్భై రముద రస మషీ
రూషితై రార్ద్ర పాదైః
ప్రెప్తానుజ్ఞం ప్రయాంతం జన మి
మనురాగోళ్ సుఖం నోక్కి నోక్కి
తిష్ఠంతీం నారణీదన్ దుహితర
మితనాన్ నష్టధైర్యం స్మరామి.
(1—20)

5. న్యూనత్వే అధమం.

ఆశీ జనై రరఅనం నిశి నీయమానా
మావిర్భవ త్పులక భూషణ భూషి తాంగీం
అంకే నివేశ్య సుదృఢం తరసా నవోఢా
మార్పోల్ అధీర నయనాం తఴుగిన్ల ధన్యః.
(1—21)

ఇట్లు ఉత్తమము, ఉత్తమ కల్పమున రెండు, మధ్యమము, మధ్యమ కల్పమున నాలుగు, అధమము అని మణిప్రవాళమున తొమ్మిది తెఱగులు లీలా తిలకమున తెలుపబడినవి. మలయాళమును సుసంపన్నము చేయునంతవఱకే పరిమితముగా సంస్కృత శబ్దములను ఉపయోగింపవలెను కాని ఆ స్వీకారము మలయాళ భాషా స్వరూపమునే మార్చునదిగా నుండరాదని అందు స్పష్టముగా నిర్దేశింపబడినది. సంస్కృత వ్యాకరణ మర్యాదలు—ముఖ్యముగా విభక్త్యంతములయిన సంస్కృత శబ్దములు అట్లట్లే శబ్ద సౌందర్యమునకై, మాధుర్యమునకై గ్రహింపబడినను అవి మూలమయిన మలయాళ భాషా సౌందర్యమునకును, వాక్య నిర్మాణ సూత్రములకును భంజకములు కారాదు. మణిప్రవాళ రచనమునకు సంబంధించి లీలాతిలకమునందు ప్రధానముగా రెండు నియమములు తెలుపబడినవి. అందు మొదటిది—అందు ఉపయోగింపబడు మలయాళ శబ్దములు త్రైవర్ణికులయిన అగ్రజాతి వారిలో అధికవ్యాప్తికలదై 'యుండవలెను. అందు గ్రహింపబడు సంస్కృత పదములు సుపరిచితములును, సరళములును అయి యుండవలెను. అట్లు సమ్మేళనము పొందు శబ్దములు ఒక విధమయిన సాజాత్యము కలవై యుండవలయు ననుటయే—ఒకే హారములో కూర్పబడిన మణులునూ ప్రవాళములును వలె — అట్లు నిర్దేశించుటలోని యాశయమని మనము గుర్తింపవలసి యున్నది. రసవంతమై, మలయాళ శబములు అధికముగానున్న రచనము ఉత్తమ మని, మలయాళ సంస్కృత శబ్దములు సమానముగా కలది మధ్యమమని, మలయాళ శబ్దజాలముకంటెను సంస్కృత శబ్దజాలము అధికముగా నున్న రచనము అధమము అని అందు మలయాళ శబ్దములకు ఒసగబడిన ప్రాధాన్యా ప్రాధాన్యములనుబట్టి దాని యుత్తమాది పరిగణనము కావింపబడినది. సంస్కృత శబ్దములు సుపరిచితములును, సరళములును అయియుండవలెను. అను నియమముచే—ఆవ్యాజముతో విశేషముగా సంస్కృత పదజాలమే యందు ప్రవేశించుటకు అవకాశము ఎక్కువగా నున్నను—నిజమునకు ప్రథమ దశలో అట్టిపరిస్థితి మాత్రము ఏర్పడలేదు. తరువాతి కాలమున అనగా

క్రీ. శ. 15, 16, 17 శతాబ్దులలో రచితము లయిన చంపూ కావ్యములందును, సందేశ కావ్యముల యందును దీర్ఘ సమాస భూయిష్ఠమయిన రచనము చాలవఱకు కాన వచ్చుచున్నను పూర్వదశలో రచితము లయిన కావ్యములందు మాత్రము అది యుత్తమ జాతికే చెంది యుండినదని చెప్పదగును. లీలాతిలక ములో తెలుపబడిన యీ క్రింది లక్షణము మిక్కిలి ప్రధానమయినది. 'మలయాళ సంస్కృత శబ్దముల సమ్మేళనముతో మణి ప్రవాళమున రచింపబడిన యీ కావ్యము మలయాళ కావ్యమే అనుస్ఫూర్తి పాఠకులకు కలుగజేయున దై యుండవలయును. అది సంస్కృత కావ్యమను అభిప్రాయమునకు ఎట్టి పరి స్థితులలోను అవకాశము కలిగింపరాదు. ఇదియే మణి ప్రవాళ రచనము నందు ముఖ్యముగా గమనింపవలసిన యంశము. ఇదియే సరియయిన పద్ధతి గూడ'—

2.3.1. మణి ప్రవాళమున రచితములయిన కావ్యము లన్నియు సంస్కృత వృత్తములందే వ్రాయ బడెను. వానియందు రసము, అలంకారము, రచనా విధానము మున్నగువానికి నొసగబడిన ప్రాధా న్యమును పరికించినచో మణి ప్రవాళమున సంస్కృత భాషా ప్రభావము ఎంతగా కలదో మనకు అవగతము కాగలదు. ప్రశస్తమగు మణి ప్రవాళశైలిని చవి మాచుటకు చంద్రోత్సవ కావ్యము నందలి శ్లోకములను ఉదాహరణములుగా పేర్కొన వచ్చును. అందు ఈక్రింది శ్లోకములో కేరళదేశపు సౌభాగ్యము అభివర్ణింప బడినది.

పరభృత మొళి చుట్టం మట్టు ఖండంగ లెట్టుం
డదిలుం అధికహృద్యం దక్షిణ భారతాఖ్యం
విరళి నిల మలర్ మాదిన్నె అంగజెన్నుం త్రిలోకీ
చరు తొడు కురిపోలె చేరమాన్నాడు యస్మిన్.

2.3.2 మలయాళమునందలి చంపూ కావ్య ములం దన్నింటను సంస్కృత వృత్తములును, మణి ప్రవాళ శైలియు కాన వచ్చును. అందలి వచనము కూడ లయాన్వితమై సాధారణముగా తరంగిణి యను ఛందో విశేషమునకు సన్నిహితము నుండును. వానిలో పునం నంబూద్రి రచితమయిన రామాయణ చంపువు ప్రసిద్ధ మయినది. అందలి మణిప్రవాళశైలిని ఈ క్రింది శ్లోకమున కాంచవచ్చును.

మందీభూతే జనౌఘే పరిమళ బహులం
కైయి లాదాయ మాలాం
మందారాభోగ మందస్మిత మధుర ముఖీ
మంగళ స్త్రీ సమేతా
మందం మందం నయంతీ ఘన జఘన భరం
ప్రాభృతప్రాయ మగ్రే
మందాక్షాలంకృతాక్షీ మనసిజ కళికా—
మైథిలీ సా నడన్నాళ్

సీతాకల్యాణ ఘట్టమునందు కల్యాణ మండప మునకు వెడలుచున్న సీతా దేవి యీ శ్లోకము నందు అభివర్ణింప బడినది. ఇందు కైయిల్ నడన్నాళ్ అను రెండు మలయాళ శబ్దములు తప్ప తక్కిన వన్నియు సంస్కృత శబ్దములే. చంపూ కావ్యములయందలి మణి ప్రవాళమునందు కానవచ్చు సంస్కృత శబ్దా ధిక్యమునకు ఇదియొక మచ్చు తునక!

3. 1 మలయాళమునందలి లీలా తిలకము అను లక్షణగ్రంథము మణిప్రవాళము ఒక్క కేరళ భాషయందే కలదని తెలుపుచున్నది. కాని అది యదార్థము కాదు. తమిళము, కన్నడము, తెలుగు అను ఇతర దక్షిణదేశ భాషలయందుకూడ ఇట్టి శైలి యొకటి యొక కాలమున ప్రచలితమై యుండినట్లు తెలియుచున్నది. అసలు మణప్రవాళము అను నీపదము తొలిసారిగా జినసేను డను జైనకవి షట్ ఖండాగమ మునకు రచించిన జయధవళమను వ్యాఖ్యానము చివర కాన వచ్చుచున్నది. జినసేనుడు క్రీ. శ. 837 లో దానిని పూర్తికావించెను. అందిట్లు కలదు.

'మణిప్రవాళ న్యాయేన
ప్రోక్తోఽయం గ్రంథ విస్తరః'

అందలి పూర్వభాగమునకు 'ధవళ' అనిపేరు. అతని గురువయిన వీరసేనుడు దానికి కర్త. అతడును తన రచనము మణిప్రవాళ శైలియందే సాగించెను.

కాని అందు వారు సంస్కృత ప్రాకృత భాషా మిశ్రమయిన మణి ప్రవాళమును అవలంబించిరి. ఆ మిశ్రణము మలయాళమును పోలినట్టిది కాదు. సంస్కృతభాషా రచితములును, ప్రాకృతభాషా రచితములును అగు స్వతంత్రములు, ప్రత్యేకములు అగు వచన భాగములతో ఆ రచనము సాగినది. అదియే క్రమముగా ఒకే వాక్యమునందును లేక ఒకే పద్యమునందును సంస్కృత విభక్త్యంతము లగు శబ్దములను యథా తథముగా దేశభాషా పదములతో కలిపి రచించు పద్ధతికి దారితోడి మలయాళమునందలి మణిప్రవాళమును పోలిన శైలిగా పరిణామము పొంది యుండుట సంభావ్యము.

3. 2. 1. దక్షిణ దేశములో మధ్యయుగము నందు వెలసిన వివిధ భాషలను చెందిన విద్వాంసులకు దీని యునికిని గూర్చి తెలియు ననుటకు ఆధారములు లభించుచున్నవి. కాశ్మీరదేశమునకు చెందిన అభినవగుప్తుడను విద్వాంసునకు కూడ దీనిని గూర్చిన యెఱుక కల దనుట మనకు ఆశ్చర్యము కలిగించును. అతడు క్రీ. శ. 11 వ శతాబ్దమునకు చెందిన వాడు. భరతుని నాట్యశాస్త్రమునకు అతడు రచించిన వ్యాఖ్యానములో దక్షిణ హిందూదేశమునందు ప్రచురమై యుండిన యీ మణిప్రవాళ శైలిని గూర్చి ప్రస్తావించుట మాత్రమే కాక కాశ్మీరదేశమునందును భిన్న నామముతో ఇట్టి శైలి యొకటి తన కాలమునందుండె నని పేర్కొనెను.

3.2.2. భరతుని నాట్యశాస్త్రమునందలి ముప్పది రెండవ యధ్యాయమున ధ్రువాగానమునం దుపయోగింప దగిన భాషనుగూర్చి యిట్లు కలదు.

దివ్యానాం సంస్కృతం గానం
ప్రమాదైస్తు విధీయతే
అర్ధ సంస్కృత మేవం తు
మానుషాణాం ప్రయోజయేత్.

నాట్య. 32–389

ఇందలి మూడవ చరణమునం దున్న 'అర్ధ సంస్కృత' మనుపదము మన కిక్కడ ప్రధానము. ఈ శ్లోకమునకు అభినవగుప్తుడు ఈక్రింది విధమున వ్యాఖ్యానము కావించెను.

'దివ్యానాం తు దేవ నృపాణాం ప్రమాణైః వ్యాకరణాది లక్షణైః ఉపేతం సంస్కృతం గానం శుద్ధం (అన్యత్) త్రివర్గప్రసిద్ధం పదమధ్యే సంస్కృతం మధ్యే దేశభాషాదియుక్తం తదేవ కార్యం. దక్షిణాపథే మణిప్రవాళం ఇతి ప్రసిద్ధం. కాశ్మీరే శాట కులం ఇతి. అన్యేతు సకల లోకప్రసిద్ధం వ్యాఖ్యానాపేక్షిభిః సంస్కృతైః కృతం అర్ధసంస్కృతం ఆహుః. అపరే వరరుచి ప్రణీత లక్షణాన్వితం పౌర సేన్యాది దేశభాషా వ్యతిరిక్తం ప్రాకృతం ఏవ అర్ధసంస్కృతం ఇతి మన్యంతే. యస్య యస్య యా పాఠే భాషా తయైవ తస్య గీతం ఇతి ముని మతం ఇత్యుపేక్ష్య'—

అభినవ భారతి. 4. సం. పు 379 (గైక్వాడ్ ఓరియంటల్ సీరీస్ —సంపాదకులు—మానవల్లి రామ కృష్ణకవి)

'దేవపాత్రముల, రాజపాత్రముల గానము వ్యాకరణాది లక్షణ సముపేతమయిన, శుద్ధమయిన సంస్కృతములో నుండవలయును. బ్రాహ్మణులు మొదలగు తక్కిన త్రివర్గములవారి గానమునకు దేశభాషా మిశ్రితమయిన సంస్కృతమును ఉపయోగింపవలయును. (మూలశ్లోకములోని అర్ధసంస్కృతము అనుమాటకు ఇది వివరణము.) దక్షిణాపథమునందు ఇది మణిప్రవాళము అని ప్రసిద్ధమైయున్నది. కాశ్మీరమునందు శాటకుల మని. కొందఱు అర్ధ సంస్కృతమను మాటకు సకలలోక ప్రసిద్ధమును, వ్యాఖ్యానము నపేక్షింపనివియు నగు సంస్కృత పదములతో గూడినది అని వివరింతురు. మఱి కొందఱు అది సౌరసేనాదులకు భిన్న మయినదియు, వరరుచి ప్రణీతమగు లక్షణములతో కూడినదియు నగు ఒక ప్రాకృతభాషయని తలతురు. కాని పాఠము (వచనము) ఏ భాషలో నున్నదో గీతము కూడ అదే భాషలో ఉండవలయును అన్న మునిమతమును అనుసరించి యిది యుపేక్ష్యము'—

3. 2. 3. అభినవగుప్తుని యీ వివరణమును అనుసరించి భరతుడు పేర్కొనిన అర్ధసంస్కృత మనుపదమునకు మణిప్రవాళమును పోలిన యొకభాష అని యర్థముగా స్పష్టమగుచున్నది. కాశ్మీరదేశము నందు ప్రచలితమై యుండినట్లుగా అతడు పేర్కొనిన 'శాటకుల' మనుభాష యెట్టిదో తెలియవచ్చుట లేదు. అసలు ఆ పదమే సాధువో, అసాధువో మనకు తెలియదు. దీనినిబట్టి మణిప్రవాళభాష ప్రాచీన కాలమునందును ప్రయుక్తమగుచుండెనని నిరూపిత మగుచున్నది.

మణిప్రవాళము — భాషామిశ్రము

4.1 మణి ప్రవాళమునకును భాషా మిశ్రమునకును భేదముకలదు. ఆ భేదము నెఱుగుటకు వాని స్వరూప స్వభావములను గూర్చి కొంత తెలిసికొనవలసి యున్నది. లీలా తిలకమునందలి మొదటి రెండు శిల్పములయందును మణిప్రవాళముయొక్క లక్షణము వివరముగా చర్చింపబడినది. దాని ననుసరించి మణిప్రవాళము భాషా సంస్కృతముల సమ్మేళనముచే సిద్ధించు చున్నది. ఇందు భాష అనగా కేరళభాష—మలయాళము. మలయాళశబ్దములను రెండు విధములుగా వర్గీకరింప వచ్చును. అవి ద్రావిడము, సంస్కృతము. ద్రావిడశబ్దములలో 1. శుద్ధమలయాళము, 2. భాషాంతరభవము (ఇతరద్రావిడ భాషాజన్యములు) 3. భాషాంతర సమము (ఇతర ద్రావిడభాషలకు సమములుగా రూపొందినవి) అనునవి చేరును—అట్లే సంస్కృత మూలకములలో సంస్కృతభవములు (తద్భవములు) సంస్కృతరూపములు (తత్సమములు) కలవు. ఇవి యన్నియు భాషా (కేరళభాష—మలయాళము) శబ్దములుగా పరిగణింపబడును. మలయాళము మరియొక విధముగా కూడ వింగడింప బడినది—ఉత్కృష్టము) అపకృష్టము అని. వానిలో ఉత్కృష్ట మనునది త్రైవర్ణికుల (అగ్రవర్ణములవారు)వ్యవహారము నందుండునది. అపకృష్టము పామరజనులు వ్యవహరించునది. వానిలో ఉత్కృష్టజాతికి చెందినభాష మణి ప్రవాళమున గ్రహింపబడును. అందు చేర్పబడు మఱొక అంగము సంస్కృతము. ఆ సంస్కృత శబ్దములు ఆ భాషా వ్యాకరణముచే సిద్ధించు సంస్కృత విభక్త్యంతము లయి యుండవలెను. అట్టి శబ్దములు ప్రచురములును, స్థానికులకు సుపరిచితములును అయి యుండవలయును. అప్పుడే జనరంజకమగు వాని సమ్మేళనము సిద్ధించును. సంస్కృతీకరింపబడిన మలయాళ శబ్దములనుకూడ మణిప్రవాళమున ఉపయోగింప దగును. ఇచట సంస్కృతీకరణము అనగా మలయాళ శబ్దములకు సంస్కృత విభక్తి ప్రత్యయములను చేర్చియు, సంస్కృత సంధి కార్యములు ప్రవర్తిల్లచేసియు ప్రయోగించుట. పామరజన వ్యవహారమునందు సహజముగా నట్టి ప్రయోగములు ఉండుటకు అవకాశము లేదు. మణిప్రవాళమునందు మలయాళ సంస్కృతములకు తప్ప తక్కిన భాషలకు ప్రవేశము లేదు. మలయాళముతో సంస్కృతేతర భాషాపదముల సమ్మేళనము సమ్మతము కాదు. మలయాళ సంస్కృత పదముల మనోరంజకమయిన సమ్మేళనమే సహృదయులకు ఆనందము కూర్చును. ఈ సమ్మేళనమునకు లీలా తిలకమునందు 'యోగము' అను అర్ధవంతమయిన పదము ప్రయోగింపబడినది.

4.2 మణిప్రవాళ మనునది ఒక విశిష్ట కావ్యశైలి యను నర్థములో రూఢమయినది. లీలా తిలకము ననుసరించి మణిప్రవాళమున ఇతర భాషా పదము లుండుటకు అవకాశము లేదు. అట్లు చేర్పబడినచో అది సంప్రదాయ విరుద్ధ మగును. అప్పుడది భాషామిశ్ర మగును కాని మణిప్రవాళము మాత్రము కాదు. ఇది ద్రావిడభాషా పదములను మణిప్రవాళమున చేర్చదగు ననువాదమును ప్రతిపక్షముచేయు సందర్భమున లీలా తిలకకర్త 'అప్పం తుప్పం' అను విధముగా ఇతర ద్రావిడభాషా పదముల సమ్మిశ్రణము చేయబడినచో అది 'భాషా మిశ్రము' అనబడునని తెలిపెను. మిశ్రమున దేనిని దేనితో నయినను కలుపవచ్చును. దానికి ఒక నియమము అక్కఱ లేదు.

4.3.1 యోగము, మిశ్రము అనుపదములు ఈ సందర్భమున విశిష్టార్థద్యోతకములుగా ప్రయోగింపబడి యుండుటను మనము గుర్తింపవలసి యున్నది. రెండు విభిన్న ద్రవ్యములు రసాయనిక మిశ్రణమునందువలె సంయోగము చెందుట యోగము. మిశ్రము అనగా రెండు ద్రవ్యముల కలయిక మాత్రమే. అందు రసాయనిక మిశ్రణము నందువలె సంయోగము ఉండదు. రసాయనిక మిశ్రణము సిద్ధించుటకు ఉభయ ద్రవ్యములకును కొలమానము మొదలగు పరిమితు లుండునట్లుగానే మణిప్రవాళమున భాషా సంస్కృతయోగము సిద్ధించుటకును కొన్ని నియమములు, కొన్ని పద్ధతులు కలవు. మణిప్రవాళమును 'భాషా సంస్కృతయోగం మణిప్రవాళం' అని నిర్వచించుటలో లీలా తిలక కారుడు యోగము, మిశ్రము అనుపదములకు కలభేదమును గుర్తించియే యుండెననవలసి యున్నది. కాని కొందఱు విద్వాంసులు ఆ రెంటిని (మణిప్రవాళము, భాషామిశ్రము) పర్యాయములుగా గ్రహించుట విచారకరము.

4.3.2 భరతుని నాట్య శాస్త్రమునందు ఈ క్రింది శ్లోకము కలదు.

భాషా విమిశ్రిత పదం ప్రమదాభి రామం
రామా వనాశ్రయ వరీ ఖలు పుష్ప గంధీ—

ఇందు భాషా విమిశ్రితపదము—అనగా సంస్కృత దేశభాషలతో కూడిన మిశ్రభాష. నాట్యప్రదర్శనమున 'పాఠ్యము' సంస్కృత దేశ భాషామిళితమయిన మిశ్రభాషగా ఉండవలయునని తాత్పర్యము.

సరస్వతీ కంఠాభరణమునందు ఇట్లు కలదు.

'నాత్యంతం సంస్కృతే నైవ
నాత్యంతం దేశభాషయా
కథాం గోష్ఠీషు కథయన్
లోకో బహుమతో భవేత్'—

పురాణ కథనమునందు మిశ్రభాష ఉపయోగింపదగునని పయి శ్లోకము తెలుపుచున్నది.

శుక సందేశమునకు ధర్మగుప్తుడు రచించిన వ్యాఖ్యానములో ఇట్లు కలదు. 'యత్కిల జగాద గోద భట్ట మహాకవి మానుషభాషా మిశ్రం మారపూజేతి మహాప్రబంధే' — ఇచట మిశ్ర పదము సంస్కృత మానుషభాషా సమ్మేళనమును తెలుపును. ఇందలి మానుషభాష జనుల వాడుక భాష.

క్రియాదీపికలోని ఈ క్రింది శ్లోకభాగము కూడ ఇచట ప్రసక్తము కాదగును.

'శ్లోక రూపేణ బంధిచ్చు
భాషా మిశ్రిత సంస్కృతైః—

వీర చోళియం అను తమిళ లక్షణ గ్రంథమునందు అలంకార పటలములో 'విరవియల్' అను కావ్య భేదముయొక్క లక్షణము ఇట్లు తెలుపబడినది. 'వడవెయుత్తు విరవువదు విరవియ లాయ్.'

4.4 పయిని ఉద్ధరింపబడిన ఉదాహృతులను బట్టి భాషా మిశ్రమున మణిప్రవాళమునందువలెనే సంస్కృతము ప్రధానమయిన ఒక అంగమని తెలియుచున్నది. అపుడు అందు చేరదగిన మఱొక భాష యేది? మణిప్రవాళమునందు అది త్రైవర్ణికులు మాత్రమే వ్యవహరించు ఉత్కృష్టజాతికి చెందిన మలయాళము. భాషా మిశ్రమున అది పామరజనభాష అనవలసియున్నది. లీలా తిలకమునకు ముందుకూడ భాషామిశ్రము ప్రచురమైయుండెను. భాషామిశ్రము మణిప్రవాళమువలె కేరళ దేశమునకు మాత్రమే సంబంధించినది కాదు. ఇతర భాషలయందును అట్టిభాషా మిశ్రము ఉండుటకు అవకాశము కలదు. భాషా మిశ్రము అనుపదమునకు 'భాషయా మిశ్రం సంస్కృతం భాషామిశ్రం' అని విగ్రహము చెప్పదగును. ఇచట భాష అనగా పామరజనుల భాష. మణిప్రవాళమున గ్రహింపదగిన మలయాళ శబ్దములు త్రైవర్ణికులు మాత్రమే వ్యవహరించునవి.

మణిప్రవాళము – పాట్టు

5.1 లీలా తిలకమునందు మణిప్రవాళముతోబాటు పాట్టు అనబడు మఱొక కావ్యశైలీ భేదము కూడ నిర్వచింపబడినది. అదే ఆ రెంటికిని కలభేదము కూడ స్పష్టముగా వివరింపబడినది. మణిప్రవాళము నందువలెనే పాట్టునందును భాషా సంస్కృత సమ్మేళనము ఉండును. కాని పాట్టును మణిప్రవాళమునుండి వేఱు చేయు మఱికొన్ని అంశములు కలవు. పాట్టు అనునది గానకావ్యము. అందు ఎదుగ్గై

(ప్రాసము), మోనై (యతి) అను నియమములు అనుసరింపబడును. మఱియు పాట్టునందు సంస్కృతము నందలి సామాన్య వృత్తములు కాక విశేష వృత్తములును, తమిళమునందు గాన యోగ్యములయిన ఛందస్సులును రచింపబడవలయును. ఇవి మాత్రమే కాక పాట్టునందు గ్రహింపబడు సంస్కృతపదములు తమిళమునందలి ధ్వనులకు ఒదుగునట్లుగా మాఱుపాటు కూడ చెందవలసి యుండును. సంస్కృతము నకును, తమిళమునకును సమానముగానున్న ధ్వనులను మాత్రము ఎట్టి మాఱుపాటును లేకయే గ్రహింపదగును. ఇట్లు పాటు సంస్కృత శబ్దములను యథా తథము స్వీకరింపక తమిళ వర్ణసమామ్నాయమునకు ఒదుగురీతిని చేయబడిన మాఱుపాటులతో స్వీకరించునది యగుటచే నది మణిప్రవాళముతో భేదించు చున్నది. మఱియు పాట్టు గాన కావ్యమగుటచేత అది కవిత్వమునకు మాత్రమే పరిమితమయిన భాషాశైలి యగుచున్నది. మణిప్రవాళము అట్లు కాక వచనమునందును, ఇతర రచనములందును కూడ గ్రహింపబడును. పాట్టునందు శబ్దాలంకార సాధనములను ఎదుగై (ప్రాసము), మోనై (యతి), ప్రాస పూర్వాక్షర నియమము, అంతాది (ముక్తాక్షర గ్రహణము) అనునవి నియతముగా పాటింపవలసిన నియమములు. పాట్టులు గాన కావ్యము లగుటచే—ప్రాయికముగా ప్రాచీన కాలమున ధారణమునకై అవి పాట్టులందు ప్రవేశపెట్టబడి యుండవచ్చును. మణిప్రవాళమునందు ఇట్టి నియమములు లేవు. మణిప్రవాళము ప్రాయికముగా సంస్కృతమునందలి సామాన్య వృత్తములలో రచింప బడును. సకృత్తుగా అందు దేశీయ వృత్తములు కూడ ఉండవచ్చును. కాని లీలాతిలకము మణిప్రవాళము సంస్కృత వృత్తములందే నియతముగా ఉండవలయునని నిర్దేశింప లేదు. మణిప్రవాళమునందలి ఛందస్సు విషయమున ఎట్టి నిర్దేశమును కాని చేయని లీలా తిలక కారుడు పాట్టునందు మాత్రము పాటింపదగిన ఛందోవిశేషములను గుఱించి వివరించి యుండుటనుబట్టి ఆ రెండు కావ్యశైలులకునుగల భేదమును స్పష్టము చేయుట అతని యాశయముగా గ్రహింప దగును. తన కాలమునందలి 'పాట్టు' కావ్యములలో గ్రహింపబడిన ఛందో భేదములే ఆతనిని ఆ విధమున ఛందో నిర్దేశము చేయుటకు ప్రోత్సహించి యుండ దగును. సంస్కృత వృత్తములకంటెను ద్రావిడ ఛందస్సులు గేయ ధర్మము విశేషముగా కలవనుట యథార్థము. అందుచేతనే పాట్టు కావ్యములందు దేశీయ ఛందస్సులు గ్రహింపబడినవి.

5.2 మణిప్రవాళమునకును, పాట్టునకును కల ప్రధానమైన భేదము యోగము. మణిప్రవాళమునందు యోగము ప్రధానముగా నుండ వలసిన ధర్మము. పాట్టునందు ఇట్టి యోగము అవసరము లేదు. మఱియు పాట్టునందు పాండ్యభాష (తమిళము) యందలి పదములకు సమానములయిన పదములు ప్రయోగింప బడ వలెను. దీనిని బట్టి పాట్టునందలి భాష తమిళమునకు సన్నిహితమయినది కాగా మణిప్రవాళమునందలి భాష సంస్కృతమునకు సన్నిహితమై యుండును.

5.3 ఇట్లు మణిప్రవాళమునందును, పాట్టునందును సంస్కృత మలయాళ శబ్దముల సమ్మేళనము కానవచ్చినను పయిని చూపిన కారణములచే అవి రెండును ఈషద్భేదము మాత్రమే కల కావ్యశైలులు కావు. అవి పూర్తిగా భిన్నములయిన రెండు కావ్యశైలీ భేదములు.

మణిప్రవాళము — తమిళము

6.1 మణిప్రవాళ రచనా విధానము ఒక్క మలయాళమునందు మాత్రమే కాక తమిళము, కన్నడము, తెలుగు అనుభాషలయందుకూడ ప్రవర్తిల్లి యుండినట్లు తెలియుచున్నది. తమిళమునందు జైనులును, వైష్ణవులును రచించిన వ్యాఖ్యానములలో మణిప్రవాళభాష విస్తారముగా ఉపయోగింపబడినది. ఉత్తర సంగయుగమునందు జైనులు రచించిన వచన కావ్యములందుకూడ ఇట్టిభాష కానవచ్చును. ఈ వాక్యములు చూడుదుడు :

'The works of this period (Post Sangam A D. 150 to A. D. 500.) are the Jain Prose works of the 'mongrel sort of Diction' known as Manipravalam Style, which is pleasing neither to the purely Tamil nor the purely Sanskrit ear; of these prose works

Sripuranam and Gadya Chintamani deserve mention 1—

వైష్ణవ మతమునకు సంబంధించిన వ్యాఖ్యానములలో కానవచ్చు మణిప్రవాళ శైలిని ఈ క్రింది యుద్ధరణమునందు చూడదగును.

'మూణ్ఱాం తిరువాయ్ మొయియిల్ ప్రాప్య భూమియిల్ యోగ్యతైయయుం అంగు ప్పోనాల్ అడిమై శెయ్యుం పడియైయుం అనుసంధిత్తు ప్రీతరాయ్ అప్పోదే ప్రాప్య భూమియిల్ శెల్లప్పెరామె యాలుం పణ్డు పల్కాల్ పిఱంద వాసనైయాలుం ప్రకృతి యిలే యిరిక్కిరమైయై అనుసంధిత్తుం తాన్ నిణైత్తదే శెయ్యక్కడవ దాన ఈశ్వర నుడయ స్వాతంతర్యత్తై అను సంధిత్తుం అవనుక్కు తమ్మై విషయీ కరిత్తల్లదు నిర్కవొణ్ణాద పరమభక్తి తమక్కిల్లై యాగవుం పార్త్తుం 'ఇప్రకృతి యిలే ఇన్నముం తమ్మై వైత్తరుళిల్ శెయ్ వదిన్' ఎన్నుం భయత్తాలే మిగవుం అవసరన్నరాన ఆళ్వార్ తమ్ముడయ దయయై అన్యాపదేశత్తాలే పేశిగిరార్'—

—మూడవ తిరువాయ్‌మొయి.

6.2 క్రీ. శ. 11 వ శతాబ్దమునకుచెందిన 'వీరచోళియం' అనబడు తమిళ లక్షణ గ్రంథమునందు విరవియల్, కిళవిక్కవి, తుర్షైక్కవి, పిరళిక్కై (ప్రహేళిక) మొదలగు కావ్యభేదములను వివరించు సందర్భమున మణిప్రవాళము అను కావ్యభేదము కూడ పేర్కొనబడినది.

ఇడ్డైయే వడవెళుత్తైయిదిల్
విరవియ లీన్డెదుగ్గై
నడ్డై యేదు మిల్లా మణిప్పిరవాళ
నత్తైవచ్చొల్లిన్
ఇడ్డైయే ముడియుం పదముడ్డై తా
జ్కిళవి క్కవియిన్
తొడ్డైయే తుఱైనఱ్ పిరళిక్కై యాది
తుణిన్దఱియే.

అలంకార పటలము. 40.

1 Tamil–The Language and its Literature. P 56.

Introduction to Kamba Ramayanam — A Study.

సంస్కృత ధ్వనులతో కూడిన రచన విర వియల్. ప్రాసనియమము కలిగి సంస్కృత పదములతో కూడిన తమిళ రచనము మణిప్రవాళము. కిళవిక్కవి యందు పెక్కుభేదములు కలవు. పిరళికై (ప్రహేళిక) మొదలగు వినావికవి రచనములు (వినావికవి అనునది తమిళమున ప్రాశ్నికరూపము కల రచనము) అని పయి తమిళ పద్యమున కర్థము. వీరచోళియమునందలి అలంకార పటలమున సొల్లణి, తంత్రవృత్తి, తంత్ర గుణము, తంత్ర ఉరై, న్యాయశాస్త్రమునందలి అను మానాదులు అనువానిని వివరించి చిత్రకవిత్వమును గుఱించి తెలిపి, చిత్రకావ్య భేదములను వివరించిన పిదప విరవియల్, మణిప్రవాళము, కిళవిక్కవి, పిర ళికై అను ఈ కావ్యభేదములు తెలుపబడినవి. కాని అందలి గ్రంథభాగమునందుకాని, దానికి రచింపబడిన వ్యాఖ్యానమునందు కాని వానికి లక్ష్యములు ఉదాహరింప బడలేదు. దీనినిబట్టి తమిళమున మణిప్రవాళము నందు కొందఱు రచనలు సాగించిరనియు, లాక్షణికులు కూడ దాని యునికిని గుర్తించి కావ్యభేదములలో దానిని కూడ ఒక ప్రభేదముగా గుర్తించిరనియు తెలియు చున్నది. కాని యీ రచనా విధాన మా భాషలో వేరూన లేదు. 'శెందమిళు'నందు అత్యంతాభిమానము కలిగిన తమిళ కవులు ఈ మార్గమును గర్హించి అచ్చ మయిన తమిళమునందే కావ్య రచనము సాగించిరి.

6.3 తన కాలమునందు జైనకవుల, విద్వాం సుల మూలమున తమిళభాషకు కలుగుచుండిన ప్రమా దమును గుర్తించి తిరుజ్ఞాన సంబంధర్ (పంబందర్) అను శైవ భక్తుడు వా రుపయోగించిన మణిప్రవా ళమును 'సంకద పంగము' (సంస్కృత భంగము) అని గర్హించెను. అది అటు సంస్కృతమును కాదు. ఇటు తమిళమును కాదు—అని అతడు దానిని విమర్శించెను. అతడు చేసిన మణిప్రవాళ గర్హణమును ఈ క్రింది రచనములో చూడదగును.

'ఆగమత్తోడు మందిరంగ ళమైన్ద సంకద పంగమాం పాదగం

—తేవారము, తిరువాలవాయ్ పదిగం.

దీనినిబట్టి తమిళులకు మణిప్రవాళము గూర్చి యెట్టి యభిప్రాయము కలదో వ్యక్తము కాగలదు.*

6.4 తమిళ కవి చక్రవర్తులలో ఒకడగు ఒట్టక్కూత్తర్ తన కావ్యములయందు సంస్కృత భూయిష్ఠమయిన, గంభీరమయిన శైలిని నిక్షే పించెను. అదియు తమిళులకు సహింపరానిదయ్యెను. క్రీ. శ. 12 వ శతాబ్దమున శేక్కిలార్ అను కవి తన 'పెరియ పురాణము' అను గ్రంథమున అట్టి సంస్కృత భూయిష్ఠ శైలికి స్వస్తి చెప్పి 'శెందమిళు'ను తిరిగి పునరుద్ధరించి భ్రష్టము కాకుండ దానిని సంరక్షించె నని వారు విశ్వాసముతో స్మరింతురు.

6.5 వైష్ణవ వ్యాఖ్యానములనుండి మణి ప్రవాళ భాషకు ఉదాహరింపబడిన ఉద్ధరణమునుబట్టి తమిళులు ఉపయోగించిన మణిప్రవాళమునకును, మలయాళమునందలి మణిప్రవాళమునకును విస్పష్ట మయిన భేదము కలదు. సంస్కృత శబ్దములను తమిళ విభక్తులతో చేర్చి తమిళ శబ్దములతోబాటు రచనమునం దుపయోగించుటను మణిప్రవాళముగా తమిళులు పరిగణించి దానినే వారు పరిహరించిరి. సంస్కృత విభక్త్యంతములయిన సంస్కృత శబ్దము లను తమిళ శబ్దములతో చేర్చి ప్రయోగించు పద్ధతి తమిళమున వెలయలేదు. కనుక తత్సమ పదభూయిష్ఠ మయిన భాషయే తమిళమున మణిప్రవాళముగా పరి గణిత మయ్యెననియు, అదియు వారికి గర్హ్య మయ్యె ననియు మనము గమనింపవలసియున్నది.

(సశేషం)

---

*Tamil has always been trying to be true to its genius. There was a danger to this in the age of St. Tirugnana - Sambandar and he Condemned the hybrid language of the Jains which was neither good Sanskrit nor good Tamil. He also very much criticised the corruption of Sanskrit words (Sankata Pankam.)

– Tamil and other cultures. P. 35.

by Dr. T. P. Meenakshi Sundaram.

"ధర్మోపన్యాస కేసరి, ఆర్షవిద్యాభూషణ" శ్రీ జటావల్లభుల పురుషోత్తము గారు

శ్రీ రాపాక ఏకాంబరాచార్యులు

సంస్కృత భాషను, హిందూ ధర్మమును, భారతీయ సంస్కృతిని ఉద్ధరించుట యను మహోద్యమమును 40 సంవత్సరములనుండి యవిచ్ఛిన్నముగా సాగించుచు తన యావదాంధ్ర దేశ విపుల పర్యటనలచేతను గ్రంథరచనచేతను సాంస్కృతిక నవచైతన్యము నాంధ్రావని యందుద్భవింప చేసిన మహనీయుడు శ్రీ జటావల్లభుల పురుషోత్తము గారు.

పురుషోత్తము గారు 17–2–1906 (విశ్వావసు సంవత్సర మాఘ బహుళ సప్తమీ శనివారము నాడు)వ తేదీని వారి మాతా మహస్థలమైన తూర్పు గోదావరిజిల్లా నడవపల్లి గ్రామమున జన్మించిరి. వీరికి 13 సంవత్సరముల ప్రాయము వచ్చు వరకు స్వగ్రామమున ఆత్రేయపురమున నుండిరి. వీరి పూర్వులు అనేక తరములు వేదపాఠ విశేషములైన జటలోను, ఘనలోను ప్రశస్తిగనుటచే వీరి వంశమునకు జటావల్లభ నామము కలిగినది. పురుషోత్తముని జనకులు కృష్ణసోమయాజులు గారు, వేద శ్రౌతములలో నిధి, సంస్కృతములో కావ్యపాఠములనుకూడ చెప్ప గల్గియుండిరి. తల్లి మహాలక్ష్మమ్మ గారు పరమ దయార్ద్ర హృదయ. తండ్రిగారి మేధా సంపత్తియు, వైదిక సంస్కారమును, తల్లిగారి దయాగుణమును పురుషోత్తము గారికి సంక్రమించినవి. పురుషోత్తము గారికి అయిదుగురు సోదరులు, ఇద్దరు చెల్లెండ్రు కలరు. కాకినాడలో సుప్రసిద్ధ వైద్యులు శ్రీ మర్ల నరసింహశాస్త్రిగారి యేకైక పుత్రిక బాలాత్రిపుర సుందరమ్మ గారు పురుషోత్తముని ధర్మపత్ని. పురుషోత్తముగారికి నల్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు కలరు.

పురుషోత్తముడు బాల్యమున ప్రాథమిక పాఠశాలలో చదువుకాలముననే యింటివద్ద పితృపాదుల సన్నిధిని సంస్కృత కావ్యములను పఠించిరి. పిమ్మట నంద్యాలలో నుద్యోగమున నున్న జ్యేష్ఠ సోదరుని వద్దనుండి అచ్చటి ఎస్. పి. జి. హైస్కూలులో రెండు సంవత్సరములు చదివి తర్వాత నర్సాపురం టైలరు హైస్కూలులో హైస్కూలు చదువు ముగించిరి. ఇంటరు, బి. ఏ తరగతులు విజయనగరము మహారాజా కాలేజీలో చదివిరి.

ఇంటరులో వీరు సైన్సు గ్రూపు తీసికొనిరి. బయాలజీ ప్రాక్టికల్ క్లాసులో కప్పను కోయుట కంగీకరింపక వీరా గ్రూపును విడిచిపెట్టిరి. సైన్సు తీసికొనువారికి ఉద్యోగావకాశములు బాగుగా నుండునని ఉపన్యాసకులు, ప్రిన్సిపల్ చెప్పినను పురుషోత్తముడు భూతదయ యన్నిటికంటె ప్రధానమని సమాధానము చెప్పెను.

కళాశాలలో విద్యార్థిగా నుండిన కాలములో వీరు సారస్వత చర్చలలో విశేషముగా పాల్గొనెడివారు. విద్యార్థి యూనియన్ కార్యదర్శి పదవి యొక సంవత్సరమును, అధ్యక్షపదవి యొక సంవత్సరము వీరిని వరించెను. బందరులో జరిగిన ఆంధ్రరాష్ట్రీయ విద్యార్థి మహాసభలో నీయన తన కళాశాల ప్రతినిధిగా పాల్గొని యందు కొన్ని తీర్మానములను కూడ ప్రతిపాదించిరి.

ఆంగ్ల విద్యాలయములలో చదువుకొనుచున్నంత కాలము పురుషోత్తము గారు ఇంటివద్ద ప్రత్యేకముగా సంస్కృత విద్యాభ్యాసమును సాగించుచునే యుండెను. నడుమ కొంతకాలము ఆంగ్లవిద్యను మాని నరేంద్రపురములో గురుకుల పద్ధతిని సంస్కృత విద్యాభ్యాసము గావించెను. పండిత దిగ్గజములగు శ్రీ పుల్య ఉమామహేశ్వర శాస్త్రిగారును, శ్రీ వేమూరి రామగోవింద శాస్త్రిగారును వీరికి ప్రధాన గురువులు. బి. ఏ పూర్తి చేయు నప్పటికే యీయన యొక సంస్కృత పండితుడుగా రూపొందెను. స్పెషల్ ఇంగ్లీషు నభిమాన విషయముగా తీసికొని యీయన బి. ఏ పరీక్షలో నుత్తీర్ణుడాయెను.

కళాశాల వీడునప్పటికి పురుషోత్తమునకు సాంఘిక ధార్మికాధ్యాత్మిక రాజకీయ విషయములలో సుదృఢములైన భావములు కొన్ని యేర్పడియుండెను. సంస్కృతభాష యుద్ధరింప బడనిచో భారతీయత క్రమముగా నడుగంటుననియు, ఆంగ్లేయ పరిపాలనము మరి కొంతకాలము సాగుచో భారతదేశ ధర్మ సంస్కృతులు నశించుననియు, ఆధునిక భౌతిక వాదమునకు విరుగుడుగా పనిచేయగలది శ్రుతి స్మృతి ప్రతిపాదిత ధర్మప్రచారమే యనియు వీరికి నిశ్చితాభిప్రాయము లేర్పడెను.

40 సంవత్సరముల క్రిందట కాకినాడలో బ్రహ్మసమాజికులకును, ప్రాచీన సంప్రదాయికులకును విగ్రహారాధనమును గురించి చాల దినములు చర్చలు జరిగెను. డాక్టరు వేమూరి రామకృష్ణారావు గారు, శ్రీ కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు మున్నగు పెద్దలు ఉభయపక్షములనుండియు మాట్లాడిరి. ఆరవనాడు పురుషోత్తముగారు చర్చలో పాల్గొనిరి. వీరి యుపన్యాసము నూతనాంశములతో గంగాఝరీ సదృశ ప్రవాహముతోనుండి యెల్లర నాకర్షించినది. అదివరకు మాట్లాడిన ప్రతిపక్షులందరు తమ్ము వ్యక్తిగతముగా దూషించిరనియు, ఈ యువకుని ఉపన్యాస మొక్కటి ఉదాత్తముగా నున్నదనియు బ్రహ్మసమాజికులు మరునాడు సభలో ప్రకటించిరి. 'The only refreshing speech came from the last speaker of yesterday' అని కూడ వారి పక్షమున సభలో చదువబడిన లేఖలో నుండెను. ఆ చర్చలు జరిగిన కొలది మాసములకే ప్రిన్సిపల్ రామకృష్ణారావుగారు తమ పి. ఆర్. కాలేజీలో పురుషోత్తముగారికి ఉద్యోగమిచ్చిరి.

1932 మార్చి, ఏప్రిల్ మాసములలో కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠ కార్యదర్శి శ్రీ వల్లూరి సూర్యనారాయణరావు గారికిని పురుషోత్తమునకును ఆంధ్రపత్రికలో నొక చర్చ జరిగెను. శ్రీ రావుగారు 'గౌతమధర్మ సూత్రములు' అను వ్యాసములో సనాతన ధర్మము నధిక్షేపించిరి. పురుషోత్తము గారందలి ప్రతియంశమునకును సమాధాన మొసగిరి. పంతులుగారు 'వీరు మృదు విమర్శకు సంతసించితిని. నా కింకను సందేహములున్నవి. వానిని కూడ తీర్చవలయునని పురుషోత్తముగారిని కోరుచున్నాను' అని వ్రాసిరి. ఆ వ్యాసమునకును పురుషోత్తము గారు సరస సమాధాన మిచ్చిరి.

ఇది జరిగినయొక నెలకే తమ విద్యా పీఠమునకు ప్రిన్సిపాల్ కావలయుననియు, న్యాయమైన విమర్శన, పరిశోధన గావింపగల పట్టభద్రులు అప్లికేషన్ పంపుకొన వచ్చుననియు సూర్యనారాయణ రావు గారు ఆంధ్రపత్రికలో ప్రకటించిరి. పురుషోత్తము గారు దరఖాస్తు పంపిరి. దరఖాస్తుతో తాను బి. ఏ చదువుచున్న దినములలో రచించి తరువాత త్రిలింగ పత్రికలో ప్రకటించిన 'భారతదేశౌత్కృష్ట్యము' అను గ్రంథమును కూడ పంపిరి. పంతులుగారిట్లు సమాధాన మిచ్చిరి. 'ఎందరో పెద్దలా యుద్యోగమునకు దరఖాస్తు పెట్టినారు, అయినను మీకు తప్ప మరొకరికీ యుద్యోగము నీయను.'

తనచే ఖండనమునకు గురి కావింప బడిన వారి మన్ననను కూడ పురుషోత్తము డెట్లు పొందెనో యనుటకు రెం డుదాహరణములను చూచి యున్నాము. ప్రతిపక్ష ఖండనలో పురుషోత్తముడు పాటించు మర్యాద చివరివరకు నివిదముగనే సాగినది.

శ్రీ జటావల్లభుల పురుషోత్తము గారు

1—7—1932 తేదీని పురుషోత్తముగారు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠమునకును తదనుబంధియైన శ్రీ వాడ్రేవు జోగాయమ్మ సంస్కృత కళాశాలకును ప్రిన్సిపల్‌గా ప్రవేశించిరి. నాటినుండి వీరు ఆ సంస్థలకు చేసిన సేవ, వానికి కూర్చిన ప్రతిష్ఠ, విద్యార్థులయందు వారు చూపిన పుత్ర వాత్సల్యము సువిదితములు. సంస్కృత కళాశాలా వాతావరణముపై మక్కువ వలననే వీరు కాకినాడ కళాశాలలో తమకు ఎం. ఏ ప్యాసయిన వెంటనే ప్రాచ్యభాషా ప్రధానాచార్యత్వము నిచ్చెదనని రామకృష్ణా రావుగారు ఎన్నివిధములు చెప్పినను వినక తక్కువ జీతముతో కొవ్వూరులో నుండుటకే యిష్టపడిరి.

అన్నిటికంటె ముఖ్యమైనది అచ్చట చేరినప్పటి నుండియు వీరు పరిశోధనలో నిమగ్ను లయిరి. ఏ విద్యార్థికంటె ఎక్కువగా చదువు చుండెడివారు. విద్యాపీఠ గ్రంథాలయము వీరి కృషి కెంతో దోహదము చేసినది. పురుషోత్తముగారు వేదశాస్త్రోభయ విద్వాంసు లయిన శ్రీ కొంపెల్ల సత్యనారాయణ శాస్త్రిగారి సాహాయ్యముతో చతుర్వేద సాయణ భాష్యములను చదివిరి. వేదమును గూర్చి ప్రామాణికమైన విజ్ఞానము సంపాదించిరి. 'వేదకాలపు స్త్రీలు' అను గ్రంథము రచించిరి. దానిని చదివినవారెల్లరు ఏ భాషలోనైనను నిష్పక్షపాతముగా కేవల సత్యాన్వేషణ దృష్టితో రచింపబడిన గ్రంథములలో నిది యొకటి యని అంగీకరింప గలరు. ఈ గ్రంథము సనాతన ధర్మవాదులకును సంస్కర్తలకును సమానముగనే యుపకరించును.

పిమ్మట పురుషోత్తము గారు స్వయముగా సమగ్రముగా మన్వాది సమస్త స్మృతులను పరిశీలించి 'స్మృతి కాలపు స్త్రీలు' అను గ్రంథము రచించిరి. ఇదియు పై గ్రంథమువలెనే పరిశోధన చేయు వారికెంతో యుపయోగించు గ్రంథము. మూల గ్రంథముల నిట్లు పరిశీలించుటతోపాటు మాక్సుముల్లరు, మాక్డొనెల్ మున్నగు పాశ్చాత్యుల వ్రాతలను పరిశీలించుచు వారిని సమర్థించుచు కొన్ని వ్యాసములను, ఖండించుచు కొన్ని వ్యాసములను పురుషోత్తముగారు పత్రికలలో రచించిరి. మానవ ధర్మ సూత్రమను నొక గ్రంథ మొకప్పుడుండెనని మాక్సుముల్లరు సిద్ధాంతము సమగ్రముగా చర్చించుచు పురుషోత్తముగారు 'మానవధర్మ సూత్రమను గ్రంథముండెనా?' అను వ్యాసమును ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచికలో వ్రాసిరి. 'ఆర్యుల యాది నివాసము భారతదేశమే' 'విదేశములలో భారతీయ సంస్కృతి' 'భారతీయ విజ్ఞాన ప్రభావితు లయిన పాశ్చాత్యులు' ఇత్యాది పరిశోధనాత్మక వ్యాసములను కూడ వీరు సంవత్సరాది సంచికలలో ప్రకటించిరి.

శ్రీ కున్హన్ రాజా, శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రిగారల స్కందస్వామి వేదభాష్యమును గురించిన పరిశోధనా వ్యాస మొకటి 30 సంవత్సరముల క్రితము భారతిలో ప్రకటింపబడగా పురుషోత్తముగారు వారి వ్యాసములోని విద్యారణ్య భాష్యముకంటె స్కందస్వామి భాష్యము మిన్నయను నభిప్రాయమును ఖండించుచు భారతిలోనే యొక వ్యాసమును ప్రకటించిరి. ఈ మూడు ప్రముఖ పత్రికలలోను మరియు ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, గ్రంథాలయ సర్వస్వము, గృహలక్ష్మి, ఆంధ్రప్రభ, జాగృతి, కృష్ణాపత్రిక మున్నగు పత్రికలలోను పురుషోత్తముగారిచే రచింపబడిన సుమారు 600 వ్యాసములను పేర్కొనుట కైనను ఇటతావులేదు.

సాహిత్యము, మతము, రాజకీయము మున్నగు బహువిషయములకు చెందినవిగా నీ వ్యాసములున్నవి. ఆంగ్ల దినపత్రికలలో వీరు ప్రకటించిన రచనలను ఆంగ్లభాషా కోవిదులెంతయో ప్రశంసించిరి. ఈ రచనలలో వీరికి సమకాలిక సమస్యలపైగల అవగాహనము, వాని పరిష్కారమునకై వారి మానసికాన్వేషణము ఎంత ప్రగాఢమైనవో తెలియగలదు. వీరొసగిన రేడియో ప్రసంగములు సుమారు 40 కలవు. అందు కొన్ని ఆంగ్లములోను, కొన్ని సంస్కృతములో నున్నవి.

నేటి కాలమున సరళసుందరమైన సంస్కృత కవిత్వ రచన గావించు వారిలో పురుషోత్తముగా రొకరు. 'చిత్ర శతకము'ను వీరి గ్రంథమును శ్రీ విశ్వనాథ వారు 'ఈ గ్రంథమంతయు బంగారమే' యని వర్ణించిరి. ఈ రచన 'సంస్కృత వాణీ విలాసము'ని · ఆంధ్రపత్రిక

శ్లాఘించెను. శ్రీమత్తిరుమల గుదిమెళ్ల వరదాచార్యులు గారు 'అత్ర త్యా భాషా అత్యంతం రమణీయా అర్థశ్చ అత్యంతం గభీరః' అని ప్రశంసించిరి.

వీరి చిత్రశతకమునుండి యొక శ్లోకమును జగద్గురు ప్రశస్తినుండి యొక శ్లోకమును ఉదాహరించు చున్నాను :

'రమ్యం కవిత్వం భువి ధర్మ దూరం
ధర్మ్యం కవిత్వం నహి రమ్య మేవ
స్వర్ణం సుగంధి ద్విగుణం కవిత్వం
గీర్వాణ వాణ్యా ఇతరత్ర కుత్ర'

(చిత్ర శతకము)

(లోకములో ఇతర భాషలలో కవిత్వము సుందరముగా నున్నచో నందు ధర్మబోధ మృగ్యము; ధర్మబోధకముగా నున్నచో నందు సౌందర్యము కన్పట్టదు; సౌందర్యము, ధర్మబోధ యను రెండు లక్షణములను కలిగి పరిమళించు బంగారమువలెనున్న కవిత్వము సంస్కృత భాషలో తప్ప మరెట నున్నది?)

'రాజాధి కారా దధిక ప్రభావః
శ్రీ మాతృ ప్రేమ సమాన భావః
మాధుర్య భావోప్య మృతైక నిష్ఠ
స్తదీక్షణే సమ్మిళితా భవన్తి'

(జగద్గురు ప్రశస్తి)

(ఆ జగద్గురువుల నేత్రములలో రాజాధికారమును మించిన అధికారమును, మాతృప్రేమను మించిన ప్రేమయు, అమృతరసమును మించిన మాధుర్యమును మిళితములై యున్నవి.)

హిందూధర్మమును ప్రచారము చేయుటకు ముఖ్యసాధనముగా వీరు 1940 లో 'హిందూమతము' అను గ్రంథమును రచించిరి. శ్రీ తాతా సుబ్బరాయ శాస్త్రిగారు, శ్రీ ఉప్పులూరి గణపతి శాస్త్రిగారు మున్నగు పండిత ప్రకాండు లీ గ్రంథముయొక్క ప్రామాణికతను బహువిధముల శ్లాఘించిరి. ఈ గ్రంథము 12 పర్యాయములు ముద్రితమై యాంధ్ర దేశమున నలుమూలలకు వ్యాపించినది. హిందూ మతమన నేమియో తెలుసుకొన గోరు వారికీ గ్రంథమత్యంతోపయోగకరమగుటచే మత విజ్ఞాన పరీక్షలు నడుపు వారీ గ్రంథమును పాఠ్యగ్రంథముగా నిర్ణయించుచున్నారు. ఇది తమిళములోనికిని, కన్నడములోనికిని అనువదింప బడినది.

పురుషోత్తముగారి 'భారతీయ విజ్ఞానమ'ను గ్రంథము మన ప్రాచీన భౌతిక ధార్మికాధ్యాత్మిక విజ్ఞానమును నేటి సైన్సుతో పోల్చునట్టి గ్రంథము. 'భారతీయవైభవము' సంస్కృతభాషా మహత్వాది విషయములను నిరూపించు గ్రంథము. 'ధర్మమంజరి' యను గ్రంథము మనుస్మృతి సారమును సామాన్య పాఠకున కందించు కృతి. భగవద్గీతా ప్రవేశము' గీతను ఏకధారగా నర్థము చేసికొనుటకు తోడ్పడు గ్రంథము. 'ఆధ్యాత్మిక వ్యాసములు' అనునది షడ్దర్శన స్వరూపము తెలుపునట్టియు 'శాంకరదర్శనము'ను, శంకరాచార్య ప్రతిభను వ్యాఖ్యానించు నట్టియు, కర్మ, పునర్జన్మము, పుణ్యపురుషులు—పుణ్యభూములు ఇత్యాదుల తత్త్వమును ఆధునికులకు గ్రాహ్యమగురీతిని బోధించునట్టియు వ్యాసములతో కూడిన గ్రంథము. 'మహాకవి సందేశము' అను గ్రంథములో వీరు సంస్కృత మహాకవులలో కళాసౌందర్యము, ధర్మబోధ యెట్లు మిళితమైయున్నవో యను నంశమును 400 శ్లోకముల నుదాహరించుచు నిరూపించిరి.

ప్రధానముగా లోకములో ప్రసిద్ధమైనవి వారి వక్తృత్వము, బహుముఖ విజ్ఞానము. సభ్యులపై సమ్మోహ నాస్త్రము వేసినట్లు పన్యసింపగల శక్తిని భగవంతుడు వారికి ప్రసాదించి నాడు. పురుషోత్తముగారు మాతృ భాషలోను, సంస్కృతము నందును ఆంగ్లమునందును పటిష్ఠమైన వక్తృత్వము, రచనాశక్తికలవారు. ఇట్టిశక్తుల సమ్మేళనము కలవారు ఏ దేశములోనైనను కొద్దిమంది మాత్రమే యుందురు. ధర్మము, సాహిత్యము, జాతీయత, వేదాంతము మున్నగు విభిన్న విషయములపై సుమారు 2500 మహాసభలలో ఉపన్యసించిన పురుషోత్తముగారి బహుముఖ విజ్ఞానమును పతిత లూహించు కొన వచ్చును. వేదము, ధర్మశాస్త్రములు, వారి ప్రధానవిహార రంగములు. సాహిత్యము వృత్తిచేతనేకాక అభిరుచిచే కూడ వీరిచే సేవింపబడినది. వేదాంతముపై పురుషోత్తముగారు

ప్రసంగించుటను విన్నవారెల్లరు ప్రస్థాన త్రయ ముపై వీరు గావించిన కృషి కాశ్చర్య పడుదురు. జాతీయ సమస్యలు, అంతర్జాతీయ సమస్యలు వారికి కరతలా మలకములు.

అదివరకు హిందూ మత సంస్కృతులను నిర సించువా రెందరో వీరి యుపన్యాసములను విన్న తర్వాత తద్భక్తులైనారు. వీరు సంస్కృత భాషా ప్రాశస్త్య మును గూర్చియో, కాళిదాసాది మహాకవులను గూర్చియో యుపన్యసింపగా విని సంస్కృతము నేర్చు కొన్నవారు, తమ పిల్లలకు సంస్కృతము నేర్పించిన వారు వందలకొలది కలరు. వీరి ప్రబోధములకు ఫలిత ముగా వేద సంస్కృత పాఠశాలలు, వేదశాస్త్ర ప్రవ ర్ధక సభలు ఎన్నియో బయలుదేరినవి. వీరి యుపన్యాస ముల ప్రభావమునకు లోనైనవారు ఒక వర్గమునకు చెందిన వారు కారు, అన్ని యంతరములు లోని వారున్నా రని చెప్పవచ్చును.

వేదశాస్త్ర విద్వత్సభలు మొదలు ఆంగ్ల కళా శాలా విద్యార్థి సమావేశము వరకు మరియు రోటరీ— లయన్సు మున్నగు సంస్థల సమావేశములు, గ్రంథా లయ వార్షికోత్సవములు, సప్తాహములు, భక్తసమాజ సభలు, వేదాంత గోష్ఠులు, సాహిత్య సభలు, ఇత్యాది పరస్పర విదూరము లయిన సందర్భములో వారి రాక ఉత్కంఠతతో నాకాంక్షింప బడుచుండును. వారున్న సభకు తేజస్సు వచ్చునను భావ మేర్పడి యున్నది. అట్లే నగరములలోను, పట్టణముల లోను, గ్రామములలోను, కుగ్రామముల లోను కూడ వీరి ప్రబోధములను సమా నాదరముతో విందురు. ఢిల్లీ, కాశీ, నాగపూరు, జెంషెడ్‌పూరు, మద్రాసు, పూరి, మున్నగు మహానగ రములలో వీరి—వాగ్ఝరి ప్రవహించినది. ఇతర భాషా ప్రాంతములలో వీరు ఇంగ్లీషులో కాని, సంస్కృతములో కాని ఉపన్యసించు చుందురు. భాష యేదైనను ప్రవాహ మొకే తీరులో నుండును. పురుషోత్తముగారి భార తీయ సంస్కృతీ సేవనము ఉపన్యాస రచనా సాధనము లకే పరిమితములు కాలేదు. ఆయన గావించిన ప్రత్యక్ష క్రియాత్మక సేవ ముఖ్యముగా పేర్కొన దగినది.

కొన్ని శతాబ్దములనుండి ఆంధ్రదేశమునుండి అదృశ్యమై పోయిన అథర్వవేదము నాయన తిరిగి తెప్పించి నారు. యావద్భారతములోనే ఇద్దరో, ముగ్గురో అథర్వ వేద విదులున్నారనియు, వారైనను వృద్ధులగుటచే త్వరలో నీ వేదము ప్రపంచము లోనే అంతరించి పోవు ప్రమాదమున్నదని గ్రహించి వీరు శ్రీ తంగిరాల బాల గంగాధర శర్మగారను యువక విద్వాంసుని ప్రేరే పించి ఆర్థికముగా కావలసిన సాహాయ్యమును చేసి యాయనను కాశీకి పంపిరి. రెండున్నర సంవత్సరము లాయన అథర్వవేదమును పూర్తిగా నధ్యయనము చేసి భగీరథుడు గంగను భూమికి తెచ్చినట్లు గంగాధర శర్మగారు అథర్వవేదము నాంధ్రదేశమునకు తెచ్చిరి. ఈ సంఘటన పురుషోత్తముగారి చరిత్రలోనే కాక ఆంధ్రదేశచరిత్రలో సువర్ణాక్షరములతో లిఖింప దగి యున్నది. శర్మగారి ద్వారా అథర్వవేదము కొంత విస్తృ తిని ఈ ప్రాంతమున పొందినది. అందులకు కూడ పురుషోత్తముగారు దోహదము చేసిరి.

మరియు ధర్మశాస్త్రాధ్యయనము దేశములో సన్నగిల్లుచున్నదని తెలిసికొని వీరు 14 సంవత్సర ములు వరుసగా 'వేసవి ధర్మపాఠశాల'లను నడపిరి. అందు సుమారు 150 మంది ధర్మశాస్త్రాధ్యయ నము చేసిరి. విద్యార్థులకు భోజనము నేర్పాటు చేయు టయే గాక ధర్మశాస్త్ర పాఠ్యగ్రంథములను ఉచితముగా వీరొసగుచుండిరి. ఇద్దరు ధర్మశాస్త్ర పండితుల నధ్యాపకులుగా నేర్పాటు చేయుచుండిరి. వీరైనన్ని దినములు తాముకూడ పాఠశాలలో నుండి విద్యార్థుల కుపన్యసించు చుండిరి. 1948 నుండి 1961 వరకు ఈ పాఠశాలలు వరుసగా ఈ క్రింది గ్రామములలో జరిగెను. ముంగండ, కాకరపర్రు, ఏలూరు, (ఇరగవరం కూడ) నెల్లూరు, మోడేకుర్రు (రెండేండ్లు) ఇరగవరం, విజయవాడ, సిద్ధాంతం, పొడగట్లపల్లి, ముక్కామల, రాజమండ్రి, బాపట్ల.

మరియు పురుషోత్తము గారు కాకినాడలో స్థిర పడినప్పటి నుండియు ఈ యెనిమిది సంవత్సరములలోను అచ్చట మూడు సంస్కృత రాత్రి పాఠశాలలను

స్థాపించిరి. అందు నూర్గురు విద్యార్థులును నల్గురు ఉపాధ్యాయులును కలరు. ఒక వేదపాఠశాలను కూడ నడుపుచున్నారు. మరియు ప్రతి స్థిర భానువారములు సాంస్కృతికోపన్యాసములను పండితులచే గావింప జేయు చున్నారు. ఇప్పటికి 300 ఉపన్యాసము లట్టివి జరిగినవి. అందు సంస్కృత సాహిత్యము, వేదాంతము, ధర్మము, ఇత్యాది విషయములపై ప్రసంగములు జరుగు చుండును. ఉపన్యసించువారు 5 నిమిషములైనను ముందుగా సంస్కృతములో మాట్లాడవలయు నను నియమము వారు చేసినారు. ఈ కార్యక్రమమునంతను వారు తాము స్థాపించిన శ్రీ వేణుగోపాల సంస్కృత ప్రచారసభద్వారా గావించుచున్నారు, దానికి వీరు శాశ్వతాధ్యక్షులు. ఇంతేకాక మరొక పాఠశాల, ఒక ఓరియంటల్ కాలేజి ఏర్పడుటకు వీరు కృషి చేసి సఫలు రైరి.

ఇట్లు బహువిషయ పరిజ్ఞాతగా, బహుభాషా కోవిదుడుగా, రచయితగా, మహావక్తగా, కవిగా, కార్య నిర్వహణా దకుడుగా భారతీయ సంస్కృతి నింతకాల ముగా ఉద్ధరించుచున్న పురుషోత్తముని కాంధ్రదేశ ములో స్థిర ప్రతిష్ఠ యేర్పడిన దనుటలో నాశ్చర్యము లేదు. వీరి ప్రతిష్ఠ యాంధ్రదేశమునకే పరిమిత మనుటయు నంత సరికాదు. 'ఆర్ష విద్యాభూషణ', 'ధర్మస్థాపక' 'ఉపన్యాస కేసరి' 'ధర్మోపన్యాస కేసరి' ఇత్యాది బిరుదములను విద్వత్సభలు వీరి కొసగినవి. ఆంధ్రప్రదేశ ప్రభుత్వము సంస్కృతాభివృద్ధికి మార్గ ములను సూచించుటకు నియమించిన బూర్గుల కృష్ణారావు కమిటీలో వీరిని సభ్యులుగా వేసినది.

ప్రయాగ విశ్వహిందూ పరిషత్సమ్మేళనానంత రము ఆంధ్రప్రదేశ్ శాఖ ఏర్పడవలసివచ్చినపుడు దానికి అధ్యక్షుడుగా నుండదగిన వ్యక్తి పురుషోత్తములేయని భావింపబడెను. ఈ యైదు సంవత్సరములనుండి వీరే యా యధ్యక్షతను వహించుచున్నారు. మరియు నిటీవల తిరుపతి—తిరుమల దేవస్థానము నెలకొల్పిన హిందూధర్మ ప్రతిష్ఠాపనమునకు కార్యనిర్వాహక వర్గ సభ్యులలో నొకరుగా వీరెన్నుకొనబడిరి.

భారతీయ సంస్కృతికి, హిందూమతమునకును, సంస్కృతభాషా ప్రచారమునకును పురుషోత్తమ మహోదయులు గావించిన అపారమగుసేవకు మహదానంద మును పొంది తెలుగువారు యావదాంధ్రదేశ పక్షమున వారికి అక్టోబరు 8, 9 తారీఖులలో కాకినాడ యందు కవిసమ్రాట్, ఆస్థానకవి, డాక్టరు విశ్వనాథ సత్యనారాయణగారి యధ్యక్షతను ఘనమగు సన్మానము గావించిరి. సన్మానము జరిగి నెలదినములైనను కాలేదు. ఇంతలోనే మృత్యుదేవత వారిని కబళించినది. పురుషోత్తముగారు 28–10–1972 వ తేదీ (శనివారం) ఉదయం 4 గంటల 10 నిమిషములకు కాకినాడయందు వారి స్వగృహమున పరమపదించిరి. వారు మృతజీవులు. వారు వెలిగించిన విజ్ఞానచైతన్య జ్యోతి దీప్తిమంతమై ఆంధ్రదేశము నందెల్లపుడును ప్రకాశించుచునే యుండును. వారి పవిత్రాత్మకు జగత్కల్యాణ మూర్తియగు సర్వేశ్వరుడు శాంతిని చేకూర్చుగాత!

తెరవెనుక దీపం

శ్రీ రాధా ప్రియ

అప్పటికి గంటనుంచి అటూ యిటూ మసలుతూన్నా రవణమ్మకు, కంటిమీదకు కునుకు రావటంలేదు. పగలంతా రెక్కలు ముక్కలు చేసికొన్న ఒళ్లు విశ్రాంతి తీసికోవటానిగ్గూడా ఆ రోజు మొరాయించింది. ఒళ్లయితే అలిసిందిగాని, తలకాయలో ఉసిళ్లపుట్టలా ఆలోచనలు రేగి, వాటి ఫలితంగా గుండెల్లో బాధా, పర్యవసానంగా కంటివెంట నీరూ, రావటంచేత, వాటన్నింటిని కొంతవరకైనా కట్టేసే నిద్దర భయపడి పారిపోయింది. తలకింద ఎత్తుకోసం పెట్టుకొన్న పాత చీరె దాదాపూ తడిసిపోయింది.

లేచి బయటకెళ్లి, ముక్కు చీదుకొని, పమిట చెంగుకు తుడుచుకొని కూర్చుంది. గదిలో గుడ్డిదీపం చావలేకా, బతకలేకా అల్లల్లాడుతూంది. ఆ రవంత వెలుగులో రవణమ్మ నీడదెయ్య మల్లే గోడమీద కదలటం ఆవిడక్కనిపిస్తూనేవుంది. గుడిశెలో ఓ మూల చిన్న ట్రంకుపెట్టె మరీ పాతది వుంది. కొడుకు పుస్తకాలు పెట్టుకోవటానికి ఆ స్కూలు హెడ్మాస్టరు భార్య యిచ్చిందది. ఓ మూల కట్టిన దండెంమీది నుంచి రవణమ్మవి రెండు పాతచీరెలూ, ఓ చింకి దుప్పటీ, సత్యానివి రెండు పాతచొక్కాలు, రెండు లాగూలు వేలాడుతున్నయి. కూడొండుకునే చోట రెండు చిన్నకుండలూ, పిడతలూ, ఒకటో రెండో సత్తు గిన్నెలూ, గ్లాసులూ వున్నయ్. గుడిశె మధ్యలో ఓ చింకి చాపమీద పాత దుప్పటీ పరచివుంది. ఎదురుగ్గా సత్యం పుస్తకాలు, పాతవి వున్నయ్.

ఇందులో యేవీ రవణమ్మకు ఆశ్చర్యం కలిగించేవికాదు గనుక, ఆవిడ వీటిని గురించి పట్టించుకోలేదు, కథకుడు పట్టించుకొన్నంతగా. ఆమె తల్లో రేగుతున్న ఆలోచనలూ, గుండెల్లో మండుతూన్న సెగలూ వేరు. ఆవిడకివ్వేళ్ల నాలుగునెల్లనాడుపోయిన ఇరవయ్యేళ్ల కూతురూ, చిన్ననాటి బావ, మొగుడూ గుర్తొస్తున్నారు.

ఆ సాయంకాలం, తను పనిచేసే ప్లీడరుగారింట్లో ఆయన పెద్దకూతురు ప్రసవించి పండంటి కొడుకును కన్నది. వారింటినుంచీ వొచ్చిందగ్గర్నుంచీ రవణమ్మకు మనసు మనసులో లేదు. రంగి కూడా యిట్లాగే పండంటి బిడ్డను కని పదికాలాలపాటు చల్లగా వుండ వలసింది. కాని దేవుడు తన నన్యాయం చేశేడు. సరిగ్గా నాలుగు నెల్లనాడు రంగికి నొప్పులొస్తున్నాయని కబురొస్తే పరుగు పరుగున వెళ్లింది. తొలి చూలు. తన యింటికి కూతుర్ని తీసికు రావటమే రివాజు. కాని ఈ దరిద్రంలో కూతుర్ని తీసికొచ్చి తనేం చేయగల్దు? వియ్యంకుడు పెద్దమనిషి. కష్టసుఖాలు తెలిసినవాడు. అతగా డన్నాడు—

'నువుమాత్రం ఒంటరిదానివి పిల్లనీ తీసికెళ్లి ఏం తిప్పలు పడతావ్? ఇక్కడ జనానికి లోపం లేదు. ఇట్లాంటివి మీ వొదిన క్కొట్టినపిండి. పది మందిని కన్నదిగా, దక్కింది నలుగురే అయినా. అందుకని నువు లేనిపోని హైరాన పడమాక. నొప్పులు వొచ్చే వేళక్కబురు చేస్తారు. వొచ్చేద్దువుగాని.'

తను మాత్రం యేవన గల్దు?

సరే, వెళ్లింది. నిండా యిరవైలేని రంగి, మరో ప్రాణాన్ని భూమ్మీదకు నెట్టే ప్రయత్నంలో విపరీతమైన బాధ పడుతోంది. మెలికలు తిరిగిపోయే దాని వొళ్లూ, చెమటలుపట్టే ముఖమూ, గొంతు చినిగి పోతుందేమో అనేంత కేకలూ, రవణమ్మకు భయం పుట్టించేయి.

కాన్పు సులు వవలేదు. చుట్టు పక్కలవాళ్లు ఆసుపత్రికి తీసికెళ్ళమన్నారు. తీసికెళ్ళేరు.

అయినా కూతురు దక్కలేదు. పిల్లాడు మాత్రం తుండు ముక్కలా వున్నాడు. ప్లీడరుగారి మనవడేం చాల్తాడు వాడిముందు? ఇంకో నిమిషానికి ప్రాణం పోతుందనగా, తనవేపుచూసి, పక్కలోవున్న పసికందును చూసి కళ్ళతో అంది—

'అమ్మా! నాకొడుకును కడుపులో పెట్టు కోవే!' అని.

తను భోరుమని యేడుస్తూ, 'నీకొడుకున్నేను కళ్ళల్లో పెటు కొని పెంచుతాను. నువు మాత్రం నన్నన్యాయంచేయకే' అంది.

రంగి అన్యాయమే చేసింది.

ఆ చంటి వెధవను కడుపులోనూ, కళ్లల్లోనూ పెట్టుకొని పెంచాల్సిన అవసరమే కలగలేదు తనకు. ఆ గుంటడికి తల్లిమీద అంత మక్కువేమిటో! తలి వెంటే ఓ గంట ఆలశ్యంగా వెళ్లిపోయేడు.

రవణమ్మకు దుఃఖం తెరవొచ్చింది వుధృతంగా. రెండు నిమిషాలు వెక్కివెక్కి యేడ్చింది. 'అసలు తన బతుకే పాపిష్టిది. లేకపోతే తనబతుకులో సుఖపడ్డ దేముంది? చిన్నప్పుడు పధ్నాలుగేళ్లు వొచ్చిందాకా కాస్త సంతోషంగా బతికింది. ఆ తరవాతమంచి అన్నీ కష్టాలే.'

బ్రతుకులో తానెరిగిన మొదటిదెబ్బ బావ పోవటం.

బావ మంచి వాడు. వాడికి తనంటే వల్లమాలిన యిష్టం. తనకు వాడంటే బయటకు చెప్పలేనంత ప్రేమ. వాడు తనకు మేనత్తకొడుకు. బావకు పదేళ్ళప్పుడు అత్తపోయింది. పోతూ వాణ్ణి నాన్న కప్పగించి, 'ఒరేయి అన్నా, బంగారంలాంటి కొడుకును నీ చేతుల్లో పెడుతున్నాను. పెంచి, కూతుర్నివ్వరా!' అంది. అయ్య అట్లాగే నని వొట్టు వేసేడు.

వ్యాఘ మాసంలో పెళ్ళి నిశ్చయం చేశారు. రమణమ్మ కప్పుడు పదిహేను. వెంకటేశ్వర్లుకు పద్దెనిమిది. పెళ్ళి నిర్ణయం జరిగేక బావముఖంలోకి చూడాలంటే రవణమ్మకు వల్లమాలిన సిగ్గు పుట్టు కొచ్చేది. వాడుమాత్రం కళ్ళనిండా వెలుగు నింపుకొని రవణమ్మకేసి పోకిరి చూపులు చూసేవాడు.

ఇంకో నెలరోజుల్లో పెళ్లనగా ఒకరోజు పొలం నుంచి వొచ్చి వొళ్లు నొప్పులుగా వుందని పడు కొన్నాడు వెంకటేశ్వర్లు. ఆరాత్రికి జ్వరం కాసింది.

అంతే, వాడు మళ్లీ తేరుకోలేదు. అదేదో విషజ్వరమట. ఇరవయ్యొక్క రోజులు మనిషి నలిశి, మరునాడు పోయేడు.

ఆవేళ రవణమ్మగుండెలు పగిలేలా యేడ్చింది. ఏమైనా చేయగలగిందే ముంది గనుక?

పుణ్యంచేసికొన్నవాళ్ళు కష్టాల్లేకండా తొంద రగా వెళ్ళిపోతారు.

తనలాంటి పాపిష్టి వాళ్ళు బతుకుతారు, వొందేళ్లు, యిన్నియాతనలూ పట్టానికి.

ఆ వైశాఖంగాక తరవాత వైశాఖంలో తనకు పెళ్లయింది వీరయ్యతో. తనూ అడ్డుచెప్పలేదు.

అతనూ మంచివాడే. నెమ్మదస్తుడు. తనను బాగానే చూసుకొనేవాడు. తనూ అతగాణ్ణెప్పుడూ కష్టపెట్టలేదు.

అయితే మనస్సునిండుగా అతన్ని ప్రేమించ లేక పోయింది. అదెట్లా కుదురుతుంది? బావనుయిష్ట పడ్డంతగా తానుమరొకర్ని యెలా యిష్టపడగలదు? బావ యెదురుగ్గావుంటే తాము యిద్దరు విడి మనుషులమని అనిపించేదే కాదు. వాడంటే తనకూ వొళ్ళూ, మనసూ అంతా ప్రేమే. తన శరీరమే కొంత వాడిదగ్గర వున్నట్లుగా వుండేది.

నిజం చెప్పమంటే తాను మొగుణ్ణలా ప్రేమించలేదు. ప్రేమించలేదు అంటే అది తన చేతుల్లో లేదు. అయితే యేం? తనకు చాతయినంత వరకూ వీరయ్యను సుఖపెట్టింది. అతన్ని కంటికి

రెప్పలా చూచుకుంటూ, ఆయన్తో ఎనిమిదేళ్ళు కాపురం చేసింది.

పొరుగూరు వెళ్ళి పాము కరచి వీరయ్య చని పోయినప్పుడు రవణమ్మకు పాతిక నిండలేదు. అప్పుడు రంగికి ఐదేళ్ళు. సత్యానికి యేడాది వెళ్ళింది.

ఆ తరవాతనుంచీ ఆవిడకష్టాలు మొదలయ్యేయి.

అప్పట్నుంచీ వారింట్లో వీరింట్లో చాకిరీచేసి పిల్లల్ని పైకి తీసుకొచ్చింది.

ఈడు రాగానే చాతయినంతలో అనువైన సంబంధం చూసి కూతురికి పెళ్ళి చేసింది. ఏం లాభం? దాని బతుకట్లా తెల్లారింది.

సత్యం బళ్ళో చదువుతున్నాడు పదో తరగతి.

ముందేవి కానుందో!

* * *

'ఇంకా పడుకోలేదా అమ్మా!' అంటూ వొచ్చేడు సత్యం చలపతి మేస్టారింటినుంచి. రవణమ్మ ఆలోచనల్నుంచి తేరుకొంది.

'లేదయ్యా! ఎందుకనో యివ్వేళ్ల నిద్దర పట్ట లేదు. చదువయ్యిందా?' అని అడిగింది.

'ఇవ్వేల్టికయింది. రేపు బడి కెళ్లేపాటికి పది లెక్కలు చెయ్యాలి. బుడ్లో కిరసనాయిలు లేనట్టుందే!' అన్నాడు.

'అయిపోవొచ్చిందిరా. పొద్దున్నే రాసుకోవొచ్చులే. బాగా పొద్దుపోయినట్టుంది, పడుకోలే! అంది రవణమ్మ.

'నీకేం, అట్టాగే చెబుతావ్. ఒక్క లెక్క చెయ్యకపోయినా ఆ మేస్టారు చావగొడతాడు.' అని గునిసి, ఆ వేళప్పుడు చేసే వోపికలేక, కిరసనాయిల్లేని బుడ్డిని కాసేపు తిట్టి నిద్రకుపడ్డాడు, సత్యం.

మరో అయిదు నిమిషాల్లో ఆదమరచి నిద్ర పోయేడు.

రవణమ్మ కొడుకుదగ్గర చేరి వొంటిమీద చెయ్యేసింది.

'ఏవిటో, వీడి బతుకెట్టా తెల్లవారాలో! భగవంతుడి దయవల్ల వీడికి నాలుగు ముక్క లబ్బుతున్నయి. ఈ పదో తరగతయ్యేక యేం చెయ్యాలో! పెద్దచదువులు చెప్పించే తాహత్తు తన కెక్కడది? జీతాల్లేక పోబట్టే ఎట్లాగో ఈ ఐదేళ్లబటి నెట్టుకొస్తూంది. పాత పుస్తకాలు ఎవరో పుణ్యాత్ములు యిస్తూనే వున్నారు. మరి దీం తరవాత?'

కోరికయితే కొడుకును బాగా చదివించుకోవాలనేవుంది. తను బతికేది వాడికోసం గాదూ? మరి ఆధరువో!

రవణమ్మ బాగా అలిసిపోయింది. చాకిరీచేసి వొళ్ళూ, బాధపడిన మనసూ రెండూ బరువెక్కినయ్. అంతవరకూ ఏడవటంవల్ల మనస్సు కడిగేసినట్లు, శాంతంగా వుంది. అట్లాగే కొడుకు సరసన నడుం వాల్చి కళ్లు మూసికొంది రవణమ్మ.

* * *

రవణమ్మ ఓ అందమైనగదిలో ఎత్తుగావున్న కుర్చీలో కూర్చుని వుంది. గది నాల్గుగోడలూ కొత్తగా వెల్లవేయించబడి తెల్లగా మెరుస్తున్నాయి. లోన వెలిగే ట్యూబులైటు కాంతి పాలకంటే తెల్లగా పరచుకొంది గదంతా. ఆవిడ కెదురుగ్గా బల్లమీద వొలచిన బత్తాయిలూ, ద్రాక్షలూ వున్నాయి. ఒక్కటొక్కటే ద్రాక్షపళ్లు నోట్లో వేసికొంటూ కూర్చొంది. తను ఖరీదైన పట్టుచీర కట్టుకొనివుంది. చేతులకు బంగారు గాజులున్నాయి. ఇంతలో గదితలుపు తీసికొని సత్యం లోనికొచ్చేడు. అతడు చాలా దర్జాగా, ఠీవిగా వున్నాడు. నల్లటి సూటూ, బూటూ నిగనిగ మెరుస్తున్నాయి. నొక్కుల జుత్తు వొత్తుగా, నల్లగా, షోగ్గావుంది. ముఖంలో రాజుకుండే దర్పముంది. చేతికి బంగారపు చైనువాచీ, రెండువేళ్ళకు రెండు వజ్రాలు తాపటంచేసిన ఉంగరాలు లైటు వెలుగులో మెరుస్తున్నాయి. మెళ్ళో డాక్టర్లు వేసికొనే రబ్బరు తాడుంది. దగ్గరగావొచ్చి జేబులోంచి నోట్లకట్ట నిర్లక్ష్యంగా తీసి తల్లి కిచ్చేడు. అన్నీపదులు పెళపెళ లాడుతున్నాయి. రవణమ్మకళ్లు మెరిసేయి.

కొడుకు వొచ్చినవాడు వొచ్చినట్లే వెళ్ళి పోయేడు.

ఎదురుగ్గావున్న బల్ల కాలితో గోకుతోంది రవణమ్మ పాదాన్ని. రవణమ్మకాలు లాక్కుంది. దాని వెంటే మెలకువా వొచ్చింది.

కళ్ళు తెరిస్తే అలవాటయిన గుడిసే, బెదురు చూపులు చూసే ఎలకా కనిపించేయి.

లేచి కూర్చుంది. సత్యం వొళ్ళుమరచి నిద్ర పోతున్నాడు. బయటకొస్తే చీకట్లు విచ్చుకొంటున్నాయి.

'ఏవి టిట్లాంటి కలొచ్చింది? తన కంతటి అదృష్టమా? ఏవిటో దిక్కుమాలిన కలలు. ఇంకా నయం. పెందరాళే మెలకువొచ్చింది. కాస్త ఆలస్యమయితే డాక్టరుగారి పెళ్ళాం నానా మాటలూ అంటుంది; అనుకొంటూ రవణమ్మపనికి బయల్దేరింది.

*　　　　*　　　　*

రవణమ్మ డాక్టరు గారింట్లోనూ, రాఘవయ్య గారింట్లోనూ పని ముగించుకొని చలపతి మేస్టారింటికి వొచ్చేవేళకు, ప్రక్కవారి రేడియోలో భక్తిరంజని వొస్తోంది. చలపతి గారి భార్య రవణమ్మను చూస్తూనే, 'కాస్త పెందరాళే రా రవణమ్మా' అని గునిసి, గిన్నెలు బయట వేయటానికి లోపలికెళ్ళింది.

చలపతి గారు ఆవూరి హైస్కూలులో సెకండరీ గ్రేడు మాస్టరు. ఆయన వూరి కొచ్చి పదిహేనేళ్ళవుతోంది. ఇక్కడే స్థిరపడిపోయేరు. ఆయనకు నలభయ్యయిదోయేట భార్యపోయింది, నలుగు రాడపిల్లల్ని ఈన కప్పగించి. ఆయన కొన్నాళ్ళు భార్యను గురించి బెంగెట్టుకున్నాడు. ఆ తరవాత నాలుగేళ్ళకు ఓ పాతికేళ్ళ అమ్మాయిని వివాహం చేసికొన్నాడు. లోకులాయన చేసిన పనిని కొంత చాటుగానూ, కొంత పబ్లిగ్గానూ గర్హించేరు. అయినా యిలాంటి విషయాల్లో ఒకరి సలహాలతో పనేవుంది గనక! చలపతి గారికి భార్య అవసరం యింకావుంది. ఆయన పెళ్ళి చేసికొన్నాడు. లోకులగోల యేవిటంటే, 'పదహారేళ్ళొచ్చి పెండ్లికెదిగిన పిల్లయింట్లో రొమ్ములమీది కుంపటిలా వుంటే, దాదాపు యాభయ్ పీటకిందికొచ్చిన యితగాడు సిగ్గులేక మళ్ళీ వివాహం చేసికోవటం యేవిటీ?' అని.

లోకు లేవనుకొనేది తెలీని, కనీసం వూహించలేని నాపేం కాదు చలపతిగారు. ద్వితీయం చేసికొన్న దాకా ఆయనకు నిద్రపట్టని మాట వాస్తవమేగాని, ఇటీవల అంటే వివాహమయిన నాలుగేళ్ల తరవాత, ఆయనకూ తాను చేసినపని దోషమేమో ననిపిస్తోంది. ఎందుకంటే యింక ఆయనకు రెండేళ్లు మాత్రమే సర్వీసుంది. ఈ సంబంధాని కిద్దరు పిల్లలు. ఒక అబ్బాయీ, అమ్మాయీను. తొలి సంబంధం పిల్లల్లో పెద్దవాళ్లిద్దరూ యీడేరి కూర్చున్నారు. వాళ్లను చెరో యింటికి పంపి బాధ్యత వొదిలించుకోవాలిగదా! మిగతా వాళ్లను పెద్దవాళ్లను చెయ్యాలిగదా! ఇప్పుడివన్నీ ఆలోచించుకొంటే ఆయనకీ సాగరాన్నెలా యీదటమా? అని భయంగానే వుంది. లోకులు కబుర్లయితే చెబుతారుగాని, బాధ్యతలు నెత్తినేసికోరు గదా!

మరి తెలిసి, తెలిసీ ఈ వయస్సులో ఈ తప్పుడు పని యెందుకుచేసేవంటే, ఆయన సమాధానం ఆయనకుంది. 'ఎన్నిమాటలు చెప్పినా, నేపోయిం తరవాత, నెత్తిన కొరివిపెట్టి, యిన్నినీళ్లు చల్లేవాడొకడుండాలి గదా! కొడుకు పుట్టకపోతే అదేం బ్రతుకు?' అంటారాయన.

ఆయన ఆశించినట్లు కొడుకయితే కలిగేడు గాని, ఆయనకు బాధ లెక్కువే అయ్యేయి. భార్యకు తానంటే గౌరవం లేదన్న విషయం, ఆయన కొత్త మోజులో గమనించటానికి యిష్టపడకపోయినా రోజులు గడిచే కొద్దీ ఆయనకు విషయం స్పష్టంగానే తెలిసింది. తాము లేనివాళ్లైన కారణంచేత, తమ నిస్సహాయత్వాన్ని నీచంగా వుపయోగించుకొని, తన వయస్సులో సగం మాత్రమేవున్న ఆడదాని గొంతు కోయటానికి సిద్ధపడ్డ చలపతిగారి సహృదయత మీాద కామాక్షికి రవంతకూడా సదభిప్రాయం లేదు. కనీసం ఆయన బాధేవిటోనని ఆవిడ సానుభూతితో ఆలోచించిం

లేదు. తాను చేయని తప్పుకు భగవంతుడు ఈ రకంగా శిక్షించేడనుకొని, ఆ శిక్షను తప్పనిసరిగా అనుభవిస్తూ, అందులో కనిపించే కారకుడైన చలపతిగారి పట్ల కామాక్షి అయిష్టాన్నే పెంచుకొంది. ఇవన్నీ గ్రహించే నాటికి చలపతిగారికి దిద్దుకోవటాని కేమీ కనిపించలేదు. ఇప్పుడు బాధపడి ప్రయోజనం యేవుంది గనుక? ఒక పని, మంచికానీ, చెడుగానీ జరగవలసి నప్పుడు, అది అల్లా జరిగే తీరుతుంది. నువు చెయ్యడ్డంపెట్టి ఆ పనిని కాకండా ఆపలేవు. పశ్చాత్తాపం అనవసరమూ, అవివేకమూను. సృష్టిలోని శక్తులన్నీ నీవు తాగబోయే పాలను వొలకపొయ్యాలని కూర్చుంటే, అయ్యో! పాలు వొలికి పొయ్యేయే అని బాధపట్టం వెర్రితనం కాదూ! చెయ్యగలిగిం దేమీ లేనప్పుడు, కాలాన్ని దాని మానాన దాన్ని పోనివ్వటమే! చలపతిగారిటీవల యీ రకమైన వేదాంతం వొంట బట్టిచ్చుకొని రోజులు గడుపుతున్నారు.

రవణమ్మ పని ముగించుకొని వొచ్చేవేళకు, సత్యం మేస్టారింటికి చదువుకుందుకు వొచ్చేడు. వాణ్ణి చూడగానే రవణమ్మకు తెల్లవారుజామున వొచ్చిన కల గుర్తొచ్చింది. 'నిజంగానే సత్యం అంత గొప్పవాడవుతాడా? అట్లా నోట్లకట్టలు తీసికొచ్చి తన కిస్తాడా? ఏ వీలేదు. బీదవాళ్ళంటే కలలకూ లోకువే!' సత్యం బుజంమీది, రూపాయి కాసంత చినుగును చూస్తూ రవణమ్మ అనుకొంది.

'ఈ యేడు పరీచ్చ గట్టెక్కుతాడా అయ్యగారూ!' అని అడిగింది చలపతిగార్ని, తడిచేతులు చిరుగుల పమిటకు తుడుచుకొంటూ.

సత్యం తెలివైన కుర్రవాడి కిందే లెక్క. వాడికి చదువుపట్ల శ్రద్ధ కూడా వుంది. పైగా వాళ్ళ పరిస్థితులు వాడికి బాగానే తెలుసు. అందుకని కష్టపడి చదువుతాడు. ఆ విషయం అందరకూ తెలుసు. అయినా ఎదురుగ్గా విద్యార్థినుంచు కొని, వాణ్ణి పొగట్టం మంచనిపించలేదు పంతులుగారికి. పైగా ఈప్రశ్న వారానికో మారైనా రవణమ్మ అడుగుతూనే వుంటుంది ఆయన్ను. ఆయన్ననేవిటి? ఏ మేస్టరు కనపడ్డా ఆమె అడిగేప్రశ్న అదే. ఆమె తాపత్రయం తెలిసిన మేస్టారన్నారు, అవుతాళ్లే. అయినా శ్రద్ధతీసుకొని కష్టపడి చదివాలి. గవర్నమెంటు పరీక్షలుకదా!

రవణమ్మ వెంటనే అందుకొంది, 'నాదేవీ లేదయ్యా గారూ. వాణ్ణి మీారు కొట్టినా, తిట్టినా నాకిష్టమే వాణ్ణి మీాచేతుల్లో పెట్టేను. మీా ధర్మమా అని నాలుగు ముక్కలబ్బితే అంతే చాలును!'

'అల్లాగేలే!' అన్నారు చలపతిగారు సంభాషణ త్రుంచుతూ.

* * *

వారం రోజుల తరవాత వో సాయంకాలం రవణమ్మ మేస్టారింటికి బయల్దేరింది. ఆవిడ తలలో యిప్పుడు ఒకేవొక్క ఆలోచన విపరీతంగా కదులుతోంది. ఆక్రితం రోజు సాయంత్రం వాళ్ల యిళ్ల పక్కల వాళ్లు యేదో పిచ్చాపాటి మాట్లాడుకొంటూండగా, సంభాషణ లాటరీలమీాదకు మళ్లింది.

తాగుబోతు గంగడన్నాడు, 'అదేదో వూర్లో వొటేల్లో పన్జేసే కాఫీ లిచ్చే ఆయన రూపాయి గడితే లక్షొచ్చేయట. ఇక చూడు నారంగా, ఆ వోటలు పొప్పరయిటరు, యీాడికాళ్ళు గడిగి నీళ్ళు నెత్తిన్జల్లుకొని కూతుర్నిచ్చి పెళ్ళిచేసి, వోటలువాడికే వొప్పచెప్పేట్ట!'

'ఆడి దాకాబోతావేం? వాడిపేరు నాకు గుర్తురావటంలేదు. బస్తీ పోయినప్పుడోసారి నేను ఆడి రిచ్చా కూడా యెక్కేను. వాడికదేదో లాటరీలో రెండు లచ్చలొచ్చేయట. నీకెట్టా తెలుసని అడగవేం? మొన్న ఊరెళితే, ముందేదో యెనకేదో తెలీని కారుపక్కన నుంచోని కోటూబూటూయేసి, దొరల్లాగే జానెడు పొడుగుచుట్ట నోట్లోపెట్టుకు నిలుచుంటే ముందు బిత్తరపోయే నంటే నమ్మ. ఇదేందబ్బా! పోయి నేడాది నన్నెక్కించుకొని రిచ్చాతొక్కి సందు మలుపులో వున్న యింటికాడికి రోడ్డంతా చుట్టాదిప్పి, నాలుగంగల్లో వెళ్లేచోటికి అర్ధరూపాయి పుచ్చుకొన్నాడు. గందా అని ఆచ్చెర్య పోయేను. ఏమైనా యీావంటావు? ఆ డిప్పుడు లచ్చాధికారి! గంగడి బావమరది అందుకొన్నాడు.

'అందరి కొస్తాదంటరా? అదురుష్టముండాల. దానికీ పెట్టిపుట్టాల'. అన్నాడు వెంకడి తండ్రి ముసలయ్య.

'అదురుట్టం వుందోలేదో తెలిసే దెట్టాగే? నువు గట్ట రాదు మామా! నీది మంచి జాతకమేలే. పిల్ల నిచ్చిన మావను మూణ్ణిద్దర్లలోనే గుటుక్కు మని పిస్తివిగా!' గంగడు ముసలయ్యకు పరిహాసం చేసేడు.

'చీ! యదవనాయాల. తాగుబోతూ కబుర్లూ నువ్వూనూ. విసుక్కొన్నాడు ముసలయ్య

ఓ మూల కూర్చొని యిదంతా వింటూన్న రవణమ్మను చూస్తూ గంగడి బావమరది అన్నాడు.

'నువ్వొక టికెట్టు కొనరాదే అత్తా. దేవుడు చల్లంగ జూస్తే సత్తేన్ని కలకటేరును జేద్దువుగాని!'

రవణమ్మ నవ్వుతూ అంది, 'ఇకజాల్లేరా పోకిరి యెదవ. నా కంతటి రాతెక్కడిది'?

ఆ తరవాత రవణమ్మ అక్కణ్ణుంచి లేచొచ్చింది. కాని మనసు మాత్రం లాటరీ టిక్కెట్టును గురించే ఆలోచించటం మొదలుపెట్టింది.

'ఏమో, ఏ పుట్టలో ఏముందో ఎవరు చూశేరు? రోజులు బాగుండి అట్టాంటి అదురుష్టమే కలిగితే సత్తేనికి పెద్ద చదువులు చెప్పించొచ్చు. రంగనాదంగారి కొడుకులాగే పెద్దడాకటరును చేయొచ్చు. అప్పుడు తన బతుకు మూడు పువ్వులూ ఆరు కాయలూ అవుతుంది.'

రవణమ్మ కెందుకో వారం రోజులనాడు తెల్లవారు జామున వొచ్చిన కల నిజం అవుతుందని అనిపించ సాగింది. ఆ కల్లోలాగే తాను గొప్పయింట్లో కూర్చొని కొడుకు అంత ఠీవిగా సూటూ బూటూ వేసికొని నోట్లకట్టలు తెచ్చి తన చేతుల్లో వుంచటం యెంత గొప్పగా వుంటుంది! సాటివాళ్లలో ఎంతపేరు! లోకులంతా సత్యాన్ని చూపి, 'ఆ వెళ్లే ఆయన రవణమ్మగారి కొడుకు. పెద్దడాక్టరు. రెండు చేతులా సంపాదిస్తున్నాడు. తల్లిని నెత్తిన పెట్టుకొంటాడు. కులం, గోత్రాలతో పనిలేదు. బోలెడంత కట్న మిస్తామని సంబంధాలు తెగవొస్తున్నాయి' అని అంటూంటే తన కెంత ఆనందంగా వుంటుంది?'

ఈ వూహలతో రవణమ్మ కా రాత్రి కంటి మీద కునుకు పట్టలేదు. కన్ను మూసినా, తెరచినా సత్యం సూటూ బూటూ వేసికొని కనబడసాగేడు. తెల్లవారే పాటికి రవణమ్మ ఒక నిర్ణయాని కొచ్చింది. 'ఏమైనా కానివ్! ఓ రూపాయి ఖర్చుపెట్టి టిక్కెట్టొకటి కొంటుంది. వొస్తే అదురుష్టమే. పోతే రూపాయి గంగలో కలిపాననుకొని ఒకేదు పేడిచి వూరుకొంటుంది.'

ఆ నిర్ణయం తీసికొన్నాక రవణమ్మ క్కాస్త ప్రశాంతత చిక్కింది. సాయంకాలం పనవగానే రవణమ్మ యిందుకే చలపతిగారింటికి బయల్దేరింది. ఆమెకు చలపతిగారంటే నమ్మకం. సత్యం చిన్నప్పటి నుంచీ ఆయన్దగ్గిరే చదివేడు. ఆయన పుణ్యమా అని నాలుగు ముక్కలు వొంటబట్టేయి. పైగా యిట్లాంటివి తన కప్పలు తెలీదు. ఏ టిక్కట్టు కొనాలో, ఏది సజావయిందో తనకేం తెలుసు? ఏదో కాయితం చేతిలోపెట్టి తనను ముంచినా ముంచగలరు. సత్తేనికి చెప్పొచ్చును గాని వాడికి మాత్రం యేం తెలుసు యిట్లాంటి పనులు? చిన్నయెదవ. తనయినా పిల్లాడి బాగుకోసమని ఒక ప్రయత్నం చెయ్యబోతూవుంది. ఇదే మొదటిదీ, చివరదీను. ఈ పని గుట్టుగా చేయించాలంటే పంతులుగారికే తగును. ఆయనకు తను పడే పాట్లూ, సత్యం కోసం తను పడుతూన్న యిబ్బందులూ తెలుసును.

రవణమ్మ వెళ్లేసరికి చలపతి గారు పంచలో కొడుకుతో ఆడుకొంటున్నారు. భార్యా, పిల్లలూ కరణం గారింటికి పేరంటం వెళ్లేరు, కూతురు రజస్వల అయితే.

'ఏవిటొచ్చేవు? ఆమె యింట్లో లేదు.' అన్నారు మేస్టారు.

'మీతో పనుండే వొచ్చేనయ్యా!' అంది.

ఏవిటన్నట్లు చూశేరాయన.

కొంగున కటు కొన్న రూపాయి కాయితం ఆయన ముందుంచి అంది, 'ఒక లాటరీ టిక్కెట్టు కొనండయ్యా!'

ఓ అరనిమిషం అర్థం కానట్లు చూసి, తరువాత వెంటనే నవ్వి అన్నారు చలపతిగారు—

'నీకూ వుంది ఈ పిచ్చి?'

రవణమ్మ ఏదో తప్పు చేసినట్లు జంకింది; 'ఈ వొక్కసారే చూద్దామనుకొన్నా, నయ్యా! రోజులు బాగుంటే సత్యం పైకొస్తాడు. లేకపోతే ఈ రూపాయి తోనే చెల్లు!'

'అటూ గేలే'! అన్నారు మేష్టారు. పిల్లవాడి చేతిలోంచి మెల్లిగా రూపాయి విడిపించు కుంటూ.

'ఎవరితోనూ అనకండయ్యా!' అంది వెళ్ళబోతూ.

'ఓసీ నీ యిల్లు బంగారంగాను. ఇదేం పాపం కాదులే!' అన్నారాయన నవ్వుతూ.

'అయినా వొద్దులేయ్యా!' అంది రవణమ్మ.

'సరేలే! నాలుగు రోజుల్లో వూరెళతాను. తీసి కొస్తాలే!' అన్నారు మాస్టారు.

సగం బరువు తీరినట్లు వెళ్ళిపోయింది రవణమ్మ.

*　　　*　　　*

నెల రోజుల తరవాత ఓ సాయంత్రం చలపతిగారు టీచర్స్ రూంలో కూర్చొని పేపరులో లాటరీ ఫలితాలు ప్రకటించబడ్డ పేజీని చూస్తున్నారు. గదిలో మరెవ్వరూ ఉపాధ్యాయుల్లేరు. చాలా మంది క్లాసులకూ, ఒకరూ, అరా బయటకూ వెళ్ళిన సమయం అది. రెండు నిమిషాల తరవాత ఆయన ముఖంలో హఠాత్తుగా మార్పు వొచ్చింది. కళ్ళు ఒక రకమైన ఆశ్చర్యంతో వెలిగేయి. జేబులోంచి టిక్కెట్టు కాయితం తీసి చూశేరు. ఓ నిమిషంపాటు అలాగే పేపరువైపూ, టిక్కెట్టువేపూ చూశేరు. ఆ తరవాత వెంటనే లేచి బయటకెళ్ళేరు.

ఆ తరవాత ఆయన క్లాసుల్లో చాలా పరధ్యానంగా వున్నారు. ఇండియాకు ప్రెసిడెంటు ఇందిరా గాంధి అని చెప్పిన అబ్బాయిని ఆయన కోప్పడలేదు. మేష్టారి యేమరుపాటు చూచిన పిల్లలు సుభ్భరంగా చుక్కలాట ప్రారంభించేరు. అయినా చలపతి గారి కాపూట క్లాసు పట్టలేదు.

ఆ రాత్రి ఆయనకు నిద్దర పట్టలేదు. భార్యతో గానీ పిల్లల్తోగానీ ఎక్కువ మాట్లాళ్ళేదు. తనలో తానే ఆలోచించు కొంటూ, నొసలు చిట్లిస్తూ, 'ప్చ్! తప్పు!' అనుకొంటూ, మధ్యమధ్య 'సింగినాదం' అంటూ గడిపేరు.

ఎప్పుడో తెల్లవారు జాముకు పట్టిన కునుకులో కూడా కలలు. ఓ కలలో తానూ, కామాక్షీ పటు బట్టలు కట్టుకొని, పీటలమీద కూర్చుని పెద్ద కూతురి పెళ్ళి చేస్తున్నాడు. కామాక్షి మెడనిండా నగలు. పెద్దకూతురు పద్మావతి కళ్ళనిండా వెలుగు. అల్లుడు సినీమాల్లో కథానాయకుడల్లే వున్నాడు. చలపతిగారి కెదురుగ్గావున్న ఇనప్పెట్టెలో నోట్ల కట్టలు నవ్వుతున్నాయి. మరో నిమిషంలో దృశ్యం మారిపోయింది. ఓ నల్లటి దున్నపోతు నెక్కి, చిన్నప్పుడు ఆయనకు చదువు చెప్పిన ఎలిమెంటరీ స్కూలు హెడ్మాస్టరుగారు, చేత్తో బెత్తం పుచ్చుకొని, 'వెధవ కానా, రంగడి బెల్లమ్ముక్క నువు తీసికొంటావ్రా? వెయ్ గోడ కుర్చీ' అంటున్నారు.

రాత్రంతా అట్లా కలత నిద్దరతో గడిచి పోయింది. నిద్రలేచేప్పటికి ఆయన వాలకంచూసి భార్యకూడా ఆశ్చర్యపోయింది.

'ఏవిటండీ, ముఖం అల్లా పీక్కుపోయింది? రాత్రంతా కలవరిస్తూనే వున్నారేమిటి?' అంది.

'ఆయన బలవంతాన నవ్వి' నీ ముఖం కాదూ! నేను కలవరించటం యేవిటి?' అన్నారు.

ముఖం కడుక్కొని కాఫీతాగి బయటకు రాగానే పంచలో రవణమ్మ కనిపించింది. కడుపులో తిప్పి నటయి, కళ్ళు తిరిగేయి మాస్టారికి.

'ఏవిటే లాటరీ టిక్కెట్టుకోసమా? మొన్న పనుల తొందరలో మర్చిపోయానమ్మా! ఈ సాయంకాలం వెళుతున్నాను. తెస్తాలే!' అన్నారు త్వర త్వరగా.

రవణమ్మ వెంటనే అంది, 'దాని సంగతి కాదండీ! ఎప్పుడు కొంటేనేం! బాగుపడే గీతవుంటే వొస్తుంది, లేకపోతే లేదు. నే నొచ్చిందందుక్కాదు. రాత్రినుంచీ అబ్బాయికి జరం. రంగనాదంగారికి చూపిస్తే రెండు మాత్తర్లు రాసిచ్చేరు. రెండు రూపాయలుంటే యిప్పిస్తారా, ఒకటి కిస్తాను!'

చలపతిగారు మల్లగుల్లాలు పడిపోయేరు. గొంతులో కొట్టుకొంటూన్న దేదో బయటకు రాబోయింది. అయినా ఆయన నిబ్బరం గలవాడు. చిన్నపిల్లవాడు కఫాన్ని మింగినట్లుగా, గొంతులోవున్న దాన్ని అక్కడి కక్కడేమింగి, కంగారుగా అన్నారు—

'నీమనిషి దొంగలు దోల! వాడికి రాత్రినుంచీ జ్వరం కాస్తే నాకు చెప్ప లేదేం? చిన్నవెధవ ఆచీటీ యిటివ్వు. నేను బజారువేపు వెళుతున్నాను. మాత్రలు తెచ్చిపెడతాను!'

మాస్టారి మంచితనానికి వెంటనే ఏం చెప్పాలో తోచని రవణమ్మ చీటీ ఆయన కిచ్చి వెళుతూ అంది; తమరట్లాగున్నా రేందయ్యా? ఒంట్లో బావోలేదా? అని.

'ఏం లేదమ్మా! రాత్రి తలనొప్పితో సరిగ్గా నిద్రపట్టలేదు' అన్నారు.

రవణమ్మ వెళ్లిపోయింది.

తాను బడికి వెళ్లేపాటికి చలపతి గారు సత్యానికి మాత్రలూ, రొట్టె, నాలుగు బత్తాయిలూ తెచ్చి పంపిచేరు. వంటగదిలో భార్య గునుస్తున్నా ఆయన లెక్కపెట్టలేదు.

* * *

ఆరోజు చలపతిగారింట్లో కోలాహలంగా వుంది. బెజవాడనుంచి ఆయన తమ్ముడూ పిల్లలూ, ఏలూరునుంచి కామాక్షి అక్కా, బావా, వాళ్లపిల్లలూ వొచ్చేరు. ఊర్లోని సాటివారందరూ, చలపతిగారింటి పంచలో చాపల మీద కూర్చొని వున్నారు. హాల్లో సత్యనారాయణ స్వామి పటంముందు కూర్చుని, పురోహితుని సాయంతో వ్రతం చేస్తున్నారు, చలపతి దంపతులు. భక్తి పారవశ్యంవల్లనో, వంటింట్లోనుంచి వొచ్చే పొగలవల్లనో ఇరువురి కళ్ల వెంటా నీళ్ళొస్తున్నాయి.

పంచలోకూర్చున్న చిన్నా పెద్దా అంతా లోకాభిరామాయణం మాట్లాడుకొంటున్నారు. మధ్య మధ్య వీలుచూసికొని లాటరీలో లక్షరూపాయలొచ్చిన చలపతి గారి అదృష్టాన్ని పొగుడుతున్నారు. ఆ అదృష్టం కొందరు చలపతిగారిదనీ, మరికొందరు కామాక్షిదనీ అంటున్నారు. ఆయన పెద్దకూతురంటే వల్లమాలిన అభిమానం గల పక్కవారబ్బాయి, 'పద్మావతి అదృష్టం వల్లనే చలపతిగారికి లాటరీ తగిలింది' అన్నాడు ప్రక్కన స్నేహితుడితో. ఎవరో తుంటరి వినీ వినపడకండా 'మొదటిభార్య పోయిన వేళా విశేషం. ఇవ్వేళ దాని ప్రభావం చూపింది' అన్నాడు కూడాను.

వ్రతం అయింది. చలపతిగారు అందరకూ తీర్థప్రసాదాలు పంచేరు. ఆయన ప్రతి వొక్కరితోనూ అతి విధేయతగా ప్రవర్తించేరు. కొంతమంది మరీ తెలివైన వాళ్లు ఆయనకు వినబడేంత చిన్నగా, 'చూశేరా, ఆయన పెద్దమనిషి తరహా! డబ్బొచ్చినా మనిషికి ఎంత వినయమో!' అన్నప్పుడు చలపతిగారు తాత్కాలికంగా కొంత సంతోషపడ్డారు. చలపతిగారి దగ్గర చదువు కొని ఆ స్కూల్లోనే తెలుగు మాస్టారిగా పన్చేస్తున్న సత్యనారాయణ అనే చాకులాంటి కుర్రాడు ఈ తంతంతా చూసి ప్రక్కనే వున్న మిత్రుడితో అన్నాడు—

'బోడిలక్ష రూపాయలు, అందునా లాటరీలో వొస్తే, ఈ మనుషు లింత నాటకా లాడుతున్నారే! మరో లక్ష యిస్తామంటే వీళ్లంతా బట్ట లిప్పుకొని ఎగురుతారు గామాల! డబ్బు ఎంత పన్చేయిస్తుంది? ఈన విధేయతకూ, వీళ్లందరి నటనకూ కారణం డబ్బే గదా!' అని.

ఆపైని భోజనాలు. అంతా సుష్టుగా తిని యితోధికంగా త్రేన్చేరు, పొద్దుపోవటంచేతనో, అజీర్తి వల్లనో, మనసు బాగా లేకనో, చలపతిగారు మాత్రం తృప్తిగా తినలేకపోయేరు. నాలుగు మెతుకులు నంజి లేచేరు.

అంతా వెళ్లిం తరవాత, రవణమ్మా, సత్యం వొచ్చేరు భోజనానికి. లక్ష రూపాయ లొచ్చేక మాస్టారిని పలకరించటానికే భయంగా వుంది సత్యానికి,

రవణమ్మకు మాత్రం ఈ విషయం చాలా ఆనందాన్నే కలిగించింది.

'పోనీలే పిల్లలు గలాయన! దేవుడు కనిపెట్టి నాడు' అనుకొంది.

రవణమ్మ, సత్యం భోజనం చేస్తుండగా, చలపతిగారు వంచలో కొచ్చి అన్నారు, 'సిగ్గుపడకండా తినరా సత్యం. ఇంక రెండు పూర్ణపుండలు వేయించుకో! నీ లాటరీ టిక్కట్టు సంగతి రెండు రోజుల్లో తెలుస్తుంది రవణమ్మా!' అని.

'నా బొంద! అందరికీ వొస్తాయా అయ్యా? పెట్టి పుట్టాలి. ఏమైనా ఇది మా అమ్మగారి అదురుష్టమే నయ్యా!' అంది రవణమ్మ.

చలపతి గారు లోపలి కెళ్లగానే సత్యం అడిగేడు తల్లిని, 'నువ్వా లాటరీ టిక్కట్టు కొన్నావా అమ్మా'? అని.

రవణమ్మ సిగ్గుపడుతూ అంది, 'అప్పుడెప్పుడో అయ్యగారి చేతికి రూపాయిచ్చి కొనమన్నాను.'

లోపలి కెళ్లిన చలపతిగారు టిక్కట్టు తెచ్చి సత్యానికి యిచ్చి అన్నారు, 'నీ దగ్గరుంచరా సత్యం, పేపర్లో పడ్డప్పుడు చూద్దువుగాని.'

'వాడిదగ్గ రెందుకులెండి? ఎక్కడన్నా పారేస్తాడు, మీ దగ్గరే వుంచండి.' అంది రవణమ్మ.

'అట్లా కాదులే! వాడి దగ్గరే వుండనివ్. డబ్బు చెడ్డది. మనుషులను గడ్డి తినిపిస్తుంది.' అన్నా రాయన.

డబ్బు గడ్డి తినిపిస్తుందన్న సంగతి రవణమ్మకు తెలుసునుగాని, ఈ సందర్భంలో దాన్ని ఎలా అన్వయించుకోవాలో ఆమెకు తెలీలేదు.

భోజనం చేసి వెళ్లిపోయేరు తల్లీ కొడుకులూ.

* * *

చలపతిగారన్నట్టు, మూడు రోజుల తరవాత, రవణమ్మకు తెచ్చిన లాటరీ టిక్కట్టు ఫలితాలు తెలిశాయి. సత్యం పక్కాపావుగంట వెతికినా నంబరు కనిపించలేదు. సత్యానికి బోలెడు విచారం పట్టుకొంది గాని,

రవణమ్మ దాన్నంతా బాధపడవలసిన విషయంగా తీసి కోలేదు.

'ఒంటినిండా ఆముదం రాసుకొని పుట్టేడు గింజలో పొర్లినా అంటేంత వరకు అంటు తాయి గాని, పుట్టేడు రావు గదా! ప్రాప్తం లేకపోతే ఏదీరాదు. పోనివ్! రూపాయి తోటే చెల్లు!' అనుకొంది.

రోజులు గడుస్తున్నాయి. చలపతిగారు చెరువు కింద నాలుగెకరాలు మాగిలి కొన్నారు. ఇల్లొకటి చిన్నది కొన్నారు. పద్మావతికి పొరుగింటబ్బాయితో సంబంధం కుదిర్చేరు, వాళ్లబాబడిగిన కట్నం యిచ్చేందు కొప్పుకొని. ఈ డబ్బొచ్చిం దగ్గర్నుంచి చలపతిగారికి లోకుల్లో గౌరవం పెరిగింది. హెడ్మాస్టరు గూడా వెనుకటిలాగే, 'మూడో గంటకొట్టినా క్లాసుకెళ్లటం లేదేమయ్యా చలపతీ!' అనటం లేదు. 'చలపతి గారూ!' అంటున్నారు. ఇలా హఠాత్తుగా సిరెత్తుకొన్నందువల్ల కామాక్షికి భర్త మీద ప్రేమయితే కలగలేదు గాని, తనవరకు తృప్తిగానే వుంది. డబ్బుతెచ్చిన మరునాడే ఆయనతో శతపోరి, తనపేరిట ఓ పదివేలు బాంకిలో పడేయించింది కూడాను.

ఎటొచ్చీ డబ్బుతెచ్చిన సుఖమూ, తృప్తీ కన పడనిది ఒక్క చలపతి గారిలోనే. ఆయన వేషంలో మార్పేమీ రాలేదు. ఎప్పట్లాగే నీరుకావి ధోవతీ, అరచేతుల చొక్కా తొడుక్కుని తిరుగుతున్నారు. చెప్పులుమాత్రం, ఓ పదిపారేసి కొత్తవి కొన్నారు. బట్టలమాట అలావుంచి, మనిషిలో కూడా హుషారు, ఆనందం యేమీ కనపట్టం లేదు. అదేం ఖర్మో రోజు రోజుకూ ఆయన తీసిపోతున్నట్లు కనిపిస్తున్నారు పరి చయస్తులకు. ఈ డబ్బు లొచ్చిం తరవాత రవణమ్మకు ఆయన ఓ చీరకొని పెట్టేరు. సత్యానికో జత బట్టలు కుట్టించేరు. పరీక్షలు దగ్గరపట్టంచేత వాడికి చాలా శ్రద్ధగా చదువు చెబుతున్నా రాయన.

ఇటీవల కాలంలో చలపతిగారు తమపట్ల చూపేదయకూ, సానుభూతికీ రవణమ్మ ఆయనకు మనస్సులోనే నమస్కారాలు చెప్పుకొంటోంది. 'పుణ్యా త్ముడు! డబ్బులెంతమందికి రావటం లేదు. దిక్కు లేనివాళ్ళ నెంతమంది కనిపెట్టి వుంటున్నారు? ఆయన కడుపు చల్లగాను. పిల్లవాడికి శానాకష్టపడి చదువు చెబుతున్నాడు' అనుకొంటూ, ఆయను చల్లగా చూడమని తిరుపతి వెంకన్నకు మొక్కుకొంది

* * *

సత్యం పరీక్షల మధ్యలోవుండగా రవణమ్మ మంచ మెక్కింది. మామూలుగా మొదలయిన జ్వరం, వదలకండా కాసి, రవణమ్మ బాగా డీలా అయి పోయింది. అట్లాగే చలపతిగారింట్లో తింటూ, పరీ క్షలు జాగ్రత్తగానే రాస్తున్నాడు సత్యం. అయినా, ఏ పని చేస్తున్నా వాడికి తల్లి అనారోగ్యమే మనసులో కదులుతూ, బాధపడుతున్నాడు. చివరి పరీక్షకూడా తృప్తిగా రాసిన రోజున వాడూ, అంతకంటే ఎక్కు వగా ఆ నీరసంలోనే రవణమ్మా సంతోషపడ్డారు.

ఆ రాత్రే రవణమ్మకు జ్వరం విపరీతమయి, సంధి లక్షణాలు కనిపించేయి. చలపతిగారు దగ్గరుండి డాక్టర్ను తీసికొచ్చేరు. డాక్టరు చలపతిగారి నిదివర కెరక్కపోయినా ఆయనకు పట్టిన జాతకం చూశేడు గనక పిలవగానే వొచ్చి రవణమ్మకు చాతయినంత వైద్యం చేశేడు.

మరోవారం గడచింది. రవణమ్మ రోగం డాక్టరుకు లొంగలేదు. ఆయన పెదవి విరిచేడు. సత్యానికి లోకమంతా భయంకరంగా కనపడసాగింది. వాడు కళ్ళనీళ్లు కుక్కుకుంటూ యేడుపు సాగించేడు. రవణమ్మకు మాట రావటంలేదు. కళ్ళు గాజుబుడ్లకు మల్లే మెరుస్తున్నాయి. ఆ కళ్ళవెంట ధారాపాతంగా నీళ్ళు.

'పోనీ బెజవాడ తీసికెళదామా!' అన్నారు మాస్టారు.

కేవలం ఉదారబుద్ధితో, పనిమనిషికోసం చల పతిగారు చూపుతూన్న ఔదార్యం డాక్టరుగారిని కదిల్చింది. ఆ క్షణాన, ఆయన ఇకనుంచీ బీదలకు ఉచితంగా వైద్యం చేయాలన్న నిర్ణయాన్ని తాత్కా లికంగా తీసుకొన్నారు కూడాను. చలపతి గారి వంక చూస్తూ అన్నారాయన, 'ప్రయోజనం లేదండీ మీరు తీసికెళ్ళాలనే అనుకొంటే నా కభ్యంతరం లేదు.'

చలపతిగారు మాట్లాడకండా నిలుచుండి పోయేరు. ఐదునిమిషాలలా గడచిపోయేయి.

లాంతరు వెలుగులో, రవణమ్మ చలపతిగారిని

దగ్గరకు రమ్మని సైగచేసి, కొడుకుచేతిని ఆయన చేతిలోవుంచి, కళ్ళు నీళ్ళెట్టుకొంది.

చలపతిగారికి గుండెల్లో సన్నని మంటరేగి అంతలోనే రాజి పెద్దదై, శరీరమంతా వ్యాపిస్తున్న ట్లనిపించింది. బాధతో కళ్ళవెంట నీళ్ళొచ్చేయి. కొడుకు కోసం ఆ తల్లి పడేబాధ ఆయనకు భరించలేని విచారం కలిగించింది. ఆయనకేదో పూనకం వొచ్చి నట్లయి అన్నాడు.

'నువు పిల్లవాణ్ణి గురించి యేవిధమైన విచారమూ పెట్టుకోకు. వాడికి వోపిక వున్నంత వరకు చదువు చెప్పించి పైకి తీసికొచ్చే పూచీనాది. నీకింకా నామాటమీద నమ్మకం లేకపోతే భగవంతుడిమీద వొట్టేసి, వీళ్ళందరియెదటా చెబుతున్నాను. రేపే వాడిపేర ఓ అయిదువేలు బాంకిలోవేసి వాడిచదువు ఖర్చుపెడతాను, సరేనా?'

రవణమ్మ బిత్తరపోయినట్లుగా చూసింది. ఆవిడకు మాస్టారి మాటలు తెలిశేయో, లేదో మరి. సత్యానికి నోట మాట రాలేదు. అంతటి విచారంలోనూ వాడికి మాస్టారి మాటలు బోలెడంత ఆనందాన్నీ, తృప్తినీ కలిగించేయి. చుట్టూచేరిన ఇరుగు పొరుగూ, డాక్టరూ కూడా ఆశ్చర్యంగా చలపతిగారివంక చూశేరు.

ఆయన వీళ్ళ చూపులను గమనింపకుండా, రవణమ్మకేసే చూస్తున్నారు.

రవణమ్మ లేని వోపికను తెచ్చుకొని రెండు చేతులెత్తి దణ్ణంపెట్టింది చలపతిగారికి.

ఆ మరునాడు మధ్యాహ్నం రవణమ్మ పోయింది. చలపతిగారు దగ్గరుండి అన్నీ జరిపేరు. దిక్కులేకండా యేడుస్తూన్న సత్యాన్ని అక్కున చేర్చుకుని వోదార్చేరు.

చూస్తున్న వాళ్ళంతా చలపతిగారి దొడ్డ హృదయానికి సంతోషించేరు.

ఆయనచేస్తున్న ఈ మహోపకారానికి ఊరి వారంతా ఆయన్ను మనస్ఫూర్తిగా అభినందించేరు.

గిట్టనివాళ్ళు, 'కాసిన్ని డబ్బులు రాగానే కిందా మీదా కనపట్టంలేదు. మిడిమేలపు సిరి. ఎట్లా వొచ్చిందో అట్లానే పోతుంది' అన్నారు.

చలపతిగారు వేటినీ పట్టించుకో లేదు.

రవణమ్మను దహనంచేసిన వారం రోజుల తర వాత వొకనాడు, చలపతిగారు సత్యాన్ని తీసికెళ్ళి, బాంకిలో వాడి పేరు ఐదువేల రూపాయలు వేసేరు. అప్పటిగ్గాని ఆయన మనస్సుకు రవంత ప్రశాంతత చిక్కలేదు.

ఆ రాత్రి భోజనం పెడుతూ కామాక్షి గం యిన లేచింది.

'మేమేం బతకా లనుకొన్నారా? అడుక్కుతిని పోవా లనుకొన్నారా? మీది మరీ అంత జాలిగుండె అయితే, పదో పాతికో యిస్తారుగాని యిలా వేలకు వేలు తగలేస్తారా? మీరు వొళ్ళు తెలిసి చేస్తున్న పనేనా యిది?' అని లక్షపెట్టింది.

చలపతిగారేం మాట్లాళ్ళేదు.

'ఓసి వెర్రి ముఖమా! డబ్బు ఎంతటివారి నైనా గడ్డి తినిపిస్తుంది. తిన్నవాణ్ణి నా కా విషయం స్పష్టంగా తెలుసును. గడ్డి పశువుల కాహారం. మను షుల క్కాదు. అయినా స్వార్థం బలిసిన మనిషి గడ్డి మేస్తాడు. అలా మేసినప్పుడు బయటకు చెప్పే చేవ లేక, అలా వెధవపని చేసేమన్న స్పృహ మనసును బాధిస్తే, లోకుల కళ్ళు కప్పటానికీ, తనను తాను రవంత తృప్తిపరచుకోవటానికీ నాలుగు మంచిపనులు చేస్తాడు. ఇందులో ఆత్మవంచనా, పరవంచనా కూడా వుంది. నేనూ అదే చేసేను. సత్యానికి నేను ఐదువే లివ్వట మేమిటి? వాడే మనకు తొంభయ్యయిదు వేలిచ్చేడు.' అని చెబుదామనుకొన్నాడు. కాని గొంతు పెగల్లేదు. రెండు నిమిషా లాగి యిలా అన్నాడు.

'ఈ శరీరాలయంలో ఒక దీపం వుంది. అది స్వచ్ఛంగా వెలిగి మనసును కాంతితో నింపుతూం టుంది. మనిషి పొట్టకోసం, అలవిమాలిన కోర్కెల కోసం, వెధవపనులు చేస్తూ ఆ దీపంచుట్టూ దళసరి తెరలు కడతాడు. ఎంతటి దళసరి తెరలు కప్పినా దీపం పూర్తిగా ఆరిపోయేంతవరకూ వెలుగుతూనే వుంటుంది. ఆ మసక వెలుగులో మనిషికి మనసు లోని కుళ్ళు కనిపిస్తూనే వుంటుంది. నా దీపం యింకా ఆరలేదు. అదీ సంగతి.'

ఈనకు పిచ్చెక్కిందనుకొంది కామాక్షి.

చలపతిగారు కళ్ళు మూసికొని గోడకు ఆను కొన్నారు.

ఆయన కనుకొలకుల్లో మెరుస్తూన్న ముత్యాలు కామాక్షికి కనిపించలేదు.

కవిత్వము - ఉద్యమము

శ్రీ ఉపాధ్యాయుల అప్పల నరసింహమూర్తి

ఒక లక్ష్యము—దానిని సాధించడానికి అవలబించవలసిన నియమావళి - లక్ష్యస్థాపన చేసిన నాయకుడు—అతని అనుయాయులు—వారి సమిష్టికృషి—తత్ఫలితాలు, స్థూలంగా ఇది ఉద్యమ స్వరూపం.

కవి సమాజమును వస్తువుగా గ్రహించి తన అంతరంగస్పందన కనుగుణమైన నూత్నసృష్టి చేస్తాడు. ప్రతిభావంతుడైన కవి కావ్యము సాహిత్యాన్ని క్రొత్తమలుపు త్రిప్పుతుంది. లేదా సమాజానికి క్రొత్తతీర్పు నిస్తుంది. ఆ సుముహూర్తంలో కవి ఉద్యమకారుడుగా అవతరిస్తాడు. సామాన్యంగా కవి సామాజిక ప్రగతికి పరోక్షంగానే మార్గదర్శి కాగలడు. అంటే—

నా గదిలోపల చీకటిలో!
చీకటి లోపల నాగదిలో!
నా గదిలో...
చీకటిలో...—

అప్పట్లాగా ఒంటరిగానే, సమాజంలో అడుగు పెట్టకుండానే కవి ఉద్యమకారుడు కావచ్చును. అటువంటప్పుడు సామాజిక న్యాయానికి తీర్పరియైన కవి ఆదర్శసమాజ రూపకల్పనకు ప్రేరకుడు మాత్రమే కాగలడు. ఇందుకు అపవాదం కూడా వుంది. సమాజంతో ముఖాముఖి తలపడిన కవి సాంఘికరంగంలోను, సాహిత్య రంగంలోను ఉద్యమకర్తగా నిలిచే అవకాశముంది.

ఉద్యమాలను స్థూలంగా రెండు రకాలుగా విభజింప వచ్చును. అవి (1)సాంఘికోద్యమాలు (2) కళా — శాస్త్రీయోద్యమాలు. వీనిలో సాంఘికోద్యమాలను మత—రాజకీయ— సంస్కరణోద్యమాలుగా వేరు పరచవచ్చును—సాంఘికోద్యమాలు ప్రజాసామాన్యానికి చెందినవి. వీనిలో కార్యాచరణ మాత్రమే సమాజంతో ప్రత్యక్షసంబంధాన్ని కలిగివుంటుంది. కళా—శాస్త్రీయోద్యమాలు మేధావివర్గానికి చెందినవి. ఈ ఉద్యమాలను నడపేవారికి సమాజంతో ప్రత్యక్ష సంబంధ ముండ నక్కరలేదు. స్వభావాన్నిబట్టి సాహిత్యోద్యమాలు వీనిలో రెండవ వర్గానికి చెందినవి. అయినా సాహిత్యోద్యమాలను (1) కేవల సాహిత్యోద్యమాలు (2) సాంఘికోద్యమాలతో ముడిపడిన సాహిత్యోద్యమాలనుగా వేరుచేసి చూడవచ్చును. కేవల సాహిత్యోద్యమాలు కళా జగత్తునకు సంబంధించినవి. సాంఘికోద్యమాలతో ముడివడిన సాహిత్యోద్యమాలు వాస్తవిక జగత్తునకు సంబంధించినవి. కాని కేవల సాహిత్యోద్యమాలు సామాజిక ప్రయోజనాన్ని విస్మరిస్తాయనిగాని, సాంఘికోద్యమాలతో ముడిపడిన సాహిత్యోద్యమాలు కళాధర్మాలను పటించవనిగాని అనడానికి వీలులేదు. రామాయణాన్ని రచించిన కవులు 'రామాది వద్వర్త్తవ్యం న రావణాదివత్' అనే అంశాన్ని సాంఘిక ప్రయోజనంగా గుర్తించేరు.

'రాజుగారి కోటలో
రాణిగారి తోటలో
జిల్లేడు పాకిందిలే
పల్లేరు మొలిచిందిలే' --

అని వ్రాసిన కవులు ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క మౌలికాశయాన్ని అద్దంలో పట్టినట్టు కళాత్మకంగా చూపించేరు. అందుచేత కళాదృష్టి—సాంఘికదృష్టి రెండూగల కవిత్వం మాత్రమే నిలుస్తుంది. కొద్దీ—గొప్పా తేడా ననుసరించి వాని మధ్య వర్గీకరణ ఏర్పడుతున్నది.

ఒక ఉద్యమం ప్రజావ్యాప్తం కావడం—కాక పోవడం అనేది ఉద్యమ కర్త సమర్థత—కాలమాన పరిస్థితుల పరిపక్వతలపై ఆధారపడి వుంటుంది. నన్నయ భారతాంధ్రీకరణాన్ని ప్రారంభించాడు. అది సాహిత్యోద్యమం అయింది. భారతాంధ్రీకరణంలో నన్నయ ఉద్దేశ్యం వైదిక మతోద్ధరణ. వైదిక మతోద్ధరణ అనేది సాంఘికోద్యమము. నన్నయ లౌకిక దృష్టి విడచి కేవల పారమార్థిక దృష్టితో భారతాంధ్రీకరణ కొనసాగించడంచేత నన్నయ నాడు భారతాంధ్రీకరణ సాహిత్యోద్యమంగానే మిగిలింది. గతానుగతికమైన ధర్మాన్ని పునః ప్రబోధించిన నన్నయ ఉద్యమకర్త కాలేక పోయాడు. అందుచేతనే భారతాంధ్రీకరణం ఆగిపోయింది. అదే వైదికధర్మాన్ని లక్ష్యంగా గ్రహించిన తిక్కన హరిహరనాథ తత్త్వాన్ని ఆవిష్కరించి సరిక్రొత్త ఉద్యమ నిర్మాతగా అవతరించడం జరిగింది. తాను ఉద్యమకర్తగా రూపొందడానికి తగిన పూర్వరంగాన్ని తిక్కన సిద్ధపరుచుకున్నాడు.

'జనన మరణాదులైన సంసార దురిత
ములకు నగపడకుండంగఁ దొలగు తెరువు
గను వెలుంగు'—ముందు సంపాదించు కున్నాడు.

కవిత్వాన్ని ఒక ఆవేశంగా భావించాడు. మహాకవిత్వ దీక్షావిధిని పొందాడు. ఆంధ్రావళి మోదము పొందుటకై, 'తెనుఁగుబాస వినిర్మింప', పూనుకున్నాడు. కనక సదృశమైన భారతేతివృత్తానికి నూత్న రత్న సదృశమైన స్వకీయ మహాకవిత్వ విభూతిని పొదిగి, 'నా నేర్చిన భంగి చెప్పి వరణీయుడ నయ్యెద'నని, తన మార్గాన్ని ఏర్పరుచుకున్నాడు. తన హరిహరనాథునితో బాటు మహాభారతాన్ని కూడా ప్రజల్లోకి తీసుకుని పోయాడు. నెల్లూరిలో హరిహరనాథాలయాన్ని నిర్మింపఁజేసి, ఓరుగల్లులో భారత పఠనాన్ని కొనసాగించాడు. కేతన, మారన, నాచన సోమన, అనంతుడు మొదలైనవారు తిక్కన అనుయాయులు కాగా, మత పరమైన సమన్వయ ధోరణి వారి ఉద్యమ ఫలితంగా నిలిచింది. ఉద్యమ వ్యాప్తికి—ఉద్యమకారుని సమర్థతకు సంబంధం ఈ విధంగా వుంటుంది. ఈ శతాబ్దిలో సూర్యుడు ఉదయించిన సమయంలోనే తెలుగు సాహిత్యంలో ఒక వెలుగురేఖ విరిసింది. భావము—భాష—ఛందస్సు అన్నిటా మార్పు తెచ్చి సాహిత్యాన్ని సరాసరి ప్రజలతో కలిపిన సరిక్రొత్త ఉద్యమం గురజాడతో ప్రారంభమయింది. అయినా ఆంధ్రదేశంలో సామ్యవాద చింతన పరిపక్వమయేదాకా ఆ ఉద్యమం రూపుకట్టలేక పోయింది. కాలమాన పరిస్థితుల ప్రభావంచేత, గురజాడ మరణించిన తరువాత సాహిత్య లోకంలో పునరుజ్జీవన ఉద్యమకర్తగా, యుగకర్తగా కీర్తింపబడ్డాడు.

తెలుఁగునాట తొలి కవులు తమ తమ ఉద్యమాల వ్యాప్తికై రెండు విభిన్నమార్గాల ననుసరించారు. సమాజంలో కీలక స్థానాల నాక్రమించిన మేధావి వర్గాన్ని ప్రభావితం చేసి వారి ద్వారా తమ ఆశయాన్ని సాధించడ మొక మార్గము. సూటిగా ప్రజా సామాన్యాన్ని చేరుకుని వారిని ఉద్రేకపరచడం ద్వారా తమ లక్ష్యాన్ని చేరుకోవడ మొక మార్గము. తత్ఫలితంగా ఆంధ్ర సాహిత్యంలో రెండు ప్రధానమైన సాహిత్యోద్యమా లేర్పడ్డాయి. అవి (1) మార్గకవిత. (2) దేశికవిత.

మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశికవితఁ బుట్టించి తెనుం
గున నిలిపి రంధ్ర విషయం
బునఁ జనఁ జాళుక్యరాజు మొదలుగఁ బలువుర్.

అనే నన్నెచోడుని పద్యం ఈ విషయాని కాధారంగా కనిపిస్తూంది. విమర్శకు లీ పద్యాన్ని గ్రహించి నన్నయాదులను మార్గకవులుగా, నన్నెచోడాదులను దేశికవులుగా తీర్పు చెప్పేరు. కాని నన్నెచోడుడు ప్రజా సామాన్యాన్ని చేరినవాడు కాడు. అతనికి ఆ రకమైన అభిప్రాయమున్నట్లు కూడా కనబడదు. తెనుగు కవులలో ప్రజాసామాన్యాన్ని స్మరించిన మొదటి కవి పాల్కురికి సోమన మాత్రమే.

'ఉరుతర గద్య పద్యోక్తుల కంటె
సరసమై పరఁగిన జానుఁదెనుఁగు
చర్చింపఁగా సర్వసామాన్య మగుటఁ
గూర్చెద ద్విపదలు గోర్కి దైవాఱఁ;
దెలుఁగుమాట లనంగ వలదు; వేదముల
కొలదియ కాఁజూడుడు.'

సోమనాథుఁడు శైవమత ప్రచారానికై దేశి కవితను చేపట్టాడు. 'సర్వసామాన్యంబుఁగామి' అనే ప్రయోగంలో సోమన ప్రజాసామాన్యాన్ని ఉద్దేశించాడు. ప్రజలకు చెప్పదలచిన విషయాన్ని ప్రజల ఛందస్సులో చెప్పడానికి అతడు వెనుకాడ లేదు. అందుకే తన తెలుగు మాటలను వేదవచనములుగా గ్రహించాలని శాసించాడు. సమాసభూయిష్ఠమైన రచనను విడచి జానుతెనుగులో వ్రాయాలని దీక్ష పూనాడు. కథా వస్తువు కూడా సమకాలీన మైనదే గ్రహించి దానిని పురాణంగా తీర్చి దిద్దాడు. వాదనలు—చర్చలు—మహిమల ద్వారా సమాజంతో ప్రత్యక్షంగా తలపడ్డాడు. అందుచేత శివకవిత ఒక ఉద్యమంగా, ద్విపద రచన ఒక ప్రత్యేక సాహిత్య ప్రక్రియగా తెలుగు సాహిత్యంలో తమ విశిష్టతను సంతరించు కున్నాయి. సోమనాథునకు వీరశైవ మతవ్యాప్తియే పరమాదర్శము. ఆ లక్ష్య సాధన కాతడు పండిత, పామరవర్గాలను రెండింటిని రెండు మార్గాలలోను లోబరచుకున్నాడు. ఇటువంటి లక్ష్యశుద్ధిలేని కారణంచేత నన్నెచోడుడు గొప్పకవి—గొప్ప శివభక్తుడు అయాడే కాని ఉద్యమకారుడు కాలేక పోయాడు. ఒక ఉద్యమంలో వ్యాప్తి చెందక పోవడమనే కారణంచేత, మరొక ఉద్యమానికి వ్యతిరేకమైన కారణంచేత అతని కావ్యం మరుగున పడిపోయింది. కాగా మరొక విధంగా నన్నెచోడుని ఉద్యమకర్తగా విమర్శకులు భావిస్తున్నారు.

'నన్నయ. నన్నిచోడు లిద్దరూ ఆంధ్రసాహిత్య చరిత్రలో రెండు భిన్నమార్గములకు దారితీసిన వారైనారు. ఒకరిది పురాణ కవిత. మరొకరిది వస్తుకవిత—ప్రబంధ కవితా మార్గము. ఇట్లు ఆంధ్ర సాహిత్యమున కాదిలోనే రెండు విధములగు భిన్నశాఖల కంకురార్పణము జరిగినది.'

డా॥ కోరాడ మహాదేవ శాస్త్రి.
(కుమార సంభవ పీఠిక—ఏకాడమీ ప్రతి)

పురాణ కవిత—ప్రబంధ కవిత అనేవి కేవల సాహిత్యోద్యమాలు. అవి తెలుగు సాహిత్యంలో మొదటి నుండి చోటు చేసుకున్నమాట నిజమే. నన్నయ—నన్నెచోడులే వానికి ప్రతినిధులు. కాని వస్తుకవిత అనగా ప్రబంధ కవిత అవునా? కాదా?—అనేది పరిశీలనమీద తేలవలసిన విషయము.

సామాజిక సంఘటనలకు దూరంగా వృద్ధి పొందే సాహిత్యోద్యమాలకు ప్రచారంతో పనిలేదు. ఇవి అనుభూతి ప్రధానమైనవి. ఒక కవినుండి వేరొకకవి పొందే ప్రేరణ మాత్రమే ఈ ఉద్యమాల వ్యాప్తికి కారణమవుతుంది. కవి ఊహా బలంతో నిర్మింపబడే రసజగత్తు ఇక్కడ కనిపిస్తుంది. కవి లోకజ్ఞుడైనట్లయితే సమకాలీన వాతావరణ స్పర్శ కావ్యజగత్తులో కనిపించ వచ్చును. కాని నాడు ఆ అవకాశం కూడా లేకపోవచ్చును. తెలుగులో ఈవిధమైన సాహిత్యోద్యమాలు ప్రధానంగా రెండు కనిపిస్తున్నాయి. అవి (1) ప్రబంధకవిత్వము (2) భావ కవిత్వము. ఒకటి పూర్వకాలానికి సంబంధించినది. రెండవది ఆధునిక కాలానికి చెందినది. తెలుగులో ప్రసిద్ధులైన కవులనేకులు ఈ ఉద్యమాలకు చెందిన వారు. కాలాన్నిబట్టి ఆలోచిస్తే ఈ రెండు ఉద్యమాలు చాలా క్లిష్టమైన సాంఘిక పరిస్థితులలో పుట్టి పెరిగినవి. ప్రబంధకవిత కొనసాగినంతకాలం దేశం మహమ్మదీయుల పరిపాలనలో క్రుంగింది. మహమ్మదీయుల ఒత్తిడికి వ్యతిరేకంగా అనేక సాంఘిక సంఘటనలు జరిగాయి. మహమ్మదీయ పాలనలో ప్రజలు అనేక కష్టసుఖాలకు లోనయ్యారు. కాని ప్రబంధ కవులెవ్వరూ ఆ సంఘటనలను కావ్యంగా మలచలేక పోయారు. సింహాద్రి నారసింహ శతకం లాంటి స్వల్పరచనలు ఇందుకు అపవాదాలు. మను, వసు చరిత్రాదుల అవతారికలలో కృతిపతి ప్రశంసార్థం కొన్ని చారిత్రక సంఘటనలు పొందుపరుప బడ్డాయి. అక్కడ కూడా కవి లక్ష్యం కృతిపతి ప్రశంసయే గాని చారిత్రకాంశ నిరూపణం కాదు. వర్ణనలనే పేరున సమకాలీన వాతావరణ నిరూపణ కొంతవఱకు చేయడం ద్వారా ప్రబంధకవులు భావకవులకన్న మెరుగని పించారు. ప్రపంచమంతటా జాతీయ చైతన్యం వెల్లివిరిసిన కాలంలో ఆవిర్భవించిన భావ కవిత్వం దివినుండి భువికి దిగిరా నన్నది. ఆంగ్లేయ పరిపాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నడచిన జాతీయోద్యమాన్ని—సమకాలీన సంఘటనలను కాదని విజృంభించి ఒక తరం కవుల నందరను ప్రభావితం చేసిన ఖ్యాతి భావకవిత్వానికి మాత్రమే దక్కుతుంది.

ఇందుకు కారణం భావకవిత్వం మానసికానుభూతి ప్రధానమైనది కావడం మాత్రమే. ఈ ఉద్యమం యొక్క వ్యాప్తిని శంకించడం, శపించడం భ్రమ జనితమే అవుతుంది. కవిత్వానికి ఒకే ప్రయోజనాన్ని సాధించడం ఇంతవఱకు జరుగలేదు. కాని ప్రయోజనా రాహిత్యం కవిత్వాశయం కాదు. కవిత్వానికిగల అనేక ప్రయోజనాలలో ఆనందసిద్ధి ఒకటి. 'ఆనందా దేవ ఖల్విమాని భూతాని జాయంతే' అంటాడు ఆనంద వర్ధనుడు. పెద్దనను కవిత్వం ఎలాగుండాలయ్యా? అని అడిగితే 'సొగసు కోర్కులు రావలె నాలకించినన్' అంటాడు. ఆ ఆనందాన్ని కలిగించే శక్తి ప్రబంధ కవితకు, భావకవితకు అధికంగా వుండబట్టే ఆ ఉద్యమాలు బహుళ ప్రచారంలోకి వచ్చాయి. ఈ సత్యాన్ని కాదనలేము. సహృదయుడైన పాఠకునకు ఆ మానసికానందాన్ని కరిగించేశక్తి అవి ఎన్నటికీ కోల్పోవు. అందుకే కవిత్వానికి సాంఘిక ప్రయోజనం ఉండి తీరాలనే ఈ రోజులలోకూడా కేవల సాహిత్యో ద్యమాల ప్రభావం అవిచ్ఛిన్నంగా కొనసాగుతూనే వుంది. ఈ నాడుకూడా కవితా సంబంధమైన ఊహలు చాంపేయ మాలలుగా, ఊళలు కేదార గౌళలుగా, ప్రయోజనాలు రసరాజ్య డోలలుగా రూపుదిద్దుకుంటు న్నాయి. 'కవిత్వం ఒక ఆల్కెమీ—అందం ఆనందం దాని పరమావధి' అనే చింతన, తదావర్తన ఆధునిక తెలుగు సాహిత్యకాసారంలో నిశ్శబ్దవర్తుల సంగీతాన్ని ఆలపిస్తున్నాయి. ప్రబంధ కవినుండీ, భావకవినుండీ పొందిన ప్రేరణ ఫలితంగా ఏర్పడిన వాతావరణ మిది.

ఈ వాతావరణాన్ని ఛేదించుకొని కవిత్వాన్ని నికరమైన సాంఘికోద్యమ ఛాయగా, ప్రజల వస్తువుగా తయారు చేయాలనే తపనతో ఆవిర్భవించినది అభ్యుదయ కవిత్వోద్యమము. కాని సమసమాజ నిర్మాణ మనే ధ్యేయం అభ్యుదయ కవుల కవిత్వాంశలో ఒక భాగంగా మిగిలింది. అభ్యుదయ కవితకు వస్తువు ప్రజలయ్యారేగాని, అభ్యుదయ కవిత ప్రజల వస్తువు కాలేకపోయింది. అంటే వ్యాప్తినిబట్టి భావకవిత్వానికి—అభ్యుదయ కవిత్వానికి పరిధి ఒకటే అయింది.

'చావలేదు! చావలేదు! ఆంధ్రుల మహోజ్జ్వల చరిత్ర
హృదయములు చీల్చి చదువుడో సదయులార!'

అనే పద్యం ఎవరిదాకా చేరిందో

'స్వాతంత్ర్యం సమభావం
సౌభ్రాత్రం సౌహార్దం
పునాదులై యిళ్లులేచి
జనావళికి శుభంపూచి
శాంతి శాంతి శాంతి శాంతి
జగమంతా జయిస్తుంది'—

అనే అభ్యుదయ కవితకూడా వారిదాకానే చేరింది. పరోక్షంగా ఉన్నంతకాలం కవి కవిత్వాంశ గల మరొక వ్యక్తిని ఉద్రేక పరచడం మాత్రమే జరుగుతుంది: ఈరకమైన ఉద్రేకం కేవలం కవిత్వపరంగానే నిలుస్తుందిగాని ఉద్యమ సాఫల్యానికి దోహదకారి కాలేదు. అభ్యుదయ కవిత్వోద్యమం ఈస్థాయిలో ఆగిపోయింది. ఇందుకుగల కారణాలను అన్వేషిద్దాం.

ఒక ఉద్యమంయొక్క పుట్టుకకు, వ్యాప్తికి ఇతరేతర ఉద్యమాల ప్రభావం కారణమవుతుంది.

'పరస్పరం సంఘర్షించిన
శక్తులలో చరిత్రపుట్టెను' —

అని శ్రీశ్రీ చెప్పినట్లుగా అభ్యుదయకవిత్వా విర్భావం అనే చారిత్రకసత్యంకూడా ఆకస్మిక సంఘటన కాదు. సిద్ధాంతపరంగా కారల్‌మార్క్సు సామ్యవాద ఉద్యమం, సాంఘికంగా కందుకూరి సంస్కరణోద్యమం, భాషా విషయికంగా గిడుగుపండితుని వ్యావహారిక భాషోద్యమం, ప్రక్రియాపరంగా గురజాడ అడుగుజాడ—అభ్యుదయకవితా సౌధానికి చలనం లేని పునాదులుగా నిలిచాయి. మార్క్సు, కందుకూరి, గిడుగు, గురజాడ—సంఘంతో ప్రత్యక్షసంబంధం కలవారు. వీరు ఎన్నుకొన్న లక్ష్యాలకు, ప్రయత్నించిన మార్గాలకు సామరస్యం కుదిరింది. అందుచేతనే వారు ఉద్యమ నిర్మాత లయ్యారు. అభ్యుదయకవుల లక్ష్యాలకు ప్రయత్నించిన మార్గాలకు ఈ విధమైన సామరస్యం కుదరని కారణంగా ఆ ఉద్యమం ఒక మేరకే సఫల మయింది. అభ్యుదయకవులలో కొంతమంది ముఖ్యులు భావకవిత్వం నుండి దిగుమతి అయినవారు కావడంచేత, సంప్రదాయ ముద్ర కలవారవడంచేత 'సాంఘిక ప్రయోజనం' అనే అంశాన్ని విడచిపెట్టికూడా వారు రచనలు చేయడం జరిగింది. ఉదాహరణకు—

'ఆనందం అర్ణవమైతే
అనురాగం అంబరమైతే

ఆనందపు లోతులు తీదాం
అనురాగపు టంచులు చూదాం'

అనే గేయానికి సాంఘిక ప్రయోజనాన్ని చూప లేము. ఐనా ఇది ఉత్తమకవితగా పరిగణింపబడుతూంది. కాని వస్తుపరంగా ఈవిధమైన ఎన్నిక సమసమాజ నిర్మాణోద్యమము యొక్క నిర్విరామ చైతన్యానికి ప్రతీఘాత చర్యగా నిలుస్తుంది. భాషా విషయికంగా తిక్కన—వేమన—గురజాడలకు వారసుల మనుకున్న అభ్యుదయ కవులు ప్రజలకు భావకవులు ఎంతదూరంలో నిలబడ్డారో అంతే దూరంలో నిలబడ్డారు. గిడుగు వారి వ్యావహారిక భాషోద్యమం ఫలవంతమైన తరువాత, దాని ప్రభావంతో నిలబడిన అభ్యుదయ కవితలో ప్రజలభాష తక్కువ.

'ప్రదీప్తకీలా ప్రవాళమాలా
ప్రపంచవేలా పరిభ్రమణలో
మిహిర వాజి తతి మఖవ ధనుర్ద్యుతి
పుడమికి నేడే పుట్టిన రోజట'—

ఈ తరగతికి చెందిన రచనను వ్యావహారిక రచనగా అంగీకరించడం హాస్యాస్పదం. ఈవిధమైన భాష నుప యోగించిన కవులు మురారి, కృష్ణరాయలువంటి కవులకు వారసులు కావచ్చునుగాని వేమన, గురజాడల కోవకు చేరవలసిన వారు కారు. ఏ తరగతికవులు ఆ తరగతి ప్రజలనుండే ఆవిర్భవించా లేమో! జానపద కవిత్వాన్ని జానపదులు కూర్చితేనే సొగసున్నట్లుగా తెలుగు కవిత్వాన్ని ఇతరభాషలు రానివాడు వ్రాస్తేనే ప్రజాకవిత్వ మవుతుంది. కాని నాడు అది సాహితీ పరులలోనే నిలుస్తుంది. సంస్కృతంలో పుట్టిపెరిగిన కవులు సంస్కృత ప్రభావానికి లోనుగాక తప్పదు. ప్రజాకవుల మనుకునేవారి సంకలనాలపేర్లు 'మహా ప్రస్థానం— త్వమేవాఽహమ్ — భువన ఘోష — వజ్రాయుధం—రుధిర జ్యోతి—రుద్రవీణ' మొదలుగా వుంటే కవితా ఖండికలపేర్లు 'భిక్షువర్షీయసి— వేదనా శకలమ్— ప్రస్థానభేరి—మౌనఘోష' మొదలైనవిగా వుంటాయి. కేవలం గ్రంథనామాలనే తీసుకుంటే ప్రబంధ— భావకవిత్వాలు, నండూరి— కొనకళ్ళవంటి వారి రచనలు ఇంతకంటె ప్రజలకు చేరువగా వుంటాయి. లక్ష్యశుద్ధిలేని కారణంచేత అభ్యుదయ కవులు ఈ విధమైన ప్రమాదానికి లోనయ్యారు. తెలుగంతా గ్రామాలలో వుంది. సామాన్య ప్రజలందరూ నిరక్షరాస్యులుగా, సాహితీ గంధంలేని వారుగా వున్నారు. ఈ రెండు సమస్యలు తీరకుండా అభ్యుదయ కవులుగాని, మరొకరుగాని ఏమివ్రాసినా అది ప్రజలకు చెందని శుష్క నినాదంగా మిగులుతుంది. ఆ కవులు ప్రజాకవులు కాలేరు. గురజాడ మనకొద్దుబాబూ అని నెత్తిమొత్తుకున్న 'artificial literary dialect,' 'alliterative versification' కూడా అభ్యుదయ కవులను విడచి పోలేదు.

'కావ్యం ఏదైనా సరే కనీసం ఒక రిక్వైరుమెంటు
కావాలి కవిత హృదయానికి నరిష్మెంటు
కారాదు ఏనాడు మెదడుకి పనిష్మెంటు'

అని ఆరుద్ర అంటే—

'ఎక్సలెంటు ఆరుద్రా నీ స్టేట్‌మెంట్'
అంటారు శ్రీ శ్రీ. వారు పేర్కొన్నట్లుగా అభ్యుదయ కవిత హృదయ సంబంధిగానే మిగిలింది. అంటే అనుభూతి సంబంధమైన దయింది. సాహిత్యాభి రుచిగల అభ్యుదయ వాదుల హృదయ స్పందనలో అభ్యుదయ కవిత సాఫల్యాన్ని పొందింది. ఇంతవఱకు కేవల సాహిత్యోద్యమాలు—సాంఘికోద్యమాలతో ముడిపడిన సాహిత్యోద్యమాలనుగూర్చి స్వాతంత్ర్య ప్రాయంగా ప్రస్తావించడం జరిగింది.

ఉద్యమం కవిత్వాన్ని ప్రభావితం చేస్తుందా? కవిత్వం ఉద్యమాన్ని ప్రభావితం చేస్తుందా? ఇవి పరస్పర ప్రభావితాలా? అని ఆలోచిస్తే వేర్వేరు స్థాయిలో పై మూడు విధాలుగా కూడా జరిగే అవకాశముందని గ్రహించ వచ్చును. ఉదాహరణకు తెలంగాణా ఉద్యమాన్ని తీసుకుందాం. ఆ ఉద్యమం ద్వారా ప్రభావితులైన కవులున్నారు. ఆరుద్ర 'త్వమేవాహం' అలాంటి కావ్యమే.

'బ్రెయిన్‌లో బ్రెన్ గన్
రెయిన్‌లా ఆలోచనల ట్రెయిన్
స్వెయినల్ కార్డులో స్ప్రెయిన్
గ్లూమీ తిమిరాలు చెరిషించి
సైతాన్ మనల్ని పెరిషించు నప్పుడు

నిర్వేదనా పవనాలు వర్షించు
సింతటిక్ చింతను ధరించు కవి'—

ఇలాంటి చరణాలన్నీ నాటి తెలంగాణా పరిస్థితులను దృష్టిలో నుంచుకొని వ్రాసినవే. ఆ ఉద్యమంచేత ప్రభావితుడై కవి ఈరచన చేయడం జరిగింది. కాని కవి అంతర్ముఖుడై వెల్లడించిన ఈవేదనాశకలం సాహితీపరంగా కొందరి ఆనందానికి కారణభూత మయిందే గాని — దీనివల్ల తెలంగాణా ఉద్యమానికి పిసరంత లాభం కూడా చేకూర లేదు. అందుచేతనే 'త్వమే వాహం' ఉద్యమంచేత ప్రభావితమయిన కవిత మాత్రమే అయింది.

'నైజాం సర్కారోడ! నాకొడకా!' అనే పాటను తీసుకుందాం. ఉద్యమకాలంలో తెలంగాణా గ్రామా లలో ఈపాట మారు మ్రోగింది. ప్రజలందరి నోటా ఆపాట వినపడిందంటే ఆపాట ఉద్యమాన్ని ప్రభావితం చేసిందని అంగీకరించాలి. కాని ఉద్యమం నుండి వేరు చేసిననాడు ఆపాటకు సాహిత్యగౌరవం లేదు.

ఆంధ్రోద్యమాన్ని తీసుకుందాం. ఈ ఉద్యమం చేత ప్రభావితుడై శ్రీ శ్రీ 'తెలుగుతల్లి' అనేపాట రచించడం జరిగింది.

'అదె వో తెలుగు తల్లి
అందాల నిండు జాబిల్లి
ఆనందాల కల్పవల్లి
అదె నీ తెలుగు తల్లి'—

ఇక్కడ కవికి తెలుగుదేశం పట్లగల ప్రగాఢాభిమానం వెల్లడవుతున్నది అంతకుమించి ఈపాట ఆంధ్రోద్య మాన్ని ఉద్రూత లూగించిన దేమీ లేదు.

'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా!
గత మెంతొ ఘనకీర్తి గల వోడా!'

అనే శ్రీకృష్ణ గేయం ఆంధ్రదేశాన్ని ఒక ఊపు ఊపిందనడంలో అతిశయోక్తి లేదు. ఆ బాలగోపాలం ఆ పాటను పాడుకోవడమే ఆంధ్రోద్యమంలో దాని పాత్రను తెలియజేస్తుంది. ఇదే విధంగా జాతీయోద్య మం చేత ప్రభావితులైన కావ్యాలకన్న గరిమెళ్లవారి 'మా కొద్దీ తెల్లదొర తనము'—అనే పాట ప్రజల నోళ్లలో నలిగి, వారిలో జాతీయ చైతన్యాన్ని రేకెత్తిం చిందని చెప్పవచ్చును. ఇక్కడ ఒక విషయం కని పిస్తుంది. ఉద్యమాన్ని ప్రభావితం చేసే రచనలన్నీ గీతగుణాన్ని కలిగినవే. సభలలో, సమావేశాలలో, ఊరేగింపులలో పాడటం వలన వానికి వ్యాప్తి చేకూ రింది. ఉద్యమం నుండి వేరుచేసి చూసినపుడు రస వత్కావ్యాల కున్న స్థాయి వాని కుండదు. కొన్ని రచనలు ఉద్యమంతోపాటే అంతరించిపోతాయి. అప్పుడు గీతి గుణం మాత్రమే వాని వ్యాప్తికి కారణంగా కనిపి స్తుంది. అందుకే పూర్వులు కావ్యాన్నిగూర్చి 'పాఠ్యే గేయేచ మధురం' అన్నారు. పైన ఉద్యమాన్ని ప్రభావితం చేసే రచనలుగా పేర్కొన్నవన్నీ ఉద్యమ ప్రభావంతో రూపొందినవే కాబట్టి కవిత్వము— ఉద్యమము పరస్పర ప్రభావితాలని అంగీకరించ వచ్చును.

ఒక ఉద్యమం యొక్క ఆవిర్భావానికి అంతకు ముందున్న ఉద్యమాలు ఏవిధంగా దోహదం చేస్తాయో అభ్యుదయ కవిత్వోద్యమం విషయంలో తెలుసుకున్నాం. మరొక విశేష మేమంటే ఒక నూతన ఉద్యమం యొక్క ఆవిర్భావం అంతకు ముందున్న ఉద్యమం అంతరించడానికి కూడా కారణం కాగలదు. ఈ అంశాన్ని దిగంబర కవిత్వోద్యమం ఋజువు పరచింది. అభ్యుదయ కవిత్వోద్యమ వైఫల్యం నుండి పుట్టిన నిరాశ—అశాంతి— అలజడి ద్వారా దిగంబర కవులు దిగ బడ్డారు. వీరికి ప్రపంచ వ్యాప్తంగా వున్న కొన్ని అతి నవ్యకవితా ధోరణుల ఆసరా వుంది. తిట్టడానికి తిట్లు తినడానికి తగిన గుండె ధైర్యముంది. అన్నిటికీ మించి ఏదో చెయ్యాలనే తపన వీరిలో కనిపిస్తుంది. కాని ఏమిచెయ్యాలి? అనే విషయంలో ప్రణాళికాబద్ధమైన నిశ్చితాభిప్రాయం వీరికి లేదు. ఈ లోటుతోనే, ఒక స్వల్పప్రకృతిలో ఆవిర్భవించిన దిగంబర కవుల సంఘ టిత శక్తి వారి ఉద్యమంయొక్క శీఘ్ర వ్యాప్తికి బలీయ మైన కారణంగా రూపొందింది. దిగంబర కవుల లోటు ఎక్కడున్నదో తెలుసుకుని విప్లవ కవిత్వో ద్యమం పుట్టింది. సాయుధ విప్లవమే సాంఘిక విము క్తికి మార్గదర్శకమనే లక్ష్యంతో కూడిన వి. ర. సం.లో దిగంబర కవిత్వోద్యమం కలిసిపోయింది. ఈనాడు దిగంబర కవిత్వోద్యమంయొక్క రూపురేఖలు లేనే లేవు.

సాంఘికోద్యమాల ప్రభావంతో పుట్టిన సాహిత్యోద్యమాల వృద్ధిక్షయాలు ఆ సాంఘికోద్యమాల నిలకడమీద ఆధారపడి వుండటం కూడా జరుగుతుంది. ఈ అభిప్రాయానికి విప్లవ కవిత్వోద్యమం ఆధారంగా నిలుస్తుంది. సాయుధ పోరాటాన్ని ప్రోత్సహించడమే విప్లవ కవుల లక్ష్యం. ఈ విధమైన అభిప్రాయం అభ్యుదయ కవులలో రెండవ తరం కవులలోను, తెలంగాణా ఉద్యమం నాటి కవులలోను అక్కడక్కడా కనిపిస్తుంది. దిగంబర కవుల రచనలలో కొన్ని సాయుధ పోరాటాన్ని ప్రోత్సహించేవిగా కనిపిస్తాయి.

'ప్రజల కోటికోట్ల ఆవేదన గొంతుల చీకటి చీల్చి పుట్టిన, సాయుధ విప్లవజ్వాలా కెరటాల కనుపాప' దిగంబర కవితలో ప్రజ్వరిల్లింది. ఆ తర్వాత 'మార్చ్,' 'తిరుగబడు', 'లే' మొదలైన కవితా సంకలనాలలో నూటికి నూరుపాళ్ల విప్లవాత్మ వెలుగులు చిమ్మింది. అయినా ఇవేవీ విప్లవ కవిత్వోద్యమంగా రూపు దాల్చలేదు. శ్రీకాకుళ గిరి జనోద్యమం తీవ్ర రూపం దాల్చిన తరువాత, విప్లవకారుల కార్యకలాపాల చేత ప్రభావితులైన కవులందరూ ఏకమై విప్లవ కవిత్వోద్యమాన్ని స్థాపించేరు. వి. ర. సం. ఏర్పడిన తరువాత ఆ కవులు తమ లక్ష్యసాధనను కొంచెం సేపు దూరంగావుంచి అభ్యుదయ రచయితలను పరామర్శించడంలో వృథా కాలయాపన చేసిన తీరు సాహితీ ప్రియులకు తెలిసినదే. దేశంలో, ముఖ్యంగా తెలుగునాట సృష్టింపబడిన విప్లవ వాతావరణానికి విప్లవ రచయితలకన్న విప్లవకారులే అధికంగా బాధ్యులయ్యారు. చాణక్యులు గ్రీన్ రూములోనుండి నినాదాలిచ్చినంతకాలం వి. ర. సానికి అ. ర. సానికి తేడా స్వల్పమే. అందుచేతనే వి. ర. సం. ఇంకా ప్రయోగ దశలోనే మిగిలింది. గిరిజనోద్యమం అంతరిస్తున్న కొద్దీ వి. ర. సం. లో స్తంభన ఏర్పడడం ప్రారంభించింది. విప్లవ కవులను అరెస్టు చేసిన తరువాత మళ్లీ కొంత సంచలనం కలిగింది. ఆ సంచలనం ఒక్క విప్లవవాదులలోనే గాక ఆరుద్ర, పురాణం సుబ్రహ్మణ్య శర్మ వంటి అభ్యుదయవాదులలో కూడా కలిగింది. వి. ర. సానికి ఇంకా తమ ఉద్యమాన్ని సమీకరించుకోవడానికే కాలమంతా సరిపోతూంది. కవిత కాదు కథ అన్నారు. కథలు కాదు వ్యాసా లన్నారు. సభలు—సమావేశా లన్నారు. కాని ఏ ప్రక్రియను అందుకొన్నా వి. ర. సం. వారు ఇంకా ప్రజలను చేరుకోలేక పోతున్నారు. సంస్కృత భాష—ఆలంకారిక సంప్రదాయావశేషాలు వీరిమీద కూడా తమ అధికారాన్ని నిరాఘాటంగా చెలాయిస్తున్నాయి. అంటే వీరు కూడా సాహిత్య ప్రయోజనాన్ని ఏకముఖంగా కేంద్రీకృతం చేయలేక అవస్థ పడుతున్నారన్న మాట.

కవిత్వానికి ఉద్యమానికి ఉండే సంబంధాన్ని పరిశీలించడం ద్వారా అభ్యుదయ కవిత్వం—దిగంబర కవిత్వం—విప్లవ కవిత్వం క్రమంగా ఒకదాని స్థానాన్ని ఒకటి ఏ విధంగా ఆక్రమించుకున్నాయో తెలుసుకోవడం జరిగింది. ఈ స్వభావం కేవల సాహిత్యోద్యమాలలో కూడా వుంటుంది. పురాణ కవిత్వం కావ్య కవిత్వం—ప్రబంధ కవిత్వం—భావ కవిత్వం క్రమంగా ఒకదాని స్థానాన్ని మరొకటి ఆక్రమించుకున్న తీరు సాహితీ పరులకు విశదమే. అన్ని రంగాలలోను కాలంతో బాటు అభిరుచులు — అభిరుచులతోపాటు సాహితీ ప్రక్రియలు మారుతున్నాయి. మార్పు అనివార్యమైనది. ఉద్యమాలు తాత్కాలిక మైనవి. వాటి నాశ్రయించుకున్న కవిత్వాలు వాటితోపాటు మారుతూంటాయి. మానవ స్వభావం వైవిధ్యం గలది. దాని నాశ్రయించుకున్న కేవల సాహిత్యోద్యమాలు కూడా స్వభావంలో వైవిధ్యం గలది. అందుచేత సాహిత్యోద్యమాల స్వభావంలో బాహిరంగా—అంటే ప్రక్రియా పరంగా ఎంత మార్పు కలిగినా వాని జీవలక్షణం మారదు.

'విజయ విలాస వ్యాఖ్య-హృదయోల్లాసం' -సమీక్షా పరిశీలన

-డా. ఎస్. గంగప్ప

'విజయ విలాసవ్యాఖ్య — హృదయోల్లాసం' — అన్న శ్రీ 'ఆంగీరస'గారి సమీక్షా వ్యాసం 1972 అక్టోబరునెల 'భారతి'లో చదివాక ఈ పరిశీలన వ్రాయాలనిపించింది.

'ఇందులో విశేషార్థాలు విరివిగా చూపబడి ఉన్నవి' అని మెచ్చుకొంటూనే శ్రీ 'ఆంగీరస'గారు 'తరచుగా ఇదివరకు వెలువడిన ప్రతులలో గ్రహించబడిన పాఠాలూ, వ్యాఖ్యలూ విమర్శించబడినవి. వ్యాఖ్యాత తాము గ్రహించిన పాఠాల ఔచిత్యాన్నీ, అర్థాల విశిష్టతనూ సమర్థించారు. కాని వారు ఇతరులను ఆక్షేపించి చూపిన అర్థాలూ, గ్రహించిన పాఠాలు కొన్నిచోట్ల సముచితంగా ఉన్నట్లు కనబడలే'దని కొన్నింటిని ఉదాహరించి, చివరిగా మరొక్కసారి శ్రీ తాపీ ధర్మారావు గారిని ప్రశంసిస్తూనే 'అట్టి వ్యాఖ్యలో ఇటువంటివీ, అనవసరంగా ఇతర వ్యాఖ్యాతలను గురించిన ఆక్షేపణలూ లేకుండా ఉంటే ఎంతో బాగుండేది'—అని ముగించారు.

ఇందులో 'అనవసరంగా ఇతర వ్యాఖ్యాతలను గురించిన ఆక్షేపణలూ' అంటూనే కేవలం వేదము వేంకటరాయశాస్త్రిగారిని ఆక్షేపించడానికే శ్రీ తాపీ వారు ఇలాంటి వ్యాఖ్యలు చేశారని శ్రీ 'ఆంగీరస'గారు అభిప్రాయపడడం భావ్యం కాదు. వేదంవారిని తాపీ వారు అంగీకరించిన పట్టులు, మెచ్చుకొన్న సందర్భాలు లేకపోలేదు. మచ్చుకు ఒకటి రెం డుదాహరణలు. ప్రథమాశ్వాసంలో చిత్రాంగదా సౌందర్య వర్ణనగల— 'బంగరు బొంగరాల పరిపాటి చనుంగవ.........' (215) పద్యానికి అర్థ తాత్పర్య విశేషాల్ని వివరించి, శ్రీ తాపీవారు 'అయినా వేదము వారు ఈ పద్యమున సొగసు ని ట్లుగ్గడించారు: 'బొంగరముప్రక్క బొంగరము అభిప్రాయము గాన 'పరిపాటి', మీలు సూటిగా చూపులవలె దూటును గాన 'సూటి', చంద్రుని కోటి యనగా శృంగము కలదు గాన 'ప్రతి కోటి', దాటుచున్న దశలోని తేంట్లు అభిప్రేతములు గాన 'ధాటి', పులిన గుణములలో ఏకదేశ మాత్రముగాని, తదీయ దశా విశేష మాత్రముగాని గాక, పులినమంతయు నభిప్రేతమైనందున 'సాటి', యనియుం గల ప్రయోగంపు సొంపుం బరికింప నింపగు ' అని, దీని సారస్యమును సహృదయులు చూడవచ్చును.''—అని తమ మెచ్చుకోలును దెలిపిన తాపీవారి సహృదయతను కాదనగలమా? ఇంక ద్వితీయాశ్వాసంలో నందశాపవిముక్తి నందిన సందర్భంలోని—

'ఈ బాల మోమునకు నా
జాబిల్లికి నెంత దవ్వు; సరివచ్చు నొకో,
యీబిడ చనుంగవ కొక మె
ట్టా బంగరు గట్టు తక్కువౌ నెంచంగన్.' (48)

అనే పద్యానికి అర్థ తాత్పర్యాలు, విశేషాలు తెలిపి— ''(3) లేదా వేదమువారు చెప్పినట్టు చంద్రు డున్నది చాల 'దూరము గావున వచ్చి ప్రక్కను సరిగా నిలువ నేరడని చమత్కారము గ్రహింపవచ్చును.'' అని వేదంవారిని అంగీకరించిన తాపీవారు వేదంవారిని ఆక్షేపించడమే లక్ష్యంగా ఉంచుకొన్నారని తలంచడం సముచితం కాదని వేరే చెప్పనవసరం లేదు. కాబట్టి తాపీవారు పూర్వ వ్యాఖ్యలను పరిశీలించి సముచితమైన వాటిని స్వీకరిస్తూ, తమ ప్రతిభా వ్యుత్పన్నతలలో ఇంకా ఎన్నో విశేషాల్ని వివరిస్తూ, చేమకూర వేంకటకవి హృదయావిష్కరణ గావించ ప్రయత్నించా

రంటే తాపీవారి సహృదయతను సైతం మనం గమనించవచ్చు.

ఇంక "వారు (తాపీ వారు) ఇతరులను ఆక్షేపించి చూపిన అర్థాలూ, గ్రహించిన పాఠాలూ కొన్నిచోట్ల సముచితంగా ఉన్నట్లు కనబడలే"దని 'ఆంగీరస'గారు చూపిన వాటిని పరిశీలిద్దాం.

1. శ్రీ తాపీ వారు 'ఆహారాన్ని బట్టే స్వభావ ముంటుందని ఒక సిద్ధాంతము' అన్నారనీ, అది పొరపాటనీ 'ఆంగీరస' గారు ప్రతి సిద్ధాంతీకరించ ప్రయత్నించారు, కానీ శ్రీ తాపీ ధర్మారావుగారు 'ఆహారాన్ని బట్టే స్వభావ ముంటుందని ఒక సిద్ధాంతము.' అనడం పరమ సిద్ధాంతం. ఇందులో సందేహ పడవలసిన అవసరం లేదు. ప్రకృతి సంభవాలైన సత్త్వ రజస్తమో గుణాలు మానవుల ఆహార విహారాదుల ననుసరించి ఉంటాయి. శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీత 17 వ అధ్యాయంలో సత్త్వ రజస్తమో గుణాలు గల వ్యక్తులు గ్రహించే ఆహారాల్ని గూర్చి వివరించాడు.

'ఆయు స్సత్త్వ బలారోగ్య సుఖప్రీతి వివర్ధనాః।
రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాః సాత్త్విక ప్రియాః॥

'కట్వామ్ల లవణా త్యుష్ణ తీక్ష్ణ రూక్ష విదాహినః।
ఆహారా రాజ సస్యేష్టా దుఃఖ శోకా మయ ప్రదాః॥

'యాత యామం గత రసం పూతి పర్యుషితం చయత్।
ఉచ్ఛిష్టమపి చామేధ్యం భోజనం తామస ప్రియమ్॥'

(శ్లో. 8, 9, 10.)

[ఆయుస్సును, దేహ మనోబలాల్ని, ఆరోగ్య సౌఖ్యాల్ని, ప్రీతిని బాగుగా వృద్ధినొందించేవీ, రసమూ చమురూ గలవీ, దేహమందు చాలకాలముండునవీ, మనోహరమైనవీ — అయిన ఆహారాలు సత్త్వగుణం గలవారి కిష్టం. చేదుగాను, పులుపుగాను, ఉప్పగాను, మిక్కిలి వేడిగాను, కారంగాను, చమురు లేనివి గాను, మిగుల దాహం గలుగజేసేవి గాను ఉండేవీ, దుఃఖం, వ్యాకులత్వాన్ని గలుగజేసేవి అయిన ఆహారపదార్థాలు రజోగుణంగలవారి కిష్టం.

వండిన పిమ్మట ఒక జాము దాటినదీ, సారం నశించినదీ, ఒకరు తినగా మిగిలినదీ, అశుద్ధమైనదీ అయిన ఆహారం తమోగుణం గలవారి కిష్టం.]

ఇట్లు ఆయా ఆహారాల్ని బట్టి సత్త్వరజస్తమో గుణాలుంటాయని శ్రీకృష్ణ పరమాత్మ ప్రబోధం, దీనికుప బలకంగా 'ఆహార శుద్ధౌ సత్త్వ శుద్ధిః'—అని మనుస్మృతి ఘోషిస్తూంది. పై సిద్ధాంతాన్ని బట్టే శ్రీ కృష్ణదేవరాయలు సైతం 'ఆముక్తమాల్యద' షష్ఠాశ్వాసం—మాలదాసరి కథలో కుంభజానువను రాక్షసునకు మాలదాసరిచే ఆహారాన్ని బట్టే తమస్సత్త్వ గుణా లుంటాయనీ, అవి రాక్షసుల్లోను, దేవతల్లోను గలవనీ— 'మీరు నా సౌరిముఖ బర్హిర్ముఖులు జాతిం దలపోయ భ్రాత లట్లయ్యుం బరంబున మీరు వారు బాధ్య బాధకతల నొందుచున్నారీ తైజసం బగు తారతమ్యంబునకుం దమస్సత్త్వంబులు హేతువులు, వానికా హృతులు హేతువులు.' అని చెప్పించాడు. కనుకనే ఆహారాన్నిబట్టి స్వభావం ఉంటుందనడమే సముచితమూ, శాస్త్ర సమ్మతమూను. దీన్ని ఆధునిక విజ్ఞానశాస్త్రం సైతం నిరూపిస్తూందనడం లోను అసామంజస్యం లేదు. అందుచేతనే—'జన్యజనకంబులకు భేద శంకలేదు। దేహమన్నజ మిందు సందేహ మేది?' అనే శ్రీనాథుని పద్యాన్ని తాపీవారు సమంగానే అర్థం చేసుకొన్నారనీ, శ్రీ 'ఆంగీరస'గారు 'ఆహారాన్నిబట్టి శరీరం వుంటుందిగాని స్వభావం ఉండదు' అను కొన్నట్లుగాక ఆహారాన్నిబట్టి స్వభావం ఉంటుందనీ అనడమే సత్యం!

ఇంక 'ఆంగీరస'గారు 'రూపాన్ని బట్టి స్వభావం ఉంటుందనేదే ప్రసిద్ధి'—అనీ, అందుకు కాళిదాస మహాకవి 'యదుచ్యతే పార్వతి! పాప వృత్తయే। నరూప మిత్య వ్యభిచారి తద్వచః॥' అన్న శ్లోకాన్నీ, దాని అనువాదమైన శ్రీనాథుని—'రూపము కలచోం బాప। వ్యాపారం బుండదనెడి వాక్కు నిజంబౌ'—నని ఉదాహరించారు. నిజమే! రూపం ఉన్నచోట గుణం కూడ ఉండ వచ్చు. కానీ ఇవి కవి వాక్కులు! కవి వాక్కునకు, శాస్త్రకారుని శాస్త్రానికీ భేదం ఉంటుంది. శాస్త్రకారుని విషయమే సత్యంగాని కవివాక్కు గాదు. కనుక 'ఆంగీరస'గారు సిద్ధాంతీకరించినట్లు రూపం ఉన్న చోటల్లా ఉత్తమ గుణాలుంటాయనిగానీ, కురూపతగల చోటల్లా దుర్గుణా

లుంటాయని గానీ అనడంలో సత్యంలేదు. 'రూపాన్ని బట్టి స్వభావం వుంటుందనేదే ప్రసిద్ధి' అన్న 'ఆంగీరస'గారి వాదం నిలువదు. 'ఆహారాన్నిబట్టి స్వభావముంటుందని ఒక సిద్ధాంతము' అన్న తాపీ వారిది పొరపాటని నిరూపించడానికి 'రూపాన్నిబట్టి స్వభావం వుంటుందనేదే ప్రసిద్ధి'—అని ప్రతి సిద్ధాంతం చేయబోయి 'ఆంగీరస'గారే అనవసరంగా పొరపాటు పడ్డారు. కనుక ఆహార స్వభావాలకు అవినా భావ సంబంధముంటుం దనడమే సిద్ధాంతం.

2. అచ్యుతరాయల వర్ణన పద్యం—'గెలిచిన గెల్పు లర్థితతికిన్ దినమిచ్చిన యీవులున్, వహుల్ తలంచిన......' (1—14) అన్న దానిలో శ్రీ తాపీ వారు గ్రహించిన పాఠం, వారుచేసిన వ్యాఖ్య పొర పాటని శ్రీ 'ఆంగీరస'గారి భావన. 'వహుల్ అనే ప్రథమాంతానికి ద్వితీయా విభక్తికి వుండే అర్థం చెప్పకోవచ్చునుగాని, 'వహులనుబట్టి' అనే పంచ మ్యర్థం గ్రహించడం సముచితంకాదు. ద్వితీయను గ్రహిస్తే 'లెక్కల పుస్తకాలను ఆలోచించగా' అనే అర్థమే వస్తుంది. లెక్కల పుస్తకాలను చూడడం సబబుగాని ఆలోచించడం సరికాదు. భాషా సంప్ర దాయానికీ, వినడానికీ అది విపరీతంగా తోస్తుంది. 'ఈవులన్ వహుల్' అనే పాఠానికీ, అర్థానికీ ఇక్కడ సందర్భశుద్ధి లేదనుకోవడం పొరపాట'ని వారు నిర్ణ యించారు. కానీ సామాన్యార్థ గ్రహణంలో వేదం వారు గ్రహించిన 'ఈవులన్ వహుల్ తలంచిన' అన్న పాఠమే మనకు నచ్చుతుంది. సందేహం లేదు. అయినా శ్రీ తాపీవారు మరొక్క అడుగుముందుకు వేసి తమ వ్యుత్పన్నతను ప్రకటిస్తూ 'ఈవులున్, వహుల్ తలంచిన' అన్నపాఠాన్ని గ్రహించి దానికి తగిన వ్యాఖ్యానం గావించారు. 'ఈవులున్, వహుల్ తలంచిన'–అన్నదానికి 'దానములును, వహుల్—వారి లెక్కల పుస్తకములను, తలంచిన—ఆలోచించినట్లు యితే'—అనే తాపీవారి వ్యాఖ్య సబబే! దీనికి 'దాన ములను, పుస్తకాలను (చూచి) ఆలోచించినట్లయితే' అనే అర్థం. అంటే 'చూచి' అన్న దిక్కడ అధ్యా హార్యంగా గ్రహిస్తే తప్పేమీ లేదు; పైగా అది సంప్రదాయ విరుద్ధమూ కానేరదు. కాబట్టి విశేషా ర్థాన్ని వెలికిదీసిన తాపీ వారు పొరపాటు పడ్డారను కోవడం సముచితం కాదేమో!

3. 'పైపయి కౌతుకంబు దయివాఱ యిటుం డఁగ......' (1—128) అన్న పద్యంలోని 'కల కలన్ నగుచుండెడి—' అన్నదానికి తాపీవారి వ్యాఖ్య ఉచితం కాదనీ, 'అన్వయ సరళి కాదనీ' ఇక్కడి కలకల పదం అవ్యక్తత్వాన్ని తెలుపుతుంది. అవ్యక్తమైన నవ్వు, మందహాసమే అవుతుంది. అది దాతలకు దానంచేసే సమయంలో సహజమైనదే!' అని తెలిపారు. 'ఆంగీ రస'గారన్నట్లు దాతకు మందహాసం సహజమే! ఆ విష యమే తాపీవారు—మందహాస మనకపోయినా–స్పష్టం చేశారు. ఇంక 'ఆంగీరస'గారు తలచినట్లు 'కలకల' పదం అవ్యక్తత్వాన్ని తెలుపుతుందనుకోవడం ఉచితం కాదు. కలకల శబ్దం ధ్వన్యనుకరణ పదం. ఇది నన్నెచోడుని కుమారసంభవంలోని 'కలకల నవ్వు నట్లు......' (5—119); పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్నంలోని 'కలకల నవ్వినట్లు...' (1—138) అన్న పద్యాలలో ఉన్నట్లుగానే. అదేవిధంగా గలగల, కిలకిల—వీటన్నింటికీ వ్యక్తమైన శబ్దమే అర్థం. దానం చేసే సమయంలో ఇలాంటి వ్యక్తమైన శబ్దాన్ని తొలగించడానికే శ్రీ తాపీవారు 'కలకల' పదానికి 'కళకళ లాడుతూ'అన్న అర్థం సూచించారు. ఏతావతా 'కళకళ లాడుతూ మందహాసంతో కూడిన' అన్నది సవ్యసాచికి విశేషణం అవుతుంది. ఇందులో దోషం లేదు!

4. ప్రథమాశ్వాసం 161 వ పద్యం 'అన విని పాపపూప జవరాలెదలో వలపోపలేక...'అన్న తాపీవారి పాఠమే సముచితం. కారణం—'వలపోపలేక' — అన్న దానిలో 'ఆపలేక—అణచిపెట్టుకోలేక' అనే అర్థం మాత్రమే వస్తుంది. కాని తాపీ వారు విశేషార్థ స్ఫుర ణార్థం 'వలపోప లేక' అంటే 'వలపును సహించలేక' అనే అర్థం వచ్చేందుకే ఈ పాఠం గ్రహించారు. 'వల పోపలేక' — అను ప్రాసానుగుణమై ఉందనడంలో సందేహంలేదు; ఇది సరైనదే. కాని దానికంటె మరి కొంత విశేషార్థం చెప్పడమే ఈ పాఠం గ్రహించడం లోని పరమార్థమని తలంచాలి.

5. ప్రథమాశ్వాసం 165 వ పద్యంలోని 'చిలువ చెలువంపుఁ బల్కులఁ జిలువ చెలువ'—అన్న నాలవ పాదంలోని దానికి తాపీవారి వ్యాఖ్య సరసంగా లేదని వాదించారు 'అంగీరస'గారు. జాగరూకతతో పరిశీలిస్తే ఇది సరసంగానే ఉన్నట్లు తోచక పోదు. 'చిలువ=నాగుపాము, చాల అందమయిన జంతువు. ఆ పడగా, కదలికా, శరీరమూ, ఎంత చూచినా చూడా లనే ఉంటుంది. కాని—భయము.

'దీనినిబట్టి చిలువ చెలువము అంటే 'భయము కలిగించే అందము' అవుతుంది. అటువంటి పలుకులు అంటే, అందముగా వినడాని కింపుగాఉండి, భయము కలిగించే భావముగల మాటలన్న మాట'—అన్నదాన్ని మాత్రమే 'అంగీరస'గారు ఉద్ధరించారు. దాని తరువాత తాపీవారు సమర్థించిన దాన్ని విస్మరించారు. అది ఎలాగో చూదాము.

'దీని తరువాత ఉలూచి చెప్పే రెండు పద్యాల లోనూ, ఆమె అభిలాష, సమర్థన, దీనత్వము అన్నీ అందంగానే ఉన్నాయని మనమంగీకరిస్తాము.

'ఆ మాటలలో గర్భితంగాఉన్న భావము (మరణమే నాకు గత్యంతరమన్న భావము) భయాన్ని కలిగిస్తుంది' అన్న తాపీవారి వివరణ పరిశీలించాక సరసంగా లేదనుకోవడం ఉచితంకాదు, దీనికితోడు 'అధృష్యశ్చాభి గమ్యశ్చ| యాదోరత్నైరివార్ణవః॥'—అనే రఘువంశం (ప్రథమ సర్గ) శ్లోకం సహకరిస్తుంది.

పూర్వ వ్యాఖ్యాతలన్నట్లు 'చిలువ' పదానికి 'చిలువలు పలువలుగల విలాసముతోఁ గూడుకొన్న పల్కులచేత' అనిన్నీ, 'చిలువలు పలువలు గలిగి చమత్కారమగు మాటలతో' అనిన్నీ అర్థాలు వ్రాశారు. చిత్రవిచిత్రంగా — చమత్కారంగా మాట్లాడుతున్నప్పుడు ఈ నానుడిని వాడడం పరిపాటి—అని 'అంగీరస'గారు సమర్థించారు. కాని 'చిలువలు పలువలు' అంటే లేనిది కల్పించి అనే అర్థంలోనే వాడుక. 'చిత్ర విచిత్రంగా' అని గ్రహించినా తప్పులేదు. కానీ 'చమత్కారం'మాత్రం కాదు. ఇంక 'ఎమెస్కో' వారు ప్రకటించిన విజయవిలాసంలో తత్సంపాదకుల పాఠం బాగున్నదంటూ 'అంగీరస'గారు అంగీకరించారు. నిజమే! అది అర్థం చేసుకోగలిగిన వారి ఉపజ్ఞత మీద ఆధారపడి ఉంటుంది. అంతమాత్రం చేత తాపీ వారి వ్యాఖ్యను సరసంగా లేదనడం సముచితం కాదేమో!

6. ద్వితీయాశ్వాసంలో 12 వ పద్యం లోని 'శృంగార కళా చిత్రాంగద యుతమగు నా చిత్రాంగద' అన్న దానిలో 'అంగద'—అనే పదానికి 'భుజకీర్తి' అని గాక 'అందె' అని గ్రహించాలనీ, ఎందుకంటే ఇదే ఆశ్వాసంలోని 15 వ పద్యంలోని 'రణచ్చరణాంగదంబులన్' అన్నచోట 'మోగుతున్న కలి అందె' అనే అర్థం వచ్చేట్లు ప్రయుక్తం కావడంవల్ల. అది సముచితమనీ తాపీవారి సముచిత వ్యాఖ్య. మొదట చిత్రాంగదను అలంకరించే సందర్భంలో చెప్పబడని అందెల గూర్చి తరువాత చెప్పడం ఉచితం కాదని తాపీవారి భావన ఎందుకంటే మొదట భుజకీర్తులు అలంకరించబడినవని చెప్పి, ఆ వెనుక ధరించబడని కాలి అందెలతో వచ్చిందనడం లో సొగసులేదని వారి తలంపు. అందుచేతనే తాపీవారి వ్యాఖ్యలో సొగసుంది. కానీ 'అంగీరస'గారు 'పూర్వవ్యాఖ్యాతలను ఆక్షేపించడం కోసమే అని అనుకోవలసి వస్తున్న'దని తలంచినట్లు కాదని స్పష్టం అవుతుంది.

7. చిత్రాంగదా సౌందర్య వర్ణన—'హరిపతి నడుమున కోడెన్। గరువపు నడకలకు నోడె గజపతి, యింక నీ। నరపతి లోనగు టరుదే వరవర్ణిని మెఱుఁగు వాఁడి వాల్చూపులకున్॥' (2—17) అన్న పద్యంలోని 'హరిపతి, గజపతి, నరపతి'—అన్న పదాలకు శ్రీ తాపీవారు చేసిన వ్యాఖ్య చమత్కార సహమై ఉంది. వాటికి విపరీతార్థాలు తీయడానికి ప్రయత్నించరాదు. హరిపతి, గజపతి—అన్నవి ఓడినవట! నరపతి ఓడడం కాదు—లో పడడం— ఎవరికో కాదు—'వరవర్ణిని మెఱుఁగువాఁడి వాల్చూపులకు.'

8. ద్వితీయాశ్వాసంలోని 'ఈ బిత్తరి ముద్దు నెమ్మొగము పిన్నమ పున్నమ చందమామకున్'—అనే (108) పద్యంలో 'పిన్నమ' అనే పదానికి తాపీవారు గావించిన వ్యాఖ్య సొగసైనది. ఆ పదానికి వేదంవారు వివరించినట్లుగాని, 'అంగీరస'గా రామోదించినట్లుగాని 'లక్ష్మి' అన్న అర్థం ప్రసిద్ధం కాదు. లేదా ఇది ప్రాంతీయమైన వాడుకైనా కావచ్చు, కాబట్టి 'అంగీరస'గా రారోపించినట్లు 'శాస్త్రిగారు 'అవు'నన్నది 'కా'దనడానికి తాపీవారు చేశారనడం సబబు కాదు.

9. తృతీయాశ్వాసంలో సుభద్రా వివాహ సందర్భంలోని 106 వ పద్యంలో 'పేరంటాండ్రురు మంత్రవర్ణ పఠనాప్తిన్,'—అన్న దానిలో వెనుకటి వ్యాఖ్యాతలు గ్రహించిన 'పేరంటాండ్రురు'— అంటే బహువచనం మీద బహువచనంగా గ్రహించడం ఉచితం కాదనీ, దానిని 'పేరంటాండ్రు + ఉరు మంత్రవర్ణ పఠనాప్తిన్'—అని పదవిభజన గావించి కవి హృదయాన్ని శ్రీ తాపీవారు ఆవిష్కరించారు. ఇందులో సొగసెంతేని గలదు. వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలు చేమకూరలో ఉంటే ఉండవచ్చు గాక. ఇక్కడ 'బహువచనముమీద బహువచన ప్రయోగము చేమకూర వేంకటకవికి అలవాటు లేని క్లిష్టప్రక్రియ,'— అని తాపీవా రనడం ఇలాంటి ప్రయోగం ఇదిగాక మరెక్కడా వాడలేదని అర్థమేగాని వేరు గాదు. ఇంక చేమకూర వేంకటకవి వ్యర్థప్రయోగాలకు అలవాటు పడలేదనడంలో విప్రతిపత్తి లేదు. కాని 'ఉరు మంత్రవర్ణ పఠనాప్తిన్' అని పదచ్ఛేదంచేసి, 'ఉరు' శబ్దానికి గొప్ప అనే అర్థం చెప్పడం బాగులేదనీ, మంత్రాలకు ఉచ్చనీచాలన్న భేదం లేదని 'ఆంగీరస'గారన్నారు. కాని ఇక్కడ 'ఉరు' శబ్దానికి 'మహిమాన్విత'మైన అని మాత్రమే అభిప్రాయపడ్డారేగాని 'గొప్పనీ, కొద్దినీ' అని వింగడింపునకై ప్రయత్నించలేదు.

10. తృతీయాశ్వాసంలోని 236 వ పద్యంలో శ్రీ తాపీవారు 'సురభి రక్షణకీర్తి సురభిళ దిఙ్మండలుండు' అని ఏకపదంగా గ్రహించారనీ, అది సరికాదనీ, 'తెలుపన్' పదానికి అన్వయం కుదరదనీ, కనుక ఏకపదంగా గ్రహించకూడదనీ — 'ఆంగీరస'గారు వ్రాశారు. కాని 'సురభిరక్షణ' వేరుగా చెప్పనక్కర్లేదు. తాపీవారు గ్రహించినట్లు ఏకపదంగా చెప్పినా దోషం లేదు. ఏదైతే సహదేవునకు విశేషణమో అదే తెలిపాడని మనం గ్రహించాలి.

11. అర్జునుని చక్కదనం వర్ణన. 'కమ్మని జాళువా నొరయఁ గల్గిన చెక్కులఁ జెక్కువాఁడు...' (1—135) అనే పద్యంలోని 'వెలగా కొను' అన్న పదానికి తాపీవారు వ్యాఖ్యానించినట్లు 'తెల్లదానిగా భావించు అనడం ఉచితంకాదని 'ఆంగీరస'గారి వాదం. 'వెల్ల శబ్దానికి ద్విత్వలోపం ఆమ్రేడితంలోనే కానవస్తుం'దన్న 'అంగీరస'గారి'మాట వాస్తవం. కాని ఇక్కడ తాపీవారి ఊహ విశేషార్థాన్ని సూచిస్తూంది.

12. ప్రథమాశ్వాసంలోని 141 వ పద్యమైన సీసపద్యపు ఎత్తుగీతిలోని దానిని 'కంట సరి (కుతి గంటు—కుత్తిగంటు) అనుకంఠాభరణమును అవివాహితలగు స్త్రీలు మాత్రమే ఉపయోగిస్తారనీ, అది ధరించిన కాంత కన్యక అనీ గ్రహించాలి —అని తాపీవారు వ్యాఖ్యానించారనీ, అది ఉచితంకాదనీ, 'అది కన్య, వివాహిత అనే భేదం లేకుండా స్త్రీలందరూ ధరించే కంఠాభరణమైనట్లు ప్రబంధాలవల్ల తెలుస్తున్న'దని 'ఆంగీరస'గారు వ్రాశారు. కానీ తాపీవారు ప్రాంతీయమైన వాడుకనే యిందు గ్రహించారేమో! దానిసైతం మనం దృష్టిలో ఉంచుకోవాలి గదా మరి?

13. ఇంక తృతీయాశ్వాసంలోని 'చందురు జోతి బాగడపు......' (189) పద్యానికి శ్రీ తాపీవారు వ్యాఖ్యానం వ్రాయక పోవడం వారి 'హృదయోల్లాస వ్యాఖ్య'కు లోపమే! కాని అందుకు ప్రయత్నించడం కేవలం 'ప్రయాస' అని మనవి చేసుకొన్నారు. అయినా వేదంవారి వ్యాఖ్యనే ఉద్ధరించారు. కాని అందులోను స్పష్టత తక్కువే. అందుకే వారు 'ప్రయాస' అని వ్రాయవలసి వచ్చింది.

14. ప్రథమాశ్వాసంలోని 193 వ సంఖ్యగల గద్యలో తాపీవారు 'అన్నపూర్ణ విశాలాక్షీ సనాథుం గాశీవిశ్వనాథుం దర్శించి' అన్నదాని వ్యాఖ్యలో 'అన్నపూర్ణను, విశాలాక్షిని' ఒకరిగానే గ్రహించడం ఏమరుపాటున జరిగిందనే తలంచాలి. లేకపోతే ఆ మాత్రం వారెరు గరా? కాని 'దర్శించి—పూజించి' అని తాపీవారు అర్థం చెప్పడం ఉచితంకాదని 'అంగీరస' గారనడం సముచితంకాదు. దేవతాదర్శనంలో 'పూజ' ఇమిడే ఉందికదా?

15. ద్వితీయాశ్వాసంలోని

'సీరియు నిటులా సౌనా
సీరియు నన్యోన్య సూక్తి హిత మానసులై
పోరాని కూర్మి నుండఁగ
నారాముని కడకు నంతహరి సనుదెంచెన్'

(—117)

—అనే పద్యంలో పూర్వవ్యాఖ్యాతలు 'జితమానసులై', 'సితమానసులై'—అన్న పాఠాల్ని గ్రహించి ఉండగా వాటిని త్రోసిపుచ్చి విశేషార్థ స్ఫురణార్థం శ్రీ తాపీ వారు 'హితమానసులై'—అనే పాఠం గ్రహించారు. ఇదెంతో సొగసుగా ఉందనడంలో సందేహంలేదు. కానీ ఇక్కడ 'ఆంగీరస'గారన్నట్లు యతికి గతి తప్పింది. ఇది ప్రామాదికమే. సందేహం లేదు. 'ప్రమాదో ధీమతా మపి'-అని ఉన్నది గదా? కానీ ఇలాంటి స్ఖాలిత్యాన్ని ఎత్తిచూపితే సహృదయతతో స్వీకరించగల విశాల హృదయులు తాపీవారు. ఇందుకు వారి 'విన్నపము' లోని-'ఇంకా నా వ్యాఖ్యానములో అసంతృప్తిగాని, సందేహముగాని, దోషముగాని కనబడినప్పుడు, నాకు వ్రాస్తే నేను చెప్పుకోవలసినది మనవి చేస్తాను. దిద్దుకోవలసినది దిద్దుకొంటాను. ఏవిధంగానైనా, చేమకూరకవి చమత్కారాలను ఆంధ్ర సాహిత్యపరులు సంపూర్ణంగా తెలుసుకోగలగడమే మన కందరకు వాంఛనీయము కదా?'— అన్నవారి చివరి వాక్యాలే పరమ నిదర్శనం!

ఈ విధంగా వినయం, విశాలదృక్పథం, సహృదయత గల శ్రీ తాపీవారు—శ్రీ 'ఆంగీరస'గారు భావించి నట్లు—కేవలం ఇతర వ్యాఖ్యాతలను ఆక్షేపించడానికే విశేషార్థాలు చూపి, పాఠాంతరాలు గ్రహించా రనుకోవడం ఏమాత్రం భావ్యం కాదన్న విషయం సహృదయ హృదయైక వేద్యం! పై పరిశీలన వలన ఇది స్పష్టం! పది దశాబ్దాలుగా బహుధా పరిశ్రమించి తాపీవారు కావించిన 'హృదయోల్లాస వ్యాఖ్య'లో తాము సముచిత మైనదని భావించి ప్రతిపాదించదలచినప్పుడు తత్పూర్వ వ్యాఖ్యాతల అభిప్రాయాల్ని—ముఖ్యంగా సమంజసం కాదని తలంచినప్పుడు—అనగా కవి హృదయావిష్కరణ కుపకరించనప్పుడు—కాదనడంలో దోషం లేదు. అది అధిక్షేపణా కాదు. ఉన్నవాటికి మరికొన్ని విశేషార్థాలను-ఉపజ్ఞతతో చెప్పినప్పుడు వాటిని మనం సహృదయతతో స్వీకరించడం సముచితమేమో! మరి సహృదయత సాహిత్యపరులకు అపరిహార్యగుణం కదా?



"నవ కుసుమితా......."

1972 అక్టోబరు భారతిలో కలగూరగంపలో శ్రీ కాశీభొట్ల సత్యనారాయణగారు 'చిర శ్రాంతో దూరాత్...' అనే శ్లోకంలో 'నవకుసుమితా' అనీ, 'నహి నహి నహి' అని మూడుసార్లు అనడానికీ నర్మగర్భితమని వారు అనుకున్న వివరణను చూచాను.

కుసుమ శబ్దానికి స్త్రీ రజస్సు అనే అర్థం అమరకోశంలో కనబడలేదు. విశ్వమేదినీత్యాది కోశాలలో ఉన్నదేమో పరిశీలించాలి. పుష్పశబ్దానికి స్త్రీ రజస్సు అనే అర్థం ప్రసిద్ధమే కాని, పుష్పశబ్ద పర్యాయ పదములన్నింటికీ ఈ విభిన్నార్థాలు ఉండవు కదా! పుష్పవతి, పుష్పావతి అనే పేరులు, విశేషణాలూ ప్రసిద్ధములు కాని, కుసుమవతి అని ఈ అర్థంలో వినలేదు. కనుకనే 'పుష్పితాగ్ర లతిక' అని ఈ నర్మాన్ని సూచించాలనే ఉద్దేశంతోనే కావాలనే ప్రయోగించాను నా అనువాదంలో.

అమరకోశంలో లేకపోయినా శబ్దరత్నాకరంలోనూ, దానికి మక్కికి మక్కి అయిన వావిళ్లవారి సంస్కృతాంధ్ర నిఘంటువు లోనూ కుసుమశబ్దానికి స్త్రీ రజస్సు అనే అర్థంకూడా వ్రాసి ఉన్నది కానీ, అవి ఎంతవరకూ ప్రమాణములో నిర్ణయించాలి.

ఆధునిక నిఘంటు ప్రమాణాన్ని అంగీకరించి, కుసుమశబ్దానికి రెండో అర్థాన్ని మాట వరసకి ఒప్పకుందాం. అయితే 'నవ కుసుమిత' అంటే ఏమి అర్థం? కొత్తగా, మొదటిసారిగా, పెద్దమనిషి అయినది అనికదా! ఆమె ముగ్ధ అయి ఉండాలి. మూడు రోజుల తరవాత ప్రియా సమాగమానికి తాను పనికి వస్తాననే టంత పరిజ్ఞానం ఆమెకి ఉంటుందా? కొందరు కుశాగ్రబుద్ధులకి ఉంటుందేమో మరి!

'అసలు ఈ మూడు రోజుల లెక్క ఎవరు వేసినది?' అన్నాడు నా మిత్రుడొకాయన ఆ ఉత్తరాన్ని, దానికి నేను ఇంతవరకూ వ్రాసిన సమాధానాన్నీ చూచి. అతడి కళ్లల్లో కొంటెతనం దాగడం లేదు.

'త్రిస్రో రాత్రీర్వ్రతం చరేత్' అని కృష్ణయజుర్వేదంలో 'విశ్వ రూపో వై త్వాష్ట్రః' అనే అనువాకంలో ఉంది లేవోయ్—అన్నాను నేను.

అంతేకాదు

ప్రథమేఽ హని చండాలీ
ద్వితీయే బ్రహ్మ ఘాతిని
తృతీయే రజకే ప్రోక్తా
చతుర్థేఽ హని శుద్ధ్యతి
చతుర్థేఽ హని శుద్ధాస్యాత్
భర్తుః సంభోగ కర్మణి

అని బుషి పంచమీ వ్రతకల్పంలో ఉంది అన్నాను.

'ఈ ఛాందసపు లెక్కలూ డొక్కలూ నేను నమ్మను. పండిత రాయలు అసలే నమ్మడు' అన్నాడు నా మిత్రుడు ఒక్కమాటలో అంతా కొట్టిపారేసి.

నేను చటుక్కున కాశీభొట్లవారి పక్షం అయిపోయి నా మిత్రుడిని ఎదుర్కొన్నాను.

అయితే నహి నహి నహి అని మూడుసార్లు ఎందుకు ప్రయోగించాడు అంటావు?' అన్నాను.

'ఛందస్సు కోసం.'

'అబ్బే. పండిత రాజుకి ఛందస్సు అడ్డు వస్తుందా?'

'అల్లా అయితే శివతాండవ స్తోత్రంలో ధగద్ధగ ద్ధగ జ్జ్వ లల్లాట పట పావకే అని మూడుసారు

ధగధగ మనిపించాడు కదా, దాని అర్థం ఫాలాక్షుని మూడో కన్ను ముచ్చటగా మూడుసార్లు మాత్రమే మెరిసి ఆరిపోయిందనా? దానిని తెలుగులో వ్రాసి నప్పుడు ధగధగమని రెండుసార్లు వ్రాయడమే మర్యాద.'

'అంతే నంటావా?'

'అంతేకాదు, వద్దువద్దు అని రెండు రోజుల తర్వాత రమ్మనే వ్యగ్రత్వమే బాగుంది సుమా!' అన్నాడు నా మిత్రుడు.

శ్రీ మహీధర నళినీమోహన్.

పండితరాయుల కారణ కల్పనలు

'భారతి' సెప్టెంబరు 1972 సంచికలో పండిత రాయల కారణ కల్పనలు అనుశీర్షిక క్రింద డా. మహీధర నళినీమోహన్ గారిచ్చిన కారణ కల్పనలు మనోహరముగా నున్నవి.

ఈ క్రింది పరామర్శను ప్రకటింపగలరు.

'వీణాప్యేక గుణేన...సంభావ్యతే' అను శ్లోకమునకు తెనిగింపులోను డా॥ మహీధర నళినీమోహన్ గారి వివరణములోను, ముత్యాల రాశులు వీణకు పొదుగుతారు అని చెప్పబడినది. వీణకు ఎక్కడయినను ముత్యాలతో నలంకరణ జరుగునా? మూలశ్లోకములో ఆ అర్థము లేదు. గుణము (తీగ, దారము) లేనియెడల ముత్యాలరాశి కూడ (ముత్యాల హారముగా నుండదు గావున) యువతి కుచ కుండల పరిరంభమునకు చాలదు. గుణము గలది గావున వీణ ఆ పని చేయగల్గినది. గుణములేని నాడు ముత్యాలరాశి కూడ ఆ పనిచేయ జాలదు అని యే మూలమందు కలదు.

శ్రీ వి. ఏ. కుమారస్వామి

పండిత రాయుల చివాట్లు

1972 అక్టోబరు భారతిలో డా॥ మహీధర నళినీమోహన్‌గారు రచించిన 'పండిత రాయల చివాట్లు' అన్న వ్యాసం చూసి సందేహ నివారణార్థం ఈ లేఖ వ్రాస్తున్నాను.

పండిత రాయలు హరిదీక్షితుల వారిమీద చెప్పిన అన్యాపదేశ చాటువులో కరిపోత! అన్న సంబోధన ఉంది. దీనిని నళినీమోహన్‌గారు కరిపిల్లా అని అనువదించారు. భాషపై వ్యాకరణ ప్రభావం మాట అటుంచి, శ్రవణపేయం అనే గుణం శబ్దానికి ఉండాలి కదా! ఈ మాట వింటే గూబకి గొడ్డలి దెబ్బలా లేదా! వ్యాకరణ విషయంగా ఆలోచించి దీనిని మిశ్రమ సమాసం అంటే అనవచ్చు. కాని మిశ్రమ సమాసంలో తెలుగు తత్సమ శబ్దాలలో ఏదో ఒకటి ముందుండ వచ్చు. ఇక్కడ కరిశబ్దం తత్సమమైన సంస్కృత మైనా ఒకలాగే ఉంటుంది. అందుకే అచ్చపు తత్సమ శబ్దమైన రాజు ముదల ఇత్యాదుల లోని శబ్దసారళ్యం ఇందు లేదు. కనుక కేవల వ్యాకరణ రీతినే కాక శ్రవణపేయం అనే గుణాన్నికూడ మనం చూడాలేమో అనిపిస్తుంది.

అలాగే వెంకటశాస్త్రి ఎవతె దగ్గరకో వెడితే రాయలు దానిమీద చెప్పిన చాటువులో 'సరజస్కాం' అని కేతకీద్వయానికి అనువదించేలా ఒక విశేషణాన్ని వాడేడు. అనువాదంలో ఆ మాటకు 'బహు రజోవతి' అని ఉంది. ఇది కేతకీ పుష్పార్థంలో విశేష ఔచిత్యంతో ప్రకాశించింది. కాని, కేతకీ వనితార్థంలో అందగింపలేదు. ఒక వనిత ఆ క్షణంలో బహు రజస్వల కాదు గదా! ఇక్కడ సమర్థనకి అందంలేదు కదా. ఇలాటి వాటినే క్షేమేంద్రుడు విశేషణ అనౌచిత్యం అంటాడు. ఇక్కడ అనువాదకుని దృష్టి పువ్వు మీదేగాని పూబోడిమీద లేకపోవటంవలన ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చు.

అలాగే కనకలాల్ మీద చెప్పిన ఒక చాటువులో ఖడ్గమృగాన్ని నిందుస్తూ 'మహిష ఇవ చతుష్పాజ్జంతు రేవాసి' అని అంటాడు. దీనికి అనువాదంలో 'మహిషమ్మును బోలె నాల్గు పాదమ్ముల క్రూర జంతువవు' అని ఉంది. ఇక్కడ వాక్య నిర్మాణక్రమం అందంగా లేదు. ఈ వాక్యమునుబట్టి నాల్గుపాదములు గల మహిషముకూడ క్రూరజంతువే అని తోస్తుంది. మూలంలో క్రూర అనే విశేషణమే లేదు. పైగా చతుష్పాజ్జంతు రేవా అన్న తరువాత అవ్యవధానంగా

అసి అనే క్రియ ఉండుటచేత ఇటువంటి ప్రమాదం సంభవింప లేదు. బహుశా ఇది క్షేమేంద్రుని వాక్య నౌచిత్యం వంటిదేమో. కనుక, సరళభాషతో చక్కని అనువాదం చేస్తున్న నళినీమోహన్‌గారిని ఈ ప్రమాదా లనుకూడ నిర్మూలించి నిర్దుష్టం చేయమని కోరు తున్నాను.

శ్రీ కాశీభొట్ల సత్యనారాయణ.

పొరపాటు

1972 అక్టోబరు 'భారతి' సంచికలో 'పండిత రాయల చివాట్లు' అనే వ్యాసంలో శ్రీ మహీధర నళినీమోహన్ చాలా విషయాలను గురించి తెలియ పరచారు. ఆ వ్యాసంలో శ్రీ వత్స వాయ తిమ్మ జగపతి రాజు గారికి సంబంధించిన 'ఆమూ లాగ్ర నిబద్ధ కంటక తనుః' అనే శ్లోకం ఇచ్చారు. తిమ్మకీ—తుమ్మకీ సంబంధం సముచితమే!. కాని తిమ్మ జగపతిరాజుగారు విజయనగర సంస్థాన ప్రభువు కారు. పెద్దాపుర ప్రభువు. అప్పటి విజయనగర ప్రభువు విజయరామ గజపతి. జగపతు లెప్పుడూ విజయనగరాన్ని పాలించ లేదు.

శ్రీ బు. వేం. రమణయ్య.

'ఆదేశ' శబ్దార్థ వివేచనము

శ్రీ ముదిగొండ ఈశ్వర చరణ్‌గారు పై శీర్షికతో 1972 అక్టోబరు భారతిలోఁ బ్రకటించిన వ్యాసము చూచిన తర్వాత నాకుఁ గలిగిన యభిప్రాయము నిట నుల్లేఖించు చున్నాఁడను.

వ్యాసకర్త్తగా రా వ్యాసములో 'ఆదేశ' శబ్దమును బాలవ్యాకరణ కర్త్త సూత్రములలో నేమి, వార్త్తికములలో నేమి, వివరణ వాక్యములలో నేమి యెన్నిమాఱులు ప్రయోగించినాఁడో వివరించుట సముచితమే కాని, 'ఆదేశ' శబ్దమునకు వారు పేర్కొనిన విశేషార్థము సమంజసముగ లేదు. 'ఆదేశో నామ శబ్దాన్తరస్య స్థానే విధీయ మానం శబ్దాన్తర మభిధీయతే' అని మల్లినాథ సూరిచే రఘువంశమునందలి 12 వ సర్గము 58 వ శ్లోకముయొక్క వ్యాఖ్యాన సందర్భమున 'ఆదేశ' శబ్దార్థము పేర్కొనఁబడినది. 'శత్రువ దాదేశః' అను దాని తాత్పర్యము నిదియే. చిన్నయ సూరి యభిప్రాయము గూడ నిందులకు భిన్నముగ లేదు.

'అర్థభేదమును గూర్చునది యాదేశ మనుట సూరికి సమ్మతము కాదు.' అని వ్యాసకర్త్తగారు నుడివి నారు. ఆదేశ మర్థభేదమును గూర్చుట వ్యాకరణ శాస్త్రమునఁ గానరాదు.

వ్యాసకర్త్తగారు తమ వ్యాసములో 'ఇఁక స్థూల దృష్టికి నా దేశములుగాఁ గానుపించు కార్యములు పెక్కులు గలవు.' అని 'ఇమి వర్ణకంబు కలుగ్వాదుల కగు.' 'తజ్ వర్ణకంబు చేయ్యాదులకగు' అను సూత్రముల నుదాహరించి 'కలుగు—కలిమి; చేయు—చేత'—ఇట్లుదాహరణముల నిచ్చి యున్నారు. కాని యిచ్చట ఇమి, తజ్ వర్ణకంబు లాదేశములే కావు. గ స డ దవలు, గ జ డ ద బ లు మున్నగువానివలె నివి స్థూలదృష్టికిఁ గూడ ఆదేశములుగఁ గానుపింపవలసిన యావశ్యకత లేదు. కృదంత పరిచ్ఛేదమునందలి ఇమి, తజ్ మున్నగు వర్ణకంబులు కృత్తులు.

'ధాతువునకు' అను క్రియా పరిచ్ఛేదము నందలి యధికార సూత్రము కృదంత పరిచ్ఛేదము నందును అనువర్త్తించును. కాఁగా, కృదంత పరిచ్ఛేదమునందు విధింపఁబడు కృత్ప్రత్యయములు ధాతువు కంటెఁ బరముగ భావకర్త్రాకర్మాద్యర్థ విశేషములలో వచ్చును. 'ఇమి వర్ణకంబు కలుగ్వాదులకగు.' 'కలుగు + ఇమి' అని యుండఁగా 'ఇట గృత్కగతప వేములు పరంబులగునపుడు క గ చ య వలకు లోపంబగు'— అను సూత్రముచే 'కలిమి' అను రూపము సాధ్యమగును. ఇట్లే చేయు—చేత; ఆఁగు - ఆఁక; ఆడు—ఆట మున్నగునవి యా యా సూత్రములచేఁ బ్రక్రియానుసారము సాధ్యములు. పేరు + ఇమి= పేరిమి,—ఇచ్చట 'క గ చ య వ' లలో నేదియు లేదు గావున నట్టిది జరుగ లేదు. కావున 'ఇమి, తజ్' మొదలైన కృత్ప్రత్యయములు వీనికిని ఆదేశములుగ విధింపబడునవి కావని స్పష్టమగుచున్నది.

పర్యాలోచింపఁగా బాల వ్యాకరణమునందలి 'ఆదేశ' శబ్దమునకుఁ బూర్వ వ్యాకరణములలో నిర్వచింపఁబడిన దానికంటెఁ బ్రత్యేకార్థ మేమియుఁ గాన వచ్చుట లేదని మనవి. విజ్ఞులు పరిశీలింపఁ బ్రార్థన.

శ్రీ గిద్దలూరు చెంచుబసవరాజు.

'ఆదేశ' శబ్దార్థ విచారణ

1972 అక్టోబరు 'భారతి' సంచికలో 'ఆదేశ' శబ్దార్థ వివేచనము'ను జదివిన తర్వాత విది వ్రాయవలసి వచ్చినది. శ్రీ పరవస్తు చిన్నయ సూరి పద్యాంధ్ర వ్యాకరణము, సూత్రాంధ్ర వ్యాకరణము, శబ్దశాసనము, శబ్దలక్షణ సంగ్రహము వను నాలుగు లక్షణ గ్రంథములను రచించి సిద్ధ హస్తుఁడయిన పిదప; 'బాలవ్యాకరణము'ను రచించి 1858 లోఁ దొలుతగాఁ బ్రచురించెను. చిన్నయ సూరి శబ్దచింతామణి వికృతి వివేకకారులు తీర్చిదిద్దిన సాంప్రదాయిక మార్గమునఁ దన పరిశ్రమకు సార భూతముగా బాలవ్యాకరణమును రచించి యుండుటచే, వెలువడిన దాది యది యవిచ్ఛిన్నముగఁ బఠన పాఠనములలో నిలిచి యాంధ్ర భాషాధ్యేతలకుఁ గరదీపిక య్యైనది.

బాలవ్యాకరణమునకు శేషగ్రంథముగ 'ప్రౌఢ వ్యాకరణము'ను, సంస్కృతానువాదముగ శిష్టుకృష్ణ మూర్తిశాస్త్రిగారి 'హరికారికలు'ను వెడలి యొక విధముగ దానికీర్తిమూర్తి నుద్దీపింపఁ జేసినవి. తదుపరి 'గుప్తార్థ ప్రకాశిక' మొదలు 'ఘంటాపథము' వఱకుఁ బెక్కు వ్యాఖ్యానములు రచింపఁబడి బాలవ్యాకరణము ప్రామాణికతను బెంపొందించినవి. బాలవ్యాకరణమున గ్రహింపఁబడిన సంజ్ఞలలోఁ బెక్కులు పాణినీయములు, కొన్ని శబ్దచింతామణీయములు, మఱికొన్ని యాథర్వణీయములును గలవు. అవికాక సూరి స్వోపజ్ఞము లైన సంజ్ఞలు డుమంతము, త్రికము, ముఙ్టు, ముత్తునని నాలుగు మాత్రమే. లాట్టు, లూట్టు, లజి వంటివియు మఱికొన్ని కలవు.

సూరికిఁగల పాణినీయ సంస్కార బలము వలన— 'అతిచారము, అతిదేశము, నిపాతము, ప్రత్యాహారము, ఉత్తమము, ఉపోత్తమము, బహుళము' మున్నగు సంజ్ఞలు, పరిభాషలు, నియమములు పెక్కులు బాల వ్యాకరణమునఁ జొచ్చినవి. వాని నన్నింటిని సమన్వయించు కొననిదే బాలవ్యాకరణమంత 'సుఖ సుఖాల' బోధ పడుఁదిగాదు. 'తదనుక్తస్య కార్యస్య వక్తా భవతి పాణినిః' అని కదా యథర్వణాచార్యులు వక్కాణించిరి!

'ఆదేశ' మనునది యొక పాణినీయ సంజ్ఞ. ఆఙ్ పూర్వకమైన 'దిశ్' ధాతువునకు ఘఙ్ప్రత్యయము చేరి 'ఆదేశ' మయినది. 'స్థానివ దాదేశోఽనల్విధౌ' అని పాణినీయము దీనిని నిరూపించినది. ఒకదాని స్థానమున వచ్చిన మఱియొక వర్ణాదికమునకు 'ఆదేశ'మని వ్యాకరణమున సంజ్ఞ. (సూర్యారాయ నిఘంటువు.)

'ధాతోః స్థాన ఇవా దేశం
సుగ్రీవం సంన్యవేశయత్' (రఘు—12—58)

అని కాళిదాసు తన రఘువంశ కావ్యమున సహృదయ రంజకమైన యొక యుపమలో నాదేశ సంజ్ఞ నుపయోగించినాఁడు. అథర్వణాచార్యులు 'ఆదేశాః కేవలాశ్చైషాం...' 'ఆదేశఃక్వచి దున్మాత్రవ్' ఇత్యాది గాఁదన వికృతి వివేకమునఁ బెక్కుకారికలలో 'నాదేశ' కార్యమును బ్రయోగించి నాఁడు. బాల సరస్వతీయమున 'శత్రువ దాదేశః. మిత్రవదాగమః' అనువ్యాకరణ న్యాయ ముద్ధరింపఁబడియున్నది. 'ఆదేశ' శబ్దము పుంలింగమే. కావున 'శత్రువదాగమనం ఆదేశవ్' అనుట కాకరము లేదు. అప్పకవియు నాదేశసంజ్ఞను (అప్ప. 5 వ ఆ.19) స్పష్టముగా వివరించియున్నాఁడు. శత్రువు వలెఁద్రోసి పుచ్చియాస్థానమునఁ జేరునవి యాదేశము లనియు, ఫాలమున నూర్ధ్వపుండ్రము వలె నదనముగాఁ జేరునవి యాగమములనియు 'స్థానే శత్రువ దాదేశా, ఫాలే పుణ్డ్రవ దాగమాః' అని ప్రాచీనులవివరణ.

ఇష్టరూప నిష్పత్తికయి, ప్రకృతి ప్రత్యయాదుల విభజనము చేసి, లోపాగమాదేశ వికారాది కార్యములను వైయాకరణులు సాధించు చుందురు. రూపసాధనకయి యాదేశములను విధించుటలోఁ బ్రకృతికి విధించుటయు, ప్రత్యయమునకు విధించుటయునని

రెండుతెఱఁగులు కలవు. 'తే, తేరులు తెచ్చున కగు' (క్రియా—93) అని 'తెచ్చు' అను ప్రకృతికి, తే, తేరు — అనునవి పర్యాయమున నాదేశింపఁబడినవి. 'లకారంబునకు డుఁ బు వురును ముఞ్ఞగు'(క్రియా—8) అని ప్రత్యయ లకారము స్థానమున డుఁబాదు లాదేశింపఁబడినవి. ఒకొకప్పు డాదేశము లేక దేశమునకు విధింపఁబడుట గాని, సర్వాదేశమగుట గాని జరుగు చుండును. సంధి కార్యాదులు జరుగు నపుడు పూర్వ పరములలో నెద్దానికైన నాదేశ విధానము జరుగ వచ్చును! 'గ స డ ద వా దేశము' పర పదమునను; 'పుంప్వా దేశము' పూర్వ పదమునను జరిగినవి.

బాలవ్యాకరణమున 'ఆదేశ' శబ్దము సూత్రములలోఁ బదితావు లందును; వివరణ వాక్యములలోఁ బదునాఱు తావులందును (క్రిందటి వ్యాసకర్త పేర్కొనిన పదునాలుగు తావులలోనేకాక– తత్సమ—63 వృత్తిలోను, అచ్చిక—31 వివరణము నందును) ప్రయుక్తమైనది.

చిన్నయ సూరి ఫక్కి గంభీరమయినది. రవంత యేమఱుపాటు చూపినఁ గొండంత విషయము దాఁటి పోవును. 'ఐకారం బీ తుల్యంబు' (తత్స—65) 'బల్లి దాదులు సంస్కృత తుల్యంబులు' (అచ్చి3.) మున్నగు పెక్కు నతి దేశ సూత్రములు వ్రాయఁ బడినవి. ఆ సూత్రము లందతి దేశమని నిర్దేశము లేకున్నను, ఇతర స్థలములందుఁ జూపిన 'అతి దేశ' వివరణమును బట్టి పూర్వోక్తసూత్రముల యొద్దఁగూడ 'అతి దేశ' కార్యములు చేసికొనఁ బడుచున్నవి. 'ప్రథమమీఁది పరుషములకు గసడదవ లగు' (సంధి—13) నను సూత్రమున 'ఆదేశ'మని లేకున్నను; 'అతఁడు వలికె' నిత్యాదు లందున్న పాదేశ వకారమని (సంజ్ఞా—18 వృత్తి) పేర్కొని పరుషముల స్థానమున గసడదవ లు వచ్చుట యా దేశమే యని బోధించినాఁడు. 'ద్రుతప్రకృతికము మీఁది పరుషములకు సరళములగు' (సంధి—16) నని విధించి, వెన్వెంటనే 'ఆదేశ సరళములకు ముందున్న...'(సంధి—17) అని సూత్రారంభము చేసి పైసూత్రమున విధించినది 'గజడదబాదేశము' సుఁడీ యని చెప్పుచున్నాఁడు. వీనిని బట్టి 'ఆదేశ'మని పేర్కొని నను బేర్కొన కున్నను, 'ఆదేశ' కార్యము జరుగు తావులను సాంప్రదాయికముగా గ్రహించునది యని సూరి తాత్పర్యము. వాస్తవ మిట్లుండ, 'క్షుణ్ణ' మైన సామాన్యార్థమునఁ గాక విశేషార్థమున సూరి దీనిని వాడి యుండెననుటకు హేతువు కాన రాదు.

'స్వార్థదృష్టికి నాదేశములుగాఁ గనిపించు కార్యములు పెక్కులుగలవు' అని కృదంత పరిచ్ఛేదము నందలి—కలుగు—కలిమి, చేయు—చేఁత— మున్నగు స్వరూపాసిద్ధముల నుదాహరించి, '...అర్థ భేదమును గూర్చినది యాదేశమనుట సూరికి సమ్మతముకాదు' అని వ్యాసకర్త నిర్ణయముచేయుట సోపపత్తికముగా లేదు. 'ఇమి' వర్ణకంబు, 'తజ్వర్ణకంబును నా యా ధాతువులకుఁ జేరిన వనుచుండఁగా; 'కలుగు— కలిమి' 'చేయు చేఁత' అర్థ భేదము నరయ నగునని హెచ్చరించుట;–'రాము— రాముచేత' ఇట్టియెడ రూపభేదము మాత్రమే కాక యర్థ భేదమునుగలదు కావుననే యిట్టి యెడ సూరి యాదేశ శబ్దమును గూర్పలేదనుటవంటిది. ప్రకృతికిని, ప్రత్యయ సహితమైన సిద్ధరూపమునకును నర్థభేద మెచ్చటనైన గోచరించును. 'ఇమి' 'తజ్' మున్నగు ప్రత్యయముల నా దేశములని యెవ్వరనిరో తెలియదు. 'ఆ దేశము'లగుచో నేని స్థానమున వచ్చినవి? ఆ దేశములు కానిచో వానిని బట్టి 'ఆదేశ' శబ్దమునకు విశేషార్థమును రాఁబట్ట యత్నించుట యేల?


'స్థాన్యర్థాభి ధాన సమర్థస్యైవా దేశతా' అని సిద్ధాంతము. ఒకానొక యాదేశ విధానమున వలయుచో నర్థవిశేష ద్యోతనమును వ్యాకర్త యుద్దేశింప వచ్చును. ఆ దేశ శబ్దార్థము దానికి బాధకము కాదు. వ్యాస విస్తరభీతిచేఁ గొన్ని యుదాహరణములు మాత్రమే యియ్యఁబడు చున్నవి. 'అమహదర్థంబు నందు డుమ్రు లకు దువులగు నున్నాను బంధంబు మీఁద దివి యగు' (క్రియా—12) అని డుజ్ — రు ల స్థానమున దు—వు ల యాదేశము జరిగినది. 'వండఁడు—వండదు' అనువానికిఁగల యర్థభేదమును గమనించు నది, ఈ

'దు' ఆ దేశము కాదందువా? 'లిడ్లాట్టుల డుజ్జున కెను ను వర్ణంబు లగు' (క్రియా 19) అని 'లిడాదేశంబగు డుజ్జునకు—ఎను—అనునదియు, లాడా దేశంబగు డుజునకు—ను—అనునదియు నా దేశంబులగు' నని 'డుజు' స్థానమున వచ్చిన ప్రత్యయాంతరమును 'ఆ దేశమని సూరి కంఠోక్తిగా నాదేశించుటను గుర్తించు నది. 'అమహదర్థంబునందు' — అని సూత్రకర్త యెలుఁగెత్తి చెప్పుచుండ, 'దు—వు లాదేశములే గాని యర్థభేదము లేదనుట యెట్లు?

కలుగు ధాతు వునకు—అస్త్యర్థము, ప్రాప్త్యర్థము రెండును గలవు. 'కలుగు' న కస్త్యర్థంబునందు లట్టు పరంబగునపుడు కలయగు. (క్రియా—104). ఇది యాదేశము కాదందువా? ప్రక్కసూత్రము ననే 'కలా దేశం' బని పేర్కొనఁ బడినది. కావున— కలుగునకు లట్టు పరంబగునపుడు 'అస్త్యర్థంబు నందు మాత్రమే 'కల' యాదేశమగుచున్నది. 'నిందయం ద్రావేడి తంబు నాద్యక్షరంబులకు హ్రస్వ దీర్ఘంబులకు గి గీ ల గు' (ప్రకీ—22) ఈ గి, గీల యా దేశము నిందార్థము నందే యగు నని 'కుంభకర్ణుఁడు—గింభ కర్ణుఁడు; రావణుడు—గీవణుఁడు' అని సూరి కోప పడుచుండఁగా—'.. అట్టిదానిచేత నర్థభేధము సైతము గలుగ రాదనుటయే సూరి యాశయమనుటకు 'ఆస్కా రము' లేదు.

కావున— 'ఆదేశ' శబ్దార్థమర్థభేద వివక్షా నిరపేక్షమనియు; ఆదేశమను సంజ్ఞను వ్యాకరణ శాస్త్ర ప్రహతమగు నర్థముననే సూరి ప్రయోగించె ననియు; ఆదేశము వచ్చునపుడు వలయుచోఁ గ్వాచిత్క ముగాఁ గొంత యర్థభేదము సైతము గలుగుట సూరి కభిమతమే యనియు స్పష్టమగుచున్నది.

శ్రీ పరాశరం గోపాలకృష్ణమూర్తి.



గ్రంథవిమర్శలు

ఆంధ్ర దేశ చరిత్ర–భూగోళ సర్వస్వం

(సంపాదకులు — ఖండవిల్లి లక్ష్మీరంజనం ఎం. ఏ., వెల: 25 రూపాయలు, ప్రచురణ—ఆంధ్ర రచయితల సంఘం, హైద్రాబాదు)

ఆంధ్ర రచయితల సంఘం, హైద్రాబాదు వారు—'ఆంధ్రదేశచరిత్ర—భూగోళ సర్వస్వం' సంకలనంచేసి, ప్రచురించ సమకట్టడం చాల ప్రశంసనీయం. ఇప్పుడు మొదటిసంపుటం వెలువడింది.

రమారమి నూరేళ్లుగా 'ఆంధ్రదేశ చరిత్రాంశాల్ని వెతికి వెలికి దీసే ప్రయత్నం సాగుతూంది. తెలుగు వాడికి తెలుగుమీదకన్న సంస్కృతం మీద మోజు ఎక్కువగా వుండడం, ఆమోజు మూర్ఖంగా తయారయి వూళ్ళపేర్లూ, ఇంటిపేర్లూ వ్యవహారంలో వున్న వాటిని వదలి, సంస్కృతీకరించే దురలవాటు ఏర్పడడంతో అసలే అంతంతగావున్న మనదేశచరిత్రాధారాలు మరింత గంద్రగోళం అయాయి. దానికి ప్రాంతీయ దురభిమానాలు తోడయి పోతన ఒంటిమిట్టవాడా, వరంగలు వాడా, శ్రీనాధుడు నెల్లూరు వాడా, గుంటూరువాడా అన్న కుస్తీలు బయలు దేరి మరింత గాడిద గత్తర చేశాం. అయినా ఎందరో పాశ్చాత్య చరిత్రకారులూ, ఆంధ్రదేశ చరిత్రకారులూ కూడ విశేషశ్రమకోర్చి అనేకానేక అంశాలు బయటకు లాగేరు. వానిని ఎప్పటి కప్పుడు ఏవేవో పత్రికలలో వ్యాసాలుగా ప్రచురించేరు. కాదాచిత్కంగా పుస్తకాలు గానూ వెలువడ్డాయి. అయితే ఏవిషయం తేలింది? ఇంకా తేలవలసిం దేమిటి? మొదలైనవి కొత్తవాళ్లు తెలుసుకోడం అసాధ్యమయిపోయింది. దేశచరిత్రమీద ఇతోధిక పరిశోధన జరగాలన్నా ఇంతవరకు జరిగిన కృషి ఫలితాన్ని ఏకత్రచూపే సంకలన గ్రంథం—సరస్వం—లేకపోవడం పెద్దలోటుగానే వుంది. చేసిన పనేచేస్తూ కాలం, ధనం దుర్వ్యయం కాకుండా చెయ్యాలంటే ఇటువంటి సర్వస్వం కావలసి వుంది. ఆ లోటును భర్తీచేయబూనుకొన్నది ఆంధ్రరచయితల సంఘం. వారికి నా ధన్యవాదాలు.

ఈ మాదిరి ప్రయత్నం ప్రారంభంలోనే సమగ్రంగా వుండడం సాధ్యమయ్యే పనికాదు. దాని పరిమితులు దానికుంటాయి. సాధన లోపం. మనుష్య లోపం ఎన్నో. వానిని క్రమేణా దిద్దుకోవలసిందే. దిద్దుకొనేందుకు నిర్మాణాత్మకము అయిన సూచనలివ్వడం మన కర్తవ్యం.

ఈ గ్రంథంలో చరిత్ర—భూగోళ ప్రాధాన్యత గల ప్రదేశాలను గురించి చెప్పడంలో ప్రతిచోటా అనవసరమైన పునరుక్తి ఏర్పడి స్థలాన్ని మింగేసింది. ఉదాహరణకి అద్దంకి, అనంతపురంవంటివాని భౌగోళికాంశాలకూ, చారిత్రకాంశాలకూ వేర్వేరు వ్యాసాలు వ్రాయడంవలన కొన్ని అంశాలు పునరుక్తం అవుతున్నాయి. రెండు భాగాలుగా పుస్తకం విభజితం అయి వుంటే ఇది తప్పదు. కాని ఒకే చోట వరసలో వ్రాస్తున్నప్పుడు ఈ పునరుక్తినుంచి బయటపడడం కష్టం కాదు. పుటలు చాలా కలిసి వస్తాయి.

కొన్ని ప్రదేశాలకు ఇవ్వవలసిన ప్రాముఖ్యం, వివరణ, విశేషాలు ఇవ్వబడలేదు. ఉదాహరణకి— అంబాజీపేట. అమలాపురం తాలూకా వివరణలో ఈ వూరును పేర్కొనడం, అయిదారు పంక్తులు వ్రాయడం జరిగింది.కాని, వానిలో దీనికిగల ప్రాముఖ్యం ద్యోతకం కావడం లేదు.

అంబాజీపేట గోదావరి సెంట్రల్ డెల్టాలో కీలకమైన రహదారుల కేంద్రం. 15–20 వూళ్ళకి అతిముఖ్యమైన సంత ప్రతి బుధవారం జరుగుతుంది. అదే రోజున పెద్ద పశువుల సంత వుంటుంది. తూర్పు, పశ్చిమ గోదావరులలో జరిగే ప్రధానమైన పశువుల సంతలలో అదొకటి. ప్రతి వారం కొబ్బరి సంత ఒకటి జరుగుతుంది. డెల్టాలో ప్రధానమైన వాణిజ్య పంటలలో కొబ్బరి ముఖ్యం. దాని ధరల నిర్ణయం ఈ సంతలో తేలుతూంటుంది.

ఈ దృష్ట్యా దీనికి గల ప్రాధాన్యాన్ని సర్వస్వంలో చూడం.

ఇక్కడనే మరొక విషయం చెప్పాలి. అరుణాచల క్షేత్రం గురించి ఈ సర్వస్వంలో పేర్కొనడం అనుచిత మనాలి. అది తమిళదేశంలోనిది. వ్యాస ప్రథమ వాక్యంలోనే ఆ సంగతి వుదాహరించేరు. మరెందు కిది ఈ సర్వస్వంలోకి వచ్చినట్లు? సరిహద్దు లోని భారత భూభాగాలను పాకిస్తాన్, చైనాలు తమ దేశ వర్ణాలలో చిత్రించి నందుకు మనం అభ్యంతరం చెప్పేం. అరుణాచల క్షేత్రం మీాద భక్తి, రమణ మహర్షిమీాద తాత్పర్యం వుండడంలో తప్పు లేదు. కాని 'ఆంధ్రదేశ చరిత్ర—భూగోళ సర్వస్వం'లో దానికి స్థానం లేదు. ఇటువంటివి అశ్రద్ధ చేయవలసిన విషయాలు కావు. ఇరుగు పొరుగుల మధ్య తంపులు తెచ్చే కొరవులు ఇట్లాంటివే.

ఇంతకన్న చాల అభ్యంతరకరమైనది—కేవలం రచయిత భయం, ప్రాతికూల్యంతో ఇటీవలి తెలుగు దేశ చరిత్రకు సంబంధించిన వాస్తవాన్ని కప్పిపుచ్చిన ఘట్టం సంపాదకుల దృష్టికి తీసుకురాదలచేను. ఇది 'అంజుమనె ఇత్తెహాద్ ముసల్మీన్' వ్యాసంలో విషయం. ఈ సంఘం 1947 లో రజాకారు సంస్థను నిర్మించింది. దానిలోకి నైజాం సంస్థానంలోని ముసల్మాను యువకుల్నే గాక, పైనుంచి కూడా రిక్రూట్‌చేసి తెచ్చింది. అరబ్బులూ, రోహిల్లాలు కూడ చేరారు. ఒక దశలో వీరి సంఖ్య 4 లక్షలుంది. నైజాం ప్రభుత్వం ఆయుధాలు ఇచ్చింది. వత్తాసు ఇచ్చింది. ఈ మూకలు తెలంగాణా జిల్లాలలో నానా బీభత్సం సృష్టించేరు. ఈ వివరాల నిస్తూ రచయిత ఆ జిల్లాల నుంచి కొందరు తలదాచుకొనేందుకు సరిహద్దులు దాటి పారిపోయారనీ, మిగిలిన వారు జీవన్మృతుల వలె స్వస్థానము లందే పడివుండిరనీ, 1948 సెప్టెంబరు 18 న భారత సైన్యాలు నిజాము సంస్థానంలో ప్రవేశించి ప్రజలను విముక్తి చేశాయనీ వ్రాసేరు.

ఇది జరిగిన చరిత్రను వక్రంగా చిత్రించడమూ, తెలుగు జాతినే అవమానపరచడమూను.

ఆ నాడు రజాకారు మూకల అల్లర్లకు భయపడి పారిపోయిన వారు కొందరున్నా చరిత్రలో ప్రధానంగా పేర్కొనవలసిన ఘట్టం అదికాదు. తెలంగాణా ప్రజ ఆ దురంతరాల్ని ప్రతిఘటించింది. వారంతా జిల్లాలోనే వున్నారు, జీవచ్ఛవాలలా మాత్రంకాదు. పెద్దపులు లల్లేనే వున్నారు. కష్టాలూ, బాధలూ పడ్డారు. కాని తుపాకీ తీసుకు నిలబడ్డారు.

వెట్టి వ్యతిరేక వుద్యమంలో నాయకత్వం వహించిన ఆంధ్ర మహాసభ ఆ ప్రజల ప్రతిఘటనకు నాయకత్వం వహించింది. అదే ప్రజల నోట 'సంగం' అయింది. సంగం ప్రజాప్రతిఘటనకు సంకేతంగా విస్తరించింది. అభ్యుదయవాదులైన కొందరు కాంగ్రెసు వాదులూ, మొత్తం కమ్యూనిస్టుపార్టీ ఆ ప్రతిఘటనను నడిపేయి.

నైజాం, రజాకారు మూకలకు వ్యతిరేకంగా సాగిన ఈ ప్రజా పోరాటం రమారమి '45 నుంచీ సాగుతున్న ఫ్యూడల్ వ్యతిరేక పోరాటపు తరవాయిగానే సాగింది.

నల్లగొండజిల్లా, వరంగలు జిల్లాలో అధిక భాగం (నేడది ఖమ్మంజిల్లాలో వుంది), ఆ నాడు నిజాం స్వంత జాగీరయిన ప్రస్తుత హైద్రాబాదు జిల్లా, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని ప్రాంతాలలో ప్రజాప్రతిఘటన విజయాలు పొందింది. పోరాటాలు హైద్రాబాద్ నగరం పొలి

మేరలకు పాకింది. మొత్తం నాలుగువేల గ్రామాలలో నిజాం ఫర్మాన్ చెల్లని స్థితి ఏర్పడింది. ఈ గ్రామాలలోని 10 లక్షల ఎకరాలు పంపిణీ అయాయి. 4–5 వందల మంది పెట్టన గాని రజాకార్లు వూళ్ల మీదికి రాలేని ఘట్టం వచ్చింది. వాళ్ల శిబిరాల మీదనే ప్రజాబళాలు దాడిచేసి ధ్వంసం చేయడం ప్రారంభం అయింది.

ఈ ప్రతిఘటన పెరిగి వుద్యమం ఇతర ప్రాంతాలకు కూడా పాకనారంభించింది.

'జీవన్మృతు'ల మాదిరిగా కాలం గడిపినవారు ఆ రోజులలో లేరనను. కాని అది ప్రజల విషయంలో చెల్లదు. అటువంటి జీవన్మృతులు కొద్దో గొప్పో ఎక్కడా, ఎప్పుడూ వుంటారు. వారి సంగతి పుస్తకాల కెక్కదు. ఆ అవసరమూ లేదు.

సంస్థగా కాంగ్రెసు పాత్ర పై పోరాటాలలో స్వల్పం. వ్యక్తులుగా కాంగ్రెసు వాదులు సానుభూతి, సహాయా లిచ్చేరు. అది వేరు మాట.

నిజాం స్వాతంత్ర్య ప్రకటనను కాంగ్రెసు సంస్థ వ్యతిరేకించింది. సంస్థానం యూనియనులో చేరాలని కోరుతూ సత్యాగ్రహం చేసింది. మిగిలిన ఆశయాలూ, వాగ్దానాలూ ఏమన్నా వున్నా దాని పోరాటం కేవలం రాజకీయ రంగానికి మాత్రమే పరిమితం. సత్యాగ్రహ పోరాటం నడపడానికై కాంగ్రెసు వాదులు సంస్థానం వెలుపల శిబిరాలు ఏర్పరచుకొన్నారు. దానిని కూడా పారిపోవడంగా చెప్పడానికి వీలులేదు. నిజాము సంస్థాన ప్రజల ప్రతిఘటన పోరాట రూపాలలో సత్యాగ్రహం ఒకటి. పోరాటం స్వభావాన్ని పట్టి దానిని నిర్వహించే ఏర్పాట్లు చేసుకుంటారు.

అయితే ఇక్కడ ఒక విషయం స్పష్టంగా వుంచుకోవాలి. దానిని ఏక్కేస్తే మన అభిమానాలూ, ద్వేషాలు అనుకోని సందర్భాలలో బట్టబయలవుతూంటాయి.

కాంగ్రెసు నడిపినది కేవల రాజకీయమైన పోరాటం అని పైన చెప్పేను.

తెలంగాణా ప్రజలు తుపాకీ తీసినది నిజాముకూ, రజాకారు మూకలకూ వ్యతిరేకంగానే కాదు. వారికి సంఘంలో పునాదిగా వున్న ఫ్యూడల్ వ్యవస్థను, సాంఘిక నిర్మాణాన్నికూడా నిర్మూలిస్తే తప్ప లాభం లేదని అశేష ప్రజానీకంచేత 'నీ బాంచను. కాల్మొక్తా' ననిపిస్తున్న వ్యవస్థను నిర్మూలం అయి నిజంగా స్వతంత్రులు కావాలనీ,

దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుజు లోయ్

అన్న మహాకవి హెచ్చరిక యదార్థం కావాలనీ కమ్యూనిస్టులు ఆ వుద్యమ సారథ్యం వహించేరు.

'అంజు మనె ఇత్తహాద్ ముసల్మీన్' గురించీ దాని ఉత్థాన పతనాల్ని గురించీ వ్రాస్తున్నప్పుడు చెప్పవలసింది ఇది. యూనియన్ సైన్యాలు రజాకారు దురంతాల నణచడానికి రాలేదు. ఆ క్రియ ప్రాసంగికం. కేంద్రప్రభుత్వం నైజాం సంస్థానం స్వాతంత్ర్య ప్రకటనను అంగీకరించి గుండెలమీద కుంపటి వుంచుకో దలచలేదు. వారి లక్ష్యం అంతవరకే ననీ, సామాజిక వ్యవస్థను మార్చడం వారి వుద్దేశం కాదనీ, ఆనాటినుంచి నేటివరకు నడిచిన చరిత్ర చెప్తూంది. అందుచేత ఈ వ్యాసంలో ప్రసక్తం కావలసింది ప్రధానంగా ప్రజల పోరాటాలు. అవే లేవు. దిఙ్మాత్రంగా మానె, సూచనగా నైనా ఇవ్వలేదు. ఇది మరుపు అనలేము. చరిత్రకారులకు వుండదగని భయమూ, ప్రిజిడిసూ తప్ప వేరు కాదు.

సంకలన కర్తలు ఇంత ముఖ్యమైన దానిని గమనించక పోవడం ఆంధ్రజాతిని అవమానిస్తున్నా నిర్లక్ష్యం చేయడమే అవుతుంది.

ఆంధ్రత్వ మాంధ్ర భాషా చ

నాల్పస్య తపసః ఫలం॥ — అంటూ తాము చేసిన ప్రతిజ్ఞ కది గౌరవప్రదం కాదు.

పుస్తకంలో చిత్రపటాలు చేర్చి వస్తు పుష్టి కలిగించాలని సంపాదకులు చేసిన ప్రయత్నాన్ని ముద్రాపకులు చాలవరకు వ్యర్థం చేసేరనే చెప్పాలి. చాల భాగం చిత్రాలు గుర్తించడానికి లేకుండా ఛాయా మాత్రంగా వున్నాయి. ఆ చిత్రాలను ఆర్ట్ పేపరు మీాదనో, చిత్ర వివరాలు తెలిసేలా ముద్రించడానికి అనువయ్యే మరో కాగితంమీాదనో, సమర్థవంతంగా పనిచెయ్యగల ప్రెస్సులో ముద్రింపించి చేరుస్తే శ్రమ సఫలం అవుతుంది.

ఆంధ్రదేశ పటము, తాలూకాల (అయా సందర్భం కలిగిన చోట) పటాలు చేర్చడం చాల వుచితం.

ఇది 'అ' మొదలు అల్నా వరకూ వున్న ప్రథమ సంపుటం.

డబుల్ డెమ్మీ సైజులో, చక్కని కాగితం కాలికోబైండుతో, రమారమి 700 పుటలు (10+29+646) పుటలుగల ఈ కోశ గ్రంథాన్ని 25 రూ.ల కివ్వడం ప్రస్తుత పుస్తక వ్యాపారుల రేట్లదృష్ట్యా చూసినా చాలా చవక.

మరొకమారు ఈ బృహత్కార్యాన్ని భుజాన వేసుకొని, మనకున్న ఒక పెద్దలోటును తీర్చబూనుకున్న సంపాదకులకూ, ఆంధ్రరచయితల సంఘానికీ ధన్యవాదాలు అర్పిస్తున్నా.

'అవంతి'.

లక్షణసార సంగ్రహము

(కూచిమంచి తిమ్మకవి ప్రణీతము. పరిష్కరణ : శ్రీ కోవెల—సంపత్కుమారాచార్య, తెలుగుశాఖ, ఆర్ట్సు అండ్ సైన్సు కళాశాల, జగిత్యాల, కరీంనగరము. డెమ్మీ 81+241+71 పుటలు. వెల రూ. 6 లు. ప్రకాశకులు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కళాభవనము, సైఫాబాదు, హైదరాబాదు—4.)

బహుళ గ్రంథకర్త, గొప్ప లక్షణవేత్త అయిన కూచిమంచి తిమ్మకవి ఒక ప్రామాణిక లక్షణగ్రంథాన్ని రచించాడు. అది 'సర్వలక్షణసార సంగ్రహం'గా ఇంతవరకూ వాడుకలో ఉన్నది. దాన్ని 1914 లో శ్రీ నందిరాజు-- చలపతిరావుగారు తమ మంజువాణీ ముద్రాశాలలో ఆ పేరుతోనే ముద్రించి ప్రకటించారు. తర్వాత మరోముద్రణం వెలువడ లేదు. ఆ తొలి ముద్రణపు ప్రతి అయినా ఇప్పుడు లభించదు ఆం. ప్ర. సాహిత్య అకాడమి వారు దానిని చక్కగా పరిష్కరింప జేసి, ఎంతో అందంగా ముద్రించి అందరికీ అందుబాటులో ఉండేటట్లు చాలా తక్కువ వెలను నిర్ణయించారు. ఇది ఎంతో ప్రశంసనీయమైన విషయం.

దీనిని పరిష్కరించిన శ్రీ సంపత్కుమారాచార్యగారు అనుభవజ్ఞులైన గట్టిపండితులు. ఉత్తమ విమర్శకులు. ఛందో వ్యాకరణాలలో చక్కనికృషి చేసి, అనేక విషయాలను ఆంధ్ర సాహిత్య లోకానికి అందించారు. అయనకు ఈ లక్షణగ్రంథాన్ని పరిష్కరించి ప్రకటింపజేయాలనే పట్టుదల కలిగింది. తత్ఫలితంగా సుపరిష్కృతమైన ఈ గ్రంథాన్ని అకాడమీ వారిచేత ప్రకటింపజేశారు. దీన్ని పరిష్కరించేటప్పుడు పెక్కుతాళపత్ర ప్రతులలోని పాఠాలను పరిశీలించారు. తిమ్మకవి గ్రంథానికి పెట్టిన పేరు 'లక్షణసార సంగ్రహం' కాని, 'సర్వలక్షణసార సంగ్రహం' కాదని ఆయనే నిరూపించారు.

మన లక్షణ గ్రంథాలు పూర్వం పద్య రూపంగానే ఉండేవి. గ్రంథకర్తలు లక్షణాలను వివరిస్తూ, ఉదాహరణలను కూడా సొంతంగా చూపడం పరిపాటి. ముద్దరాజు రామన్న, అప్పకవి వంటి ఒకరిద్దరు తప్ప తక్కిన వారు తమకు ప్రాచీనులైన కవుల గ్రంథాల

నుండి లక్ష్యాలను చూపలేదు. వీటిలో కవిసంజీవని చాలా చిన్న పుస్తకం. అప్పకవీయంలో ఛందస్సుకే ప్రాధాన్యం ఇయ్య బడింది. వ్యాకరణాంశాలు స్వల్పంగా ఉన్నవి. వ్యాకరణాంశాలను విపులంగా తెల్పి, ఉదాహరించిన గ్రంధం ఈ తిమ్మకవి కృతి మాత్రమే కానవస్తున్నది. 181 పుటల గ్రంధభాగంలో ఛందస్సును గురించిన పుటలు 35 మాత్రమే. తక్కిన గ్రంధ భాగం వ్యాకరణానికి సంబంధించినది.

మూడాశ్వాసాల యీ గ్రంథంలో ప్రథమాశ్వాసంలో తత్సమ, తద్భవాలూ, అచ్చతెలుగూ, గ్రామ్యమూ, కళాద్రుత ప్రకృతికాలూ, సంధులూ, విభక్తులూ వివరింప బడినవి. ద్వితీయాశ్వాసంలో సమాస, క్రియావిశేషణాలూ, యతిప్రాసలూ, శబ్దాల సాధుత్వా సాధుత్వాలూ చర్చించ బడినవి. తృతీయాశ్వాసంలో రేఫ, శకటరేఫల వివరణం ఉన్నది. అప్పకవి వలెనే రేఫ, శకటరేఫల పదాలను తిమ్మకవియే విపులంగా తెల్పినట్లు కానవస్తున్నది.

పరిష్కర్త తమ 'సమీక్షణం'లో తిమ్మకవి కృతులు, లక్షణసార సంగ్రహప్రతులు, నామ విచారణ, గ్రంథ రచనావశ్యకత, ఆంధ్రభాషా విభాగములు, తిమ్మన చేసిన అన్యలాక్షణిక ప్రస్తావన, కొన్ని సంశయాస్పద శబ్దాల సాధుత్వ విచారణ, శకట రేఫలు, పూర్ణార్థ బిందువులు మొదలైన వాటిని గురించి చర్చించి పండితులు కూడా గ్రహించదగిన విషయాలను వివరించారు. గ్రంథం చివరి అనుబంధాలలో హ్రస్వాలపైని, దీర్ఘాలపైని రేఫలుండే పదాలకూ, శకటరేఫలున్న పదాలకూ, రేఫాంత పదాలకూ తిమ్మకవి ననుసరించి పట్టిక లిచ్చారు. తిమ్మన చూపిన కొన్ని పద రూపాలను తెలిపారు. ఉదాహృత గ్రంథాల లోని పద్యాలకు సూచిక ఇచ్చారు. దేశ్య, అచ్చతెలుగు పదాలకు వివిధలాక్షణికులకు వుండే అభిప్రాయభేదాన్ని పెద్ద పట్టిక ద్వారా తెలిపారు. ఈ పట్టిక లెంతో ముఖ్యమైనవి. ఈ విషయాలన్నీ పరిష్కర్త చేసిన నిశితపరిశీలనాన్ని వ్యక్తపరుస్తున్నవి.

సహృదయులైన శ్రీ సంపత్కుమారాచార్య తమకు ప్రోత్సాహ, సహకారాల్ని అందజేసిన శ్రీ విదుదవోలు సుందరేశ్వర రావు, శ్రీ తీర్థం శ్రీధరమూర్తి, డాక్టరు రామరాజు, శ్రీ నోరి-నరసింహశాస్త్రిగారు మున్నగువారినీ, మొదట్నుంచీ అన్నివిధాలా తోడ్పడిన తమ సోదరుడు డా. సుప్రసన్నాచార్యులనూ అభినందించడం ఆయన సహృదయతకు నిదర్శనం.

ఇట్టి అలభ్యమైన ఉత్తమగ్రంధాన్ని ప్రకటించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారినీ మనం అభినందించవలసి ఉన్నది.

శ్రీ బులుసు వేంకటరమణయ్య.

రెండు సీరియల్ నవలలు

(గృహిణి—రచన : శ్రీ పి. గణపతి శాస్త్రి; ప్రచురణ : యం. శేషాచలం అండ్ కో— మచిలీపట్నం : మద్రాసు : సికింద్రాబాదు : ఎమెస్కో పాకెట్ బుక్స్ : 152 పేజీలు : వెల రూ. 2—50. మొదటిభాగం.

రామరాజ్యానికి రహదారి : రచన : శ్రీ పాలగుమ్మి పద్మరాజు; ప్రచురణ : యం. శేషాచలం అండ్ కో. మచిలీపట్నం : మద్రాసు : సికింద్రాబాదు: ఎమెస్కో పాకెట్ బుక్స్ : 152 పేజీలు : వెల. రూ. 2—50. మొదటి భాగం)

ఈ సీరియల్ నవలలు రచయిత లిద్దరూ ప్రసిద్ధులే. నవలా రచయితలుగా గాక కవులుగా, కథా రచయితలుగా ప్రసిద్ధి పొందినవారు. నవలా రచనలో కూడ వీరికివి ప్రథమ ప్రయత్నాలు కావు. శ్రీ గణపతిశాస్త్రి విశాల నేత్రాలు; కాశ్మీర పట్టమహిషి అన్న నవలలను యిదివరకే రచించారు. సాంఘిక నవలా రచనలోమాత్రం వీరికిది ప్రథమ ప్రయత్నమే నని చదువుతున్నప్పుడే ఎవరికైనా తెలుస్తుంది. రచయితలందరూ అన్ని ప్రక్రియలలోను విశిష్టమైన రచనలు చేయలేక పోవచ్చు. అందుకని ఒక ప్రక్రియలో చేయి తిరిగిన రచయిత మరొక ప్రక్రియలో చేయి చేసుకో కూడ దనటం న్యాయంకాదు. కొందరు మొదట్లో

తమ నే ప్రక్రియలో భావాలను వెల్లడించగలిగే శక్తి ఉన్నదో తెలుసుకోలేక పోవచ్చు. తరువాత తరువాత తమ భావాలను శక్తిమంతంగా చెప్పగలిగిన నాడు ఆ ప్రక్రియలోనే తమ సాధనను కొన సాగిస్తారు. కాని ఆ రచయితలను వారి మొదటి కీర్తితో గౌరవిస్తూ యీ పద్ధతి కూడ వారికి నలిగిన బాటే అని నమ్మిన వారికి ఆశాభంగం కలుగుతుంది. గణపతిశాస్త్రిగారు మంచి భాషాజ్ఞానం ఉన్న పండితులు. విద్వత్కవి. మహాభారత వచనమేగాక రాజతరంగిణి గాథలను తెలుగులో వెలువరించిన సారస్వత వేత్తలు. చారిత్రక నవలా రచనలో విశాల నేత్రాలు విశిష్టమైన రచన. కాశ్మీర పట్టమహిషి నవలలోని యితివృత్తం వెగటు కలిగించేదే అయినా చరిత్రను మార్చటం ఎవరి తరం? సంస్కృత సాహిత్యంలో ఎన్నో కథలుండగా కాశ్మీర పట్టమహిషి కథనే ఎన్నుకొని నవలా రచనలో నేటి సమాజం అంగీకరించలేని న్యాయాన్ని ఆకర్షవంతంగా చిత్రించడం మాత్రం చోద్య మనిపిస్తుంది. 'గృహిణి' నవలలో యీ ప్రథమ భాగంలో ఉన్న కథలో ఏమీ కొత్తదనం లేదు. పార్థసారథి అనే గృహస్థు నాటకాల వ్యామోహంలో తనతోపాటు నటించే సరస అనే నటి మోజులో పడి ఆస్తి పాడు చేసుకుంటాడు. అతడి యిల్లాలు విజయలక్ష్మి ఎన్ని కష్టనష్టాలు పడినా భర్తను మాత్రం విడిచిపెట్టి వెళ్లలేక పోతుంది. అప్పుడప్పుడూ అన్యాయాన్ని, బాధలను భరించలేక ఎదురుతిరిగినా, ఆమె 'అదే పనిగా రెచ్చగొట్టానంటే మరింతగా తాడుబారిపోతాడు. అయిన దేదో అయి పోయింది. అనవసరంగా సంసారం గొడవ చేసుకుంటే మాత్రం పోయిన ఆస్తి తిరిగి వస్తుంది కనకనా? నా మాట విను తల్లీ! అతని నింక ఏమీ అనను. చూసీ చూడనట్టు మాట్లాడ కూరుకో! పోనీ యీ వేళకి కాకపోతే రేపటికయినా దారికి రాకపోతాడా?' అన్న అమ్మమ్మ మాటలను నమ్ముకొని అట్లాగే మసలుకుంటూ ఉంటుంది. పార్థసారది సరసతో కలిసి భార్యకు చెప్పకుండ మద్రాసు వెళ్ళటంతో యీ భాగం ముగిసింది.

కథలో కొత్తదనం లేకపోగా గణపతిశాస్త్రి గారి రచన కూడ ఉత్సుకత కలిగించేదిగా లేదు. సంభాషణలు చప్పగా ఉన్నాయి. నవలంతా ఒకే మోస్తరు రచనతో వైవిధ్యం ఏమీలేక ఎత్తుగడ, నిర్వహణ అంతా ఒకేవిధంగా విసుగు పుట్టించేదిగా ఉన్నది. పండితులు కాబట్టి శబ్ద దోషాలు లేకపోవచ్చుగాని పాత్రోచితంగా ఉండవలసిన సంభాషణలు పేలవంగా మూసపోసినట్లుగా ఉండి నిరుత్సాహం కల్గిస్తున్నాయి. గణపతిశాస్త్రిగారి వంటి విద్వాంసులు సాంఘిక నవలను కూడ సమర్థవంతంగా వ్రాయగల రనుకొన్నవారికి యీ నవల ఎంతో నిరాశ కలిగిస్తుంది.

శ్రీ పాలగుమ్మి పద్మరాజు గొప్ప భావుకులు. 'ప్రతిభ' సంపుటాలలో వచ్చినవారి కవితాఖండికలు మరపు రానివి. తెలుగు కథల ఖ్యాతిని పెంచి 'గాలి వాన' కథకు అంతర్జాతీయ బహుమతి అందుకున్నారు. వ్రాసిన కథలన్నీ నిపుణమైన కథన శిల్పంతో మిరుమిట్లు గొలుపుతూ ఆ కథలు పద్మరాజుగారు మాత్రమే వ్రాయగలరనిపించేవి వ్రాశారు. పెక్కు రేడియో నాటకాలు, నాటికలు రచించి శ్రోతలకు సంతృప్తిని, ఆనందాన్ని కల్గించారు. శ్రవ్య నాటక శిల్పాన్ని బాగా ఆకళించుకొన్న కొద్దిమంది రచయితలలో వీరొకరు. సంభాషణలు రచించటంలో దిట్ట. లోకపరిశీలనం పద్మరాజుగారి ప్రతిభకు బాగా తోడునిల్చి కలకాలం నిలువదగ్గ రచనలు చేయించింది. సన్నివేశాలను రూపుకట్టించి ఆయా వ్యక్తులను కళ్లముందు నిలిపేటప్పుడు పద్మరాజు గారు మనుష్యుల కదలికలను నేర్పుతో రచిస్తారు. రేఖా చిత్రాలు గీసేవారు కొద్ది రేఖలతోనే మనిషిరూపాన్ని రచించ గలిగినట్లు కొద్దివర్ణనతోనే, ఆ మనుష్యులను మనస్సులలో చిరస్మరణీయంగా నిలపటం పద్మరాజు గారి ప్రత్యేకత. పాత్రల మనస్సులలో లోతులకు వెళ్లివారి మంచి చెడ్డలతో నిమిత్తం పెట్టుకోకుండ నిర్లిప్తంగా వారిని స్వీకరిస్తారు. అందుకే పద్మరాజు గారి పాత్రలు characters గాని caricatures కావు. వాస్తవికతకు పట్టంకట్టి కరుణను కలిగించి

మనస్సులను కదిలించటం వీరి రచనలలో ప్రధానంగా కన్పిస్తుంది. ఏ వర్గానికీ, ఏ సిద్ధాంతానికీ కట్టు బడకుండా వ్రాయటంలో వాస్తవికతకే అత్యంత ప్రాధాన్య మియ్యటం వలన ఒక్కొక్కసారి వారి రచనలు లక్ష్యశుద్ధి లేనివిగా తయారవుతున్నవి.

తమ మీద పడ్డ కీర్తిని మొయ్యలేనట్లు, ప్రతి భను హరాయించుకో లేనట్లు పద్మరాజుగారు 'బాజా గాబర్ సలహోలు'వంటి రచనలను చేయబూనటం విచారకరం. నవలా రచనకు ఆలస్యంగా పూనుకొన్న ప్పటికీ వచన రచనలో చేయితిరిగినవారు గనుక నవలా శిల్పాన్ని ఒడుపుగానే సాధించగలిగారు. ప్రబతికిన కాలేజీ, రెండవ అశోకుడి మూణ్ణాళ్ల పాలనలలో హాస్య వ్యంగ్యాలు కొంత విదేశీ సరుకనిపించినా వైవిధ్యాన్నీ కోరేవారు వాటినీ ఆదరిస్తారు ఇక నల్లరేగడి కమ్మని తెనుగు నుడికారాన్ని పొందికైన కవితా భావనను సంతరించుకుని పల్లెపట్టునుండే జీవన దృశ్య సంపుటిని ప్రదర్శిస్తున్నది. కాని సినిమా టిక్‌గా ఆయన పాత్రలను, ముగింపునూ మలిచేసరికి ఉత్తమ నవల కావలసిన ఆ రచన విలువ తగ్గి పోయింది.

స్వాతంత్ర్యోద్యమం నాటి మధ్య తరగతి సంసా రాన్ని ఆలంబనంగా చేసుకొని ఆనాటి సంఘ జీవితాన్ని వర్ణించే పెద్ద నవల 'రామరాజ్యానికి రహదారి'. వీరుల త్యాగఫలం, ప్రతిఫలాన్ని ఆశించకుండ ఉద్యమంలోని కురికిన ఎన్నో చల్లారిన సంసారాలు, స్వాతంత్ర్యం సిద్ధించగానే మారిపోయిన ఎన్నో ఊసరవెల్లుల అసలు తత్త్వాలూ, యీనగాచి నక్కలపాలు చేస్తామని ఊహించని ఆనాటి అమాయక వీరుల నిష్కల్మష మైన దేశభక్తీ, వారిలో వారికి ఉన్న సంఘీభావమూ, 'మనందరికీ ఒక్కడే శత్రువు వాడు బ్రిటీషువాడు' అనే ఆవేశమూ యీ నవలలో చదువరులను ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. ఎన్నో పాత్ర లున్నప్పటికీ వేటి కవే స్ఫుటమైన వ్యక్తిత్వంతో తీర్చిన ఆకారంతో చదు వరుల కళ్లముందు నిలుస్తాయి. నవలలో వచ్చిన ఏచిన్న పాత్రనూ మరచిపోలేం. విశాలమైన పెద్ద Canvass లో గొప్ప చిత్రకారు డెవరైనా, ఏ యుద్ధా నికి తరలివెళ్లే సైన్య సమూహాన్నో చిత్రించినప్పుడు ప్రతి రేఖను రచించటంలోను ప్రత్యేక శ్రద్ధ తీసు కున్నట్లే ప్రతి పాత్రను, ప్రతి సన్నివేశాన్ని చిత్రిం చటంలోను తమ శక్తిని కనబరచారు.

ప్రముఖ కాంగ్రెస్ నాయకులు పంతులుగారు, జాతీయవాదియైన డాక్టర్ డాకూ, మాలదాసు, సాయెబు శాస్త్రి; సుబ్బన్నశాస్త్రి; సుబ్బరాజు, డాక్టర్ సాంబశివుడు గారూ ఆయన కుటుంబమూ, ముఖ్యంగా విచిత్ర దంపతులైన లక్ష్మి సూరీ—వీరందరి కథను ఆనాటి సంఘటనలను వివరించే ప్రధాన పాత్ర గోపాలం, అతడి భార్య సీత, కొడుకు రంగడు-- అందరూ మనుష్యులే. ఎవ్వరూ లోకోత్తరులు కారు. అందరిలోను బలహీనత లున్నాయి. వాళ్లందరికీ దేశ భక్తి ఉన్నది. యధాశక్తి త్యాగం చెయ్యటానికి ముందుకు వచ్చినవారే.

అందరినీ కూడగట్టుకొని రావటంలోనూ, లౌక్య ప్రజ్ఞను ప్రదర్శించి ఉద్యమాన్ని నడిపిం చటంలోను పంతులుగారు ప్రజ్ఞావంతులు. ఆయు ర్వేద వైద్యంలోనే స్టెతస్కోపు వాడుతాడు డాకూ. ఇంగ్లీషు వాళ్ల యంత్రసామగ్రికి, అలవాట్లకు ప్రతిగా జాతీయతను చూపిస్తాడు. ఆయుర్వే దపు మందులను ఇంగీషుమందు బిళ్లల్లాగ, కాఫీకి బదులుగా 'మధురసాయనం'—యిట్లాగే యింగ్లీషు వాళ్ల పద్ధతులన్నీ నేర్చుకొని వాళ్లను వెళ్లగొట్టా లంటాడు. బ్రతక నేర్చినవాడు. జైలుకు వెళ్లటం లోను లౌక్యాన్ని చూపిస్తాడు. 'మన జిల్లాలో ఇన స్పెక్టర్ సుబ్బిగాడు ఎముకలు విరగ్గొడుతున్నా డురా...అనుమానం ఉన్నవాళ్లందర్నీ ఇళ్లమీదపడి దంచుతున్నాడు. రాజమండ్రి కొచ్చేశా. మా దూరపు బంధువు—సబ్ ఇనస్పెక్టరు. మంచికుర్రాడు. ఒరే చంద్రం ఓ కుంపటీ కాసిని ఉప్పునీళ్లు తగలేయించు. మీ ఇంటి ముందే ఉప్పు చేసేస్తాము. నన్ను అరెస్టు చెయ్యి అన్నాను. చేశాడు. సుఖంగా జరిగిపోయింది. ఆరునెల్లు విడిఖైదు వేయించు కున్నాను' అని గోపా

లంతో చెప్తాడు. ఆ రోజుల్లో యిల్లాంటి వాళ్లందరో! అల్లాగని డాకూ ద్రోహికాడు. దేశభక్తుడే. ఆపదలో దిక్కులేకుండ ఉన్న పసిపిల్లలను తన బిడ్డలుగా పెంచిన ఉదారుడే. ఇట్లాగే అందరూ. ఉప్పు సత్యాగ్రహంలో సుబ్బరాజు ప్రదర్శించిన సాహసాన్ని చదువుతున్నప్పుడు ఒళ్లు పులకిస్తుంది. నలుగురు పోలీసులుపట్టి బలవంతాన గుప్పిళ్లు తెరవటానికి ప్రయత్నించినా విడువకుండ ముడుసులు పగిలినా, చర్మం చిట్లినా, రక్తం కారినా అకుంఠిత దీక్షతో నిలబడిన సుబ్బరాజు పెద్దగా చదువుకోలేదు. బలవంతుడు. పోలీసుల్ని చీపురు పుల్లలుగా విరిచెయ్యగలనంటాడు. కాని గాంధీజీ అనుచరుడిగా అహింసను పాటిస్తానంటాడు.

తెలుగులో స్వాతంత్ర్యోద్యమాన్ని వర్ణించే నవలలు కొడవటిగంటి వారు వ్రాసిన చదువు; మహీధర రామమోహనరావుగారి కొన్ని రచనలలోను వచ్చినా మొత్తం మీద తక్కువే. మూడు దశాబ్దాల క్రిందటి చరిత్రను నవలగా మలచటంలో పద్మరాజుగారు వాస్తవికతను నిలబెట్టటానికి యత్నించారు కాని నవలలో ఆ నాటి జస్టిస్‌పార్టీపై రచయిత చూపించిన సానుభూతిని కమ్యూనిస్టుపార్టీపైన చూపించలేదు. పేదవాళ్లు ఉపన్యాసాలు చెయ్యకపోవచ్చుగాని త్యాగాలు చెయ్యటంలో వెనుకబడి ఉండరు. మధ్యతరగతి లాగ సంపన్నులలాగ జైళ్లకు పోకపోయినా ఏ ఉద్యమపు తీవ్రతనైనా నిజంగా అనుభవించేది వాళ్లే. పెంకుటిల్లు తిరుగవేయించపోతే శిథిలమై కూలిపోతుందనీ ఛిన్నా భిన్నమైన మధ్యతరగతి సంసారం త్యాగఫలితంగా నాశనమౌతుందని జాలిపడిన రచయిత ఆనాటి పేదల కడగండ్ల నంతగా పట్టించుకోలేదు. బహుశా తాము ఎన్నుకొన్న పరిధికి అది దూరంగా ఉన్నదేమో!

స్వాతంత్రోద్యమపు చరిత్రను వాస్తవికతతో నవలగా రచించటమైతే వారి ప్రయత్నం సఫలమైనట్లే. కాని మనం సంపాదించింది 'రామరాజ్యం' కాలేదని వారు వ్యంగ్యంగా చెప్పదలచుకున్నారు గదా! ఆ ప్రయత్నంలో మాత్రం వీరు తగినంతగా కృతకృత్యులు కాలేదు. అధిక సంఖ్యాకులైన శ్రామికులకు కూడు దొరకని రాజ్యం ఎప్పుడూ రామరాజ్యంకాదు. ఒకవేళ ఎవరైనా దానిని ఆ పేరుతో పిలిచినా 'అన్నమో రామచంద్రా' అని అల్లాడుతున్న ప్రజలెందరో స్వాతంత్రపు రధ చక్రాలకింద పడి నలిగిపోయినవారే. నలిగిపోతున్నవారే. ఈ శతాబ్దపు చారిత్రక నవలలు కొద్ది. శిల్పదృష్టితో చూచినప్పుడు పద్మరాజుగారి నవల ఉత్తమ నవల అని చెప్పవచ్చు. వాస్తవికతను కొన్ని కోణాలనుండి మాత్రమే వీరు చూచారని చెప్పవలసి ఉంటుంది. అన్నికోణాలనుండి సరిగా గమనించి చారిత్రక నవల వ్రాయటం ఎంత అసాధ్యమో వేరే చెప్పనక్కరలేదు. ఇది సమర్థుడైన రచయిత చేసిన ఒక మంచి ప్రయత్నం. ఇంకా మంచి ప్రయత్నం ఎవరైనా చెయ్యవచ్చు.

శ్రీ రామమోహన రాయ్,

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu chetty Street, Madras-1. Editor : S. Radhakrishna.

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్ రేట్లు	కాంట్రాక్టు రేట్లు
4 వ కవరు పేజీ	...	రు. 175 –	రు. 150 –
2 లేక 3 వ కవరు పేజీ	...		
ఒకే (నలుపు) రంగు	...	రు. 150/–	రు. 125/–
లోపలి పేజీలు			
పూర్తి పేజీ	...	రు 125/–	రు. 100 –
అర పేజీ	...	రు. 65/–	రు 55/–
పావు పేజీ	...	రు 40 –	రు. 35/–

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

సం॥నకు వరుసగా 6 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

చందా వివరములు

సంవత్సర చందా	...	రు. 12—00
6 మాసముల చందా	...	రు 6—00
విడి ప్రతి	...	రు 1—00

మేనేజరు, భారతి

మద్రాసు—1.